# మార్నింగ్ కాఫీ

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

కథలు

# మార్నింగ్ కాఫీ

**డా॥ కేతవరపు రాజ్యశ్రీ కథలు**

**ప్రథమ ముద్రణ : జూన్ 2021**

**వెల : రూ. 150/-**

**కాపీలు : 500**

**ప్రతులకు :**

**డా॥ కె. రాజ్యశ్రీ**

ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్,

స్ట్రీట్ నెం. 4, అశోక్ నగర్, హైదరాబాద్ -500 020.

ఫోన్ : 040-2765 0267, సెల్ : 85001 21990

ఇ-మెయిల్ : rketavarapu@gmail.com

website : **www.rajyasri.com**

డి.టి.పి. :

**టి. రాజేంద్రప్రసాద్**

ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్ : **9989890588**

ఇ-మెయిల్ : rajendratammisetty4@gmail.com

# విషయసూచిక


1. మార్నింగ్ కాఫీ ........ 13
2. బామ్మా! తెగ నచ్చేశావు ........ 17
3. 'మూడ్స్'ను పాడు చేసే 'యాడ్స్' ........ 23
4. మబ్బు తొలగిన మనసు ........ 28
5. కారు.. మా వారు! ........ 31
6. తన్మయ దృశ్యం ........ 34
7. మై కాల్ ఈజ్ నెప్పింగ్ ........ 38
8. ఆమె ధైర్యలక్ష్మి ........ 42
9. గాభరా గాభరా... ........ 46
10. న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి ........ 51
11. ఏ విజిట్ టు జైల్ ........ 57
12. హతవిధీ – చూపు మా దారి ........ 61
13. పెద్ద గీతా – చిన్న గీతా ........ 67
14. ఎదురు చూపులు ........ 74
15. కరోనా నేర్పిన పాఠం ........ 79
16. వేధింపులు ఇలా కూడా వుంటాయా ........ 85
17. కళ్లజోడు ........ 90
18. లైఫ్ సర్టిఫికేట్ ........ 95






తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్

# అంకితం



తన సాహితీ కరదీపిక నేటినిజం ద్వారా

ఎందరికో కవితా స్ఫూర్తిగా నిలిచిన


సహృదయులూ

ఆత్మీయ సాహితీ మిత్రులు

బైస దేవదాస్ గారికి

డా॥ కేతవరపు రాజ్యశ్రీ






111 మంది రచయితల "కథా సంకలనం కథాకేళి"లో నా కథ ప్రచురితమై ప్రపంచ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికేట్ తీసుకుంటున్న సందర్భంలో



నియోగి గారు రాసిన విమర్శనా గ్రంథం "అక్షరాల అడుగు జాడల్లో పంచ సహస్రావధాని" పుస్తకం డా॥ కేతవరపు రాజ్యశ్రీ, శ్రీమతి కుసుమ కుమారిగార్లకి అంకితమిచ్చిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥ కె.వి. రమణాచారిగారు, నియోగి, బైసా దేవదాస్‌గార్లు

# వాస్తవికతకి అద్దం పట్టిన కథలు

కేతవరపు రాజ్యశ్రీ రచించిన 18 కథలు తెలుగింటి కథలు. వాస్తవమైన జీవితానుభవాల నిధులు. మార్నింగ్ కాఫీతో మొదలై లైఫ్ సర్టిఫికేట్‌తో కథాసంపుటి పూర్తి కావటం జీవిత ప్రస్థానాన్ని చూపించటమే ఈ కథల్లో వున్న పాత్రలు, సంభాషణలు మనందరివి. అందుకే ఈ కథలో ఆత్మీయతా స్పర్శ వుంది.

ఇంటి ముందరి అరుగు చాలా ఇష్టం ఆ ఇల్లాలికి. అంతేకాదు పొద్దున్న లేచి కాఫీ కప్పుతో అరుగు మీద కూర్చోటం మరీ ఇష్టం. పేపరులో తాజా వార్తలు తిరగేయటం అలవాటు. ఈ కథలో విశేషం ఒకటి గుండె పట్ల కదిలించే వాస్తవముంది. “ఆ అరగంట సేపు మాత్రమే నాకోసం నేను కేటాయించుకున్న టైమ్” – నిజమే కదా! ఇల్లాలు తన సమయమంతా ఇంట్లో వాళ్ళ కోసమే గడుపుతుంది అందుకే ఆ అరగంట అయినా ఆమెకి కావాలిగా! – ఇది ఇల్లాళ్ళందరి గొంతు రాజ్యశ్రీ వినిపించింది.

ఈ కథల్లో తెలుగుతనం రాసులుపోసి అందించింది రచయిత్రి. ఒకనాటి తెలుగిళ్ళలో బామ్మగారు ఎలా వుండేవారో అని నేటితరం వారికి తెలియాలంటే, బామ్మ తెగ నచ్చేసిన కథ చదవాల్సిందే. పెళ్ళి భోజనాలకి వెడితే, బామ్మ మరచెంబు, గ్లాసు, కంచం వెంట తీసుకెళ్ళేది. ఇది పరిశుభ్రతకి సూచన. పిల్లలు స్కూళ్లనించి రాగానే, పుస్తకాల సంచీ మీద, టిఫిన్ బాక్స్ మీద పసుపు నీళ్ళు జల్లేది. ఇది చాలా సహజంగా ఆనాటి బామ్మ గారిని చూపించిన రాజ్యశ్రీని అభినందిస్తూ, బాల్యంలో బామ్మలు, అమ్మమ్మలు తెలిసినవారు ఈ కథలో వాళ్ళ బామ్మల్ని చూసుకుని మురిసిపోతారు అనటం అతిశయోక్తి కాదు. భర్తతో కారులో పెళ్ళికెళ్ళటం చాలా అద్భుతమైన హాస్యకథ. కారు పార్కింగ్ చెత్తకుండీ పక్కన వుంచటం. పెద్ద పట్టుచీర, నగలతో వున్న ఇల్లాలు చెత్తకుండీ పక్కన కారులోంచి దిగటం ఎంత చిరాకో కదా! చెత్తకుండీ దగ్గర పార్కింగ్ చేస్తే ఎవరూ పోటీకి రారు, కారు తీసేప్పుడు తేలిక అనేది భర్తగారి వాదన. ఏం చేస్తుంది, పాపం, ఇల్లాలు హాయిగా, హుషారుగా కారులో షికారు పోదమా అని పాడుకుంటూ, పెళ్ళిళ్ళకు పేరంటాలకు వెడుతూనే వుంది ఆ ఇల్లాలు.

ప్రతి కథలోనూ ప్రతి వారి అనుభవాలు అద్దం పడతాయి. కరోనా నేర్పిన పాఠం పూర్తిగా నూటికి నూరుపాళ్ళు వాస్తవకథ. “మీ కథ చదివాను బాగుంది”తో మొదలైన

ఫోన్ సంభాషణ, కరోనా కష్టాలలో వున్న డబ్బు సాయం చేయండని పూర్తి చేస్తాడు ఒక వ్యక్తి. ఆ వ్యక్తి అలా అప్పటికే చాలామందికి ఇలానే ఫోన్ చేసాడు. నిలదీస్తే, నేను కాదు, నా పేరున ఎవరో మీకు ఫోన్ చేసి డబ్బులు కొట్టేసారు అంటాడు. కష్టాల్లో వున్న వారికి సాయం చేయాలా, వద్దా, ఇలా ఎన్నిసార్లు మోసపోవాలి అనే సంఘర్షణలో ఇలాటి పరిస్థితుల్లో, అందరికీ ఎదురౌతుంది కదా! ఇది అందరి అనుభవంలో వున్నదే.

పని మనుషులు లేకపోతే రోజు గడవదు ఏ ఇల్లాలికైనా. మనమరాలి పెళ్ళి 20 వేలు అప్పు ఇయ్యిమంటుంది లక్ష్మి. అప్పటికే 10 వేల అప్పు బాకీ ఉంది. సహాయం చేయాలా వద్దా అని తెగ ఆలోచించి, సరే చూస్తాలే అంది. ఆ ఇల్లాలి అత్తగారికి అనుకోకుండా ఆపరేషన్ – చాలా డబ్బు కావాలి. భర్త స్నేహితుడు సమయానికి ఆదుకుని అప్పు ఇచ్చాడు. ఈ చిన్న సంఘటనకి పెద్ద గీత–చిన్న గీత అనే పేరు కథకి పెట్టింది రాజ్యశ్రీ. దేవుడికి దీపం పెడుతోంటే అంతరాత్మ ప్రబోధం వినిపించింది. లక్ష్మికి మనమరాలి పెళ్ళికి అప్పు కావాలి. నాకు అత్తగారి ఆపరేషన్‌కి అప్పు కావాలి. గీతలోకటే, కాకపోతే పెద్ద చిన్నా తేడాలంతే.

ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేరిన, తెలుగు మీడియంలో చదివి వచ్చిన అమ్మాయి బాధలు, అమెరికాలో వున్న అమ్మాయిల, అబ్బాయిల పెళ్ళి సమస్యలు, మొదలైన ఎన్నో అంశాలు కథాంశాలయ్యాయి ఈ సంపుటిలో. తన్మయ దృశ్యం కథ మాతృత్వానికి పరాకాష్ఠ అయిన కథ. కాలు నొప్పిగా వుందని డాక్టర్ దగ్గరవెళ్ళి వచ్చాక, శ్రేయోభిలాషులు చెప్పే ఉచిత సలహాలకు పిచ్చెక్కినట్టే అయిన, హతవిధీ – చూపుమా దారి కథ, కళ్ళజోడు కథ – నెత్తిమీద కళ్ళజోడు పెట్టుకుని ఇల్లంతా వెతకటం, నీకు డబ్బు విలువ తెలిస్తేగా, మొగుడు ఇంకోటి కొంటాడని ధీమా! అంటూ అవకాశం వచ్చింది కదా అని భర్త దెప్పి పొడవడం, మగాళ్ళ షర్టుకి జేబులుంటాయి కనక పెట్టుకుంటారు అంటే, చీరలకి జేబులొస్తున్నాయని భర్త అనటం – ఇది ఇంటింటి కథే – కళ్ళజోడే కాదు, సిగపిన్నులు, పెన్నులు వెతుక్కోటమో!

రాజ్యశ్రీ కథల్లో చర్లపల్లి జైలు చూడటానికి వెళ్ళటం అనేది ఎంత సహజసుందరంగా వుందో మాటల్లో చెప్పలేను.. ఆ దృశ్యాలు చూస్తున్న అనుభూతి కలిగింది. నన్నెందుకు తీసుకెళ్ళలేదు నీతో అని రాజ్యశ్రీపై కోపం వచ్చింది నాకు. సింగపూర్, మలేషియా కలిసి వెళ్ళిన చనువుతో.

చివరగా లైఫ్ సర్టిఫికెట్ ఏడాదికి ఒక్కసారి పెన్షన్ ఆఫీసులో ఇస్తే చాలు. కానీ ఈ మధ్య పెద్దవాళ్ళ, ముసలివాళ్ళు అలా వెళ్ళొద్దామా, ఇంటర్‌నెట్ ద్వారా పంపండి చాలు అంది ప్రభుత్వం. అధునిక సాంకేతికత తెలియక కొన్ని ఇబ్బందులు. ఏది ఏమైనా రిటైరయి, పెన్షన్ తీసుకుంటుంటే, ఎవరి మీదా ఆధారపడకుండా బతికేయచ్చని ఒక ధైర్యం. కాని నేటి సమాజంలో మానవ సంబంధాలు ఎంత కౄరంగా వున్నాయో చెప్పారు రాజ్యశ్రీ. ఇలాంటివి చాలామంది దగ్గర వింటున్నాము. కొడుకులు, కోడళ్ళు తల్లికి కడుపు నిండా తింటి పెట్టడానికి వెనుకాడినా, పెన్షన్ డబ్బు తల్లి నుంచి లాక్కోడానికి వెనుకాడటం లేదనేది పరమసత్యం. అందుకే, తల్లిని కాబట్టి వృద్ధాప్యపు పెన్షన్ లాక్కుని తాగడానికి ఖర్చు చేస్తున్న కొడుకు ఒకడైతే, ఘరానాగా తల్లి డబ్బు లాక్కుని ఖర్చు చేసే కొడుకు మరొకడు. తేడా ఒకటే అది గుడిసె సంస్కృతి, ఇది మేడలో సంస్కృతి!! మానవీయ విలువలు తరిగిపోతున్న కాలంలో జీవిస్తున్నాం – నిజమే మరి!

రాజ్యశ్రీ కథలు చదవటానికి చాలా హాయిగా వున్నాయి. కథాంశాలన్నీ మనకి తెలిసినవి. మన అనుభవంలో వున్నవి కనుక ఇవి మన కథలే అనే తృప్తితో చదువుతున్నాము. తెలుగింటి వాతావరణాన్నీ, తెలుగుతనాన్నీ నింపిన ఈ కథల సంపుటి అందరిళ్ళల్లోనూ ఉండాలి. మీరు చదివి మీ స్నేహితులచేత చదివించండి.

ఇలాటి కథాసంపుటాలు మరిన్ని రాజ్యశ్రీ కలం నుండి జాలువారాలని ఆశిస్తూ, మంచి కథలు మధురంగా రాసి పాఠకలోకానికి అందించినందుకు అభినందనలు.

**డా॥ ముక్తేవి భారతి**

తేది : 4-6-2021

# నా మాట

అడపా దడపా కథలు రాస్తూ, అవి వివిధ పత్రికలు, కథా సంకలనాలలో ప్రచురింపబడినా, నేను కవయిత్రిగానే ఎక్కువ ప్రాచుర్యం పొందాను. ఇలా ప్రచురితమైన కథలన్నీ ఒక సంకలనంగా తీసుకురావడానికి కారణం దాదాపుగా నా పుస్తకాలన్నిటినీ డి.టి.పి. కమ్ ప్రింటర్ రాజేంద్రప్రసాద్. మేడమ్ ఈ కరోనా టైంలో నాకూ ఎక్కువ పని లేదు. మీరు రాసిన కథలన్నీ పుస్తకంగా వేద్దాము అంటూ! నేను రాసిన 18 కథలు తీసుకుని (కొన్ని దొరకలేదు) ప్రింట్ అవుట్స్ తెచ్చి ఒకసారి చెక చేసుకుని ఇవ్వండి అంటూ లాక్‌డౌన్ మొదలయ్యే లోపల ఇంటికి తెచ్చి ఇచ్చాడు. అలా వాటిని ఒకసారి చదివి సరే పుస్తకం వేద్దామని చెప్పాను.

కవిత రాస్తున్నప్పుడు, అనంతమైన భావాన్ని కుదించి, 20-30 పాదాలలో రాయడం చాలా మేధావితనమే! అది పద్యకవిత కానీ, వచన కవిత గానీ, లఘు కవిత కానీ, ఇలా భావాన్ని కుదించి రాస్తున్నప్పుడు ఇంకా ఏదో చెప్పాలని ఆరాటం వుండేది నాలో. ఆ ఆరాటమే కథలరూపం దాల్చింది.

నేను రాసిన ఈ కథలు, "ఆంధ్రప్రభ (సండే మ్యాగజైన్)", "స్వాతి", "తెలుగు తేజం", "మహిళా విజయం", "తేజో ప్రభ"లలో ప్రచురింపబడినాయి. ఇందులోని కొన్ని కథలు వేదగిరి రాంబాబుగారి సంపాదకత్వంలో వచ్చిన డైరెక్ట్ సంకలనాల్లో రెండు కథలు, జ్యోతివల్లభజు సంపాదకత్వంలోని కథాకేళిలో, వంశీ రామరాజుగారు, తెన్నేటి సుధా దేవిగార్ల సంకలనంలో నిర్వహించిన కొత్త కథలు, కథా సంకలనంలో చేతన కథఝురిలో ప్రచురితమయినాయి.

నేలవిడిచి సాములేనట్లే, అనుభవాలతో సంబంధంలేని కవిత్వంగానీ, కథ గానీ ఉండదు. సమాజంలో తన చుట్టూ వున్న వాళ్లను, తనను ప్రభావితం చేస్తున్న అంశాలకు స్పందిస్తూ వుంటుంది కథావస్తువు. నేను రాసిన ఈ కథల్లో శ్రీవారి మీద వ్యంగ్యంగా రాసినవి వున్నాయి. అలా అని అవి స్వానుభవాలే కనక్కరలేదు. స్నేహితులతో మాట్లాడినప్పుడు, ఇలాంటి ప్రస్తావనాలు వస్తే, దీని మీద ఒక కథ రాయరాదూ అని అన్నప్పుడు, కొంత సహజం కొంత కల్పితం జోడించి రాసినవి. కొన్ని స్వానుభవాలు వున్నాయి.

ఇందులో కథలు చదువుకోవడానికి సరదాగా “లైటర్ వే”లో వుంటాయి. వాటిని చదివి చక్కని ముందు మాట రాసిచ్చిన ప్రముఖ కథారచయిత్రి, నాకు అత్యంత ఆత్మీయురాలు అయిన డా॥ ముక్తేవి భారతి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

వయసు తారతమ్యం లేకుండా చిన్నా పెద్దా రచయితలన్న భేదం లేకుండా అందరితో కలిసిమెలిసి ‘ఏమోయ్’ అంటూ ఆత్మీయంగా పలకరిస్తారు భారతిగారు. మేమిద్దరం కలిసి ప్రపంచ తెలుగు మహాసభలకు, సింగపూర్ వెళ్లినప్పుడు, విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు వెళ్లినప్పుడు, ఎంతో కలుపుగోరు తనంగా, హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గడిపిన సమయం నాకు అత్యంత ఆనందాన్నిచ్చింది, వారికి మరోమారు నమస్సులు.

అలాగే బైసా దేవదాసుగారు నా కవితా సంకలనాల ఆవిష్కరణ సభలకు వారు చాలా సార్లు విచ్చేశారు. తన ‘నేటి నిజం’లో నా పుస్తకాల సమీక్షలు కవితలు, ఆర్టికల్స్, కవితా సభల ఫోటోస్ ప్రచురించి ప్రోత్సహించిన బైసా దేవదాసుగారు ఒక మంచి మిత్రులు. అప్పుడప్పుడు ఫోన్ చేసి ఏమిటి ఈ మధ్య ఏమీ రాసి పంపడం లేదు అంటూ హెచ్చరిక చేస్తారు. వారి హెచ్చరిక మేరకు కవిత రాసి పంపడం అది అచ్చు వేయగానే, వారికి ఫోన్ చేసి నాలో కవితా స్ఫూర్తిని వెలికితీస్తున్నందుకు వారికి ధన్యవాదాలు చెబుతూ మార్నింగ్ కాఫీ కథల పుస్తకాన్ని వారికి అంకితమిస్తున్నాను.

పుస్తక ముఖచిత్రాన్ని అందంగా వేసిన ప్రముఖ కార్టూనిస్ట్, నాకు ఆత్మీయ మిత్రులు, సచివాలయ సహోద్యోగి, “సరసి” గారికి కృతజ్ఞతలు.

నేను ఏది రాసినా అది కవిత గానీ, కథ గానీ చదివి తమ అమూల్య అభిప్రాయాలు తెలిపే స్నేహితులు కామేశ్వరిగారికి, స్కూల్ ఫ్రెండ్ వనజ, రాజ్యలక్ష్మి, ఆఫీస్ ఫ్రెండ్స్ కుసుమ, నవనీతం, కృష్ణవేణి, అలాగే సచివాలయ స్నేహితులు, మనసు పంచుకునే స్నేహితులు దుర్గ, పద్మ విజయలక్ష్మి, అక్కచెల్లెళ్లు, జయశ్రీ, సులోచన, విజయశ్రీ, మా చిరంజీవులు కొడుకు ఫణీంద్ర, కోడలు వత్సల, అమ్మాయి ప్రియాంక, అల్లుడు శ్రీమత్ మా వియ్యపురాళ్లు కనకదుర్గ, వాణీకుమారి గార్లకు కృతజ్ఞతలు.

మొదటగా చెప్పాల్సిన వ్యక్తి, ఆఖరుగా చెప్పినా ఏమీ అనుకోని వ్యక్తి, నా రచనా వ్యాసంగానికి నిశ్శబ్దంగా తోడ్పాటునిస్తు మా శ్రీవారు మాధవరావుగారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**– డా॥ కేతవరపు రాజ్యశ్రీ**

# 1

# మార్నింగ్ కాఫీ

మా ఇంటి మొత్తంలో నాకు బాగా ఇష్టమైన చోటు మా ఇంటి ముందరి అరుగు. దాని తరువాత కొంచం నాపరాళ్లు పరచిన స్థలం. తరువాత కంచె. దానికి అల్లుకున్న సన్నజాజి తీగ. పక్కనే మందార చెట్టు. ఉదయాన్నే విచ్చుకునే మందారాలు. దాని పక్కన అదే మొలిచి, కాయలు కాస్తున్న నిమ్మచెట్టు. మనం ఏమీ పోషణ చెయ్యకపోయినా అల్లుకున్న మనీప్లాంట్, కలబంద. బయట నీళ్లు చల్లి ముగ్గెస్తూ పనిమనిషి వాటికి కూడ కాసిని నీళ్లు పోస్తుంది. పెద్దగా నేనేమీ శ్రద్ధ చూపకపోయినా ఇంటికి అందాన్నీ, నాకు ఆహ్లాదాన్నీ ఇస్తూ వున్నాయి.

ప్రొద్దున్నే ఎవరూ లేవకముందు కాఫీ కలుపుకుని, కాఫీ కప్పుతో అరుగు మీద కూర్చుని, పిల్ల తెమ్మెరలు మేస్తూ, వేడివేడి కాఫీని చుక్కచుక్క ఆస్వాదిస్తూ తాగడం నా దినచర్యలో భాగం. అప్పుడే, పేపరు కుర్రాడు వేసిన పేపర్లో తాజా వార్తాల హెడ్ లైన్స్ ఒకసారి తిరగేస్తాను. గుండమ్మ కథలో, రమణారెడ్డి పేపరు చదువుతూ, ఏముంది ఈ పేపరులో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, అంటూ ఏకరువ పెడతాడు. అలాగే పేపరు మొదటి పేజీలో మానభంగాలు, పెట్రోలు ధర పెంపు, ధర్నాలు, వరకట్న హత్యలూ ఇలా లైనుగా మనసు కలచివేసే వార్తలు. నేను చాలా సెన్సిటివ్. తొందరగా భావోద్వేగానికి లోనవుతాను. ఈ మధ్య మానసిక వైద్యుల సలహాలు కూడా పేపర్లో వేస్తున్నారు. మానసిక ఆందోళన కలిగించే వార్తలు, టి.వి.లోగానీ, వార్తా పత్రికల్లోగానీ చదివి ఉద్రేకానికి గురికాకండి. ఆరోగ్యకరమైన, ఆనందం కలిగించే విషయాలను చదవడం వలన, మనకి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది అని. అందుకే గబగబా హెడ్ లైన్స్ వైపు దృష్టి సారించి లోపలి పేజీల్లో, మహిళలకు కేటాయించిన ప్రత్యేక పేజీలోకి వెళ్లిపోతాను. అందులో, సామాన్య, బీద కుటుంబాల్లో పుట్టిన స్త్రీలు, కలెక్టర్లుగా, వ్యాపారవేత్తలుగా, ఇంక అనేక రంగాల్లో రాణిస్తున్న వారి గురించి ఇంటర్వ్యూలు, తరువాత ఆరోగ్యసూత్రాలు, పిల్లల పెంపకం, సౌందర్య

చిట్కాలు, ఇలాంటివి వుంటాయి. ఒకసారి ఆ విశేషాల వెంబడి కళ్లు పరుగులు తీస్తుంటే, ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది. పిల్లల పెంపకం గూర్చి ప్రత్యేకంగా “బామ్మ గారి సలహా” అంటూ ఒక కాలమ్ వుంటుంది.

కొంతమంది తల్లులు, పిల్లలు వద్దన్నా, నోట్లో కుక్కుతుంటారు. నోరులేని పిల్లలు ఏం చేస్తారు. చివరికి వాంతి చేసుకుంటారు. అయ్యో, అసలే పిల్ల ఏమీ తినలేదు, దానికితోడు, వాంతి చేసుకుంది అంటూ కంగారు పడిపోతూ, డాక్టరు దగ్గరకు పరిగెడతారు. ఆయనకేం పోయింది. తన ఫీజు తీసుకుని ఆకలికో మందు, అరగడానికో మందూ, బలానికో మందూ రాసి, మళ్లీ వారం తరవాత ఎలా వుందో చెప్పమంటాడు. తమ పిల్లలకేదో చాలా పెద్ద జబ్బు వచ్చిందని భయపడుతూ, మందులు మింగిస్తారు. డబ్బు వదలించుకుని తమ కంగారు తగ్గించుకుంటారు.

దాని బదులు, పాప తిననప్పుడు, కొంచెం అజీర్తి చేసిందేమోనని, అందుకే వద్దనుకుంటోదని అనుకోరు. ఒక్క పూట వాళ్లు వద్దన్నపుడు, నోట్లో కుక్కకుండా వుంటే, ఆకలేసినప్పుడు వాళ్లే తింటారు. చెప్పడం చేతకాని పిల్లలు, ఆకలేస్తే ఏడుస్తారు. అది భగవంతుడు పిల్లలు పుడుతూనే వారికి ఇచ్చిన విద్య.

కొత్తగా తల్లులైన స్త్రీలందరు ఈ విషయాల్ని పుస్తకాలలో చదివి, లేక పెద్దవారినెవరినైనా కనుక్కుని, చిన్న చిన్న చిట్కా వైద్యాలతో పిల్లలకు స్వాంతన కలిగించాలి. కానీ ఎంతమంది తల్లులు ఇవి చదువుతారు. పిల్లలు తుమ్మినా, దగ్గినా గూగుల్ ఓపెన్ చేసి చూడటం వాడు ఏదో కూసిన కూతలు ఆచరించడం ఒక ఫ్యాషన్ అయింది. దాంట్లో కూడా అమ్మమ్మ చిట్కాలే వుంటాయి. అవి తెలీక తామేదో మోడ్రన్ అనుకుని పురుడుపోసిన అమ్మకి, అమ్మమ్మకి ఏమీ తెలియదు అనుకుంటూ తమ పిల్లల్ని అధునాతనంగా పెంచుతున్నామనుకుంటున్నారు నేటితరం తల్లులు.

అది చదివిన తరువాత, మా పక్కింట్లోకి కొత్తగా దిగిన వనజకి చెప్పాలని అనుకున్నా. వనజ రోజూ పిల్ల అన్నం తినట్లేదు ఆంటీ అంటూ వాపోతూ వుంటుంది. ఇలా ఉదయం కాఫీ తాగుతూ పేపర్ చదివిన ఈ హాయి ఆ రోజంతా, ఇంటి పని, పిల్లల పని, ఆఫీసుకెళ్లి పని చేయడానికి టానిక్‌లా పని చేస్తుంది.

అలా ఉషోదయాన్ని, ఆ పూలమొక్కలు చూస్తూ, కాఫీ చప్పరిస్తూ మనసంతా హాయితనాన్ని అనుభవించే, ఆ అరగంట సేపు మాత్రమే నాకోసం నేను కేటాయించుకున్న టైమ్.

ఇంట్లోకి వెళ్లగానే, పిల్లలిద్దరినీ లేపి, బ్రష్ చేయించడం, పాలు తాగించి, స్నానాలు చేయించడం, టిఫిన్ పెట్టి, యూనిఫామ్ వేసి, స్కూల్ ఆటోవాడు వచ్చే టైమ్‌కి రెడీ చేసి స్కూల్‌కి పంపడంతోఒక ఘట్టం పూర్తి అవుతుంది. తరువాత నాదీ, మావారిదీ, బ్రేక్‌ఫాస్ట్, మళ్లీ లంచ్ బాక్సులు సర్దుకోవడం, పిల్లలు చిందరవందర చేసిన ఇంటిని సర్దుకుని తయారయి ఆఫీసుకి బయలుదేరడం. ఇలా ప్రతిరోజూ రొటీన్ డ్యూటీ. లేడీస్ అన్నింట్లో ఫర్‌ఫెక్ట్ అనడానికి నిదర్శనంగా, ఠంచనుగా ఆఫీసుకి వెళ్లి అటెండెన్స్‌లో రెడ్‌మార్క్ లేకుండా సంతకం పెట్టి హమ్మయ్య అంటూ సీట్లో కూలబడటం. మళ్లీ ఫైళ్లల్లో మునిగిపోయి, సాయంత్రం ఇంటికొచ్చిన తరువాత ప్రొద్దున్న సీన్ రిపీట్ అవుతుంది. పిల్లలు పడుకోగానే, వంటిల్లు సర్దుకోవడం పక్కమీద వ్రాలడం.

ఈ రొటీన్ పనిలో నాకంటూ కాసేపు హాయిగా వూపిరి పీల్చుకునే టైమ్, ప్రొద్దున్నే గట్టు మీద కూర్చుని కాఫీ తాగుతూ పేపర్ చదవడం.

ప్రతి రోజూలాగే, సింహాసనం లాంటి ఆ అరుగుమీద కూర్చోబోతుండగా, గట్టుమీద ఏర్పడిన పగులల్లోంచి చిన్న కలుపు మొక్క తొంగి చూసి నన్ను చూడగానే, గుడ్‌మార్నింగ్ అంటూ పలకరించింది. అరే! నా ఆనందం పంచుకోవడానికి, ఇంకో ప్రాణి కూడా వచ్చిందే అనుకుంటూ, చిరునవ్వుతో దానికి బదులిచ్చాను.

దినదినం ప్రవర్ధమానమవుతూ, తన అస్థిత్వాన్ని నిరూపించుకుంటున్న, ఆ మొక్కను పలకరించి, కాఫీ తాగడం, నా దినచర్యలో మరో భాగంగా మారింది. పేపరు చదివిన తరువాత, దానికి కాసిని నీళ్లు తెచ్చి పోద్దామని ప్రతిరోజూ అనుకుంటా. కానీ లోపలికి వెళ్లగానే ఏదో హడావిడిలో మర్చిపోతా. నా దగ్గరనుంచి ఏమీ ఆశించకుండానే, నేను నీళ్లు పొయ్యకుండానే, అది పెరుగుతోంది. నారు పోసినవాడు, నీరు పొయ్యడా అన్న నానుడి ఈ చిన్న మొక్క ఎదగడం చూస్తే, నిజమే కదా అనిపించింది. ప్రతిరోజూ అనుకోవడమే కానీ, నన్ను శుభోదయమంటూ పలకరిస్తున్న ఈ మొక్కకి, నీళ్లు పొయ్యకపోవడం, నిజంగాత క్షమించరాని విషయం.

కానీ, ఉదయం అరగంటసేపు మాత్రమే నా కోసం నేను కేటాయించుకోగల టైమ్. ఇంట్లోకి వెళ్లగానే, సంసార సాగరం ఈదడంలో, మొక్క సంగతే గుర్తుకు రాదు. మర్నాడు అలవాటుగా, కాఫీ కప్పుతో గట్టుమీద కూర్చుంటూ, మొక్కను పలకరిద్దామని దానివంక చూశా!

ఆశ్చర్యంగా, చూపుడు వేలంత ఎదిగిన ఆ మొక్క కొనాభాగాన, మంచు బిందువులతో తడిసి, స్నిగ్ధ మనోహరంగా వున్న, గులాబీరంగు చిన్నిపూవు, అందంగా, హుందాగా, నిటారుగా శుభోదయం అంటూ నన్ను పలకరించింది. వేలెడంత లేని, ఈ మొక్కకి, ఈ పూవెలా పూసింది. ఒక్కరోజు నేను కాసిని నీళ్లు పోయలేదు, అనుకుంటూ, సంభ్రమాశ్చర్యాలతో, కళ్లు విప్పార్చుకుని ఆనందంగా దానివంక చూశా.

ఆ చిన్న గులాబి పువ్వుని చూస్తూ, తాగిన కాఫీ ఈ రోజు మరింత రుచిగా అనిపించింది. కానీ మనసు మారుమూల, గిల్టీ ఫీలింగ్. ఏనాడూ చుక్కనీరు పోయని నాకు, ఎంత ఆనందాన్ని ఇస్తోంది ఈ మొక్క అనుకుంటూ దానివంక పరికించి చూశాను.

ఆ గడుగ్గాయి పిసరంత పవ్వు నావంక చూసి వ్యంగ్యంగా నవ్వినట్టు అనిపించింది. "ఏంటోయ్! నువ్వు పోసే నీటిచుక్క కోసం నాలాంటి మొక్కలు ఎదురు చూస్తూ కూచుంటే, ఈ భూమ్మీద అసలు చెట్లే వుండవు. రాతిలో కప్పకు నీరందించిన ఆ దేవుడు నాకందించలేడా?

నేనొక కలుపుమొక్కను నేనెవరికీ పనికి రాకపోయినా, పరోపకార బుద్ధితో పర్యావరణ రక్షణకు నావంతు కృషి చేస్తూ, స్వచ్ఛమైన ప్రాణవాయువు, మీకు అందించడానికీ, నావంతు సహాయం చేయడానికి పుట్టాను నేను అన్నట్టనిపించింది. నీరు పోయలేదని నువ్వు బాధ పడకు అని అంటూ నన్ను ఓదారుస్తున్నట్టుగా, ధీమాగా నావంక చూసింది.

ప్రతి మనిషినీ, దేవుడు ఏదో ఒక ప్రయోజనం కోసం పుట్టిస్తాడు. ఈ చిన్నిమొక్కకు, తెలిసినంత జ్ఞానం, మనిషి కూడా తెలుసుకుంటే, ఆత్మన్యూనతా భావాన్ని అధిగమించవచ్చు. సమాజానికి, తనవంతు సహకారం అందించవచ్చు. పేరు ప్రతిష్టల కోసం పాకులాడకుండా, నిశ్శబ్దంగా "పరోపకార మిదం శరీరం" అన్న భావనతో జీవించాలి అంటూ ఈ చిన్ని కలుపు గులాబి, నాకెంత గొప్ప సందేశాన్ని ఇచ్చింది అని ఆశ్చర్యానందాలు ముప్పిరిగొన్నాయి నాలో...

# 2

# బామ్మా! తెగ నచ్చేశావు

"భోజనాలకి వెళ్లేటప్పుడు
చేతిలో 'కిన్‌లే' వాటర్ బాటిల్
ముక్కుకి ఆక్సిజన్ సిలిండర్
తగిలించుకెళ్ళే రోజులు
దగ్గరలోనే వున్నాయి"

పదేళ్ల క్రితం ప్రతివాళ్ల చేతిలో వాటర్ బాటిల్ చూసి ఇలా రాశాను. ఇప్పుడు కరోనా సమయంలో నీళ్ల సీసాతో బాటు ఆక్సిజన్ సిలిండర్ కూడా ఎంత అవసరమో రోజూ పేపర్లలో చూస్తూ చదువుతూనే వున్నాం.

అప్పట్లో కిన్‌లే వాటర్ బాటిల్ చేతిలో ఉండటం ఓ స్టేటస్ సింబల్. విదేశీయులో, లేకపోతే విదేశాలకి వెళ్లి వచ్చినవారో, నీళ్ల బాటిళ్లు వెంట తెచ్చుకునేవారు. ఇక్కడి వారందరం, మామూలుగా, ఎక్కడికెళ్లినా, ఎవరింట్లో మంచి నీళ్లు ఇచ్చినా తాగేవాళ్లం.

"అతిధి దేవో భవ" అన్నారు కదా! ఇంటికి ఎవరు వచ్చినా ముందు మంచినీళ్లు ఇవ్వమంటారా అని అడిగి, రాగానే ఎండను పడి వచ్చారని, కుండలోంచో, ఫ్రిజ్‌లోంచో చల్లటి మంచినీళ్లు తెచ్చి ఇచ్చేవాళ్లం.

ఇప్పుడు ఇంటికి వచ్చినవారిని మంచినీళ్లు కావాలా అని అడిగితే, గాభరాపడుతూ, అబ్బెబ్బే! వద్దండీ మేము ఫిల్టర్ వాటర్ తెచ్చుకున్నాము అంటూ హ్యాండ్‌బ్యాగ్‌తో పాటు, లేక చేతిలో తెచ్చుకున్న, ఇంకో చిన్న సంచీలోంచి నీళ్లసీసా తీసుకుని, ఈ సీసాలో వేడినీళ్లు పోస్తే వేడిగా, చల్లనీళ్లు పోస్తే చల్లగా వుంటాయి అంటూ వాళ్ల నీళ్లు వాళ్ళే గటగటా తాగి చాలా నాగరికులమని ఫీల్ అవుతున్నారు.

నిజానికి ఇలా ఎవరి నీళ్లు వాళ్లు తెచ్చుకోవడమనేది మనకి కొత్తేమీ కాదు. మా చిన్నప్పుడు మా బామ్మ మంచినీళ్లు నల్లా (కొళాయి) రాగానే, తన కంచు చెంబులో ఫ్రెష్‌గా మంచినీళ్లు పట్టుకుని, దానిమీద తెల్లగా తోమి మెరుస్తున్న కంచుగ్లాసు పెట్టి, తన మంచం కింద పెట్టుకునేది. బిందెలో నీళ్లయితే, అందరూ చేతులు ముంచుతారు, నాకిష్టం లేదనేది. ఇప్పుడు ఆలోచిస్తే ఆవిడ ఎంత శుచిగా వుండేదో అనిపిస్తుంది.

అలాగే ఏవైనా పెళ్లిళ్లకి కానీ, శుభకార్యాలకి గానీ పిలుస్తే, ఒక సంచీలో చీర, జాకెట్టు, చేతి తుండు, వెండి కంచం, వెండి గ్లాసు, కంచు మరచెంబులో నీళ్లు పెట్టుకుని బయలుదేరేది. పెద్దావిడ, "ఆవిడ పట్టుకోలేదు మీరెవరన్నా పట్టుకోండి అంటూ" నాన్నగారు మాకు హుకుం జారీ చేసేవారు. నిజం చెప్పద్దూ! ఆ పాత సంచీ పట్టుకుని వెళ్లడం చిన్నతనంగా అనిపించేది. పైగా కంచు చెంబు, దాని నిండా నీళ్ళతో, సంచీ చచ్చేంత బరువుగా వుండేది.

"ఏంటి బామ్మా నీ చాదస్తం! అక్కడ విస్తళ్లను శుభ్రం చేసే భోజనాలు పెడతారు కదా! పెద్ద నువ్వేదో గొప్పదానివని, అందరికీ తెలియాలా, వెండి కంచంలో తప్ప తినవా! పైగా ఈ మంచినీళ్ల మరచెంబు పట్టుకు బయలుదేరుతావు. ఎక్కడికి భోజనాలకి వెళ్లాలన్నా, మొయ్యలేని దానిని ఇవన్నీ ఎందుకు! పైగా మమ్మల్ని పట్టుకెళ్లమని మా నాన్న చేత సిఫారసు ఒకటి. ఎంచక్కా పట్టులంగా కట్టుకుని, ఈ సంచీ మోసుకెళ్లాలంటే, నాకెంత నామోషీగా వుందో తెలుసా?" అంటూ ఆవిడని విసుక్కునే దాన్ని.

బామ్మ చిరునవ్వు నవ్వుతూ "నా కొడుకుకి, నేనంటే ప్రేమ. నేను పట్టుకోగలను. కానీ, మీరు తీసుకొస్తే, పెద్దవాళ్లని గౌరవిస్తున్నట్టు వుంటుందని..." అది మీ నాన్న మీకు అలవాటు చేస్తున్నాడు. "నేనేదన్నా చెబితే, చాదస్తం అంటూ విసుక్కుంటారు గానీ, మన కంచం, గ్లాసు, మంచినీళ్లు తీసుకుని వెళితే, శుచీ, శుభ్రత రెండూ వుంటాయి. మళ్లీ కడిగి పెట్టేసుకుంటే అందరి ఎంగిళ్లు కలవకుండా వుంటాయి. విస్తళ్లు ఎంత శుభ్రం చేసినా, ఇంతమంది మీద, హడావిడిగా చేస్తారు. వాటిమీద ఏ పురుగో పాకి వుండవచ్చు. మనకు తెలీదు కదా! ఎందుకు హాని కోరి తెచ్చుకోవడం? పైగా వెండి కంచం మధ్యలో, చిన్న బంగారు పువ్వు వుంది చూశావూ, అది మనం తిన్న ఆహారం అరుగుదలకి ఉపయోగపడుతుంది" అంటూ ఉపన్యాసం దంచేది.

సరే సరే! చక్కగా పట్టుచీర కట్టుకున్నావు కదా! మరి ఈ నేత చీర ఎందుకు తెచ్చుకున్నావు. అందరిలో పరువుపోదూ? అన్నాను. ఎలాగైనా ఆ సంచీ మోసే బాధ

తప్పించుకోవాలని.

"అదా!" అని నవ్వుకుంటూ భోజనం చేసేటప్పుడు ఈ పట్టుచీర మార్చుకుని దాన్ని కట్టుకుని చేస్తాను. నేనే కాదు, కాస్త శాస్త్రం తెలిసిన వాళ్లేవరయినా ఇలానే చేస్తారు. మనం అన్నం తినేటప్పుడు, ఒక్కొక్కసారి ఎంత జాగ్రత్తగా వున్నా, చిన్న మెతుకు కానీ, పులుసు పోస్తుంటే, తుంపర్లు గానీ మీద పడతాయి. పట్టుచీర, మాటిమాటికీ ఉతకలేము కదా! అందుకని, వాయిలు చీర కట్టుకుని భోజనం చేస్తాం. ఇంటికి రాగానే ఉతికేసుకుంటే సరిపోతుంది. పట్టుచీరతో భోజనం చేస్తే, మళ్లీ పూజలకి కట్టుకోకూడదు.

పట్టుచీర ఘనంగా వుంటుందని కట్టుకుంటామే కానీ, రెపరెపలాడుతూ ఉక్కపోస్తుంది. "హాయిగా మెత్తటి వాయిలు చీర కట్టుకుని, భోజనం చేస్తే ఎంత సుఖంగా వుంటుందో మీకేం తెలుసు? చిన్నపిల్లలు" అంటూ మెత్తమెత్తగా, నొచ్చుకోకుండా చెప్పేది. ఈ సంచీలో ఇంత కథ వుందా అనుకుంటూ, ఇక ఆ పాత సంచీ మోసుకుంటూ ఆవిడ చేయి పట్టుకుని తీసుకువెళ్ళేదాన్ని.

ఇంతేనా, బామ్మ చాదస్తంతో ఎన్నో ఇబ్బందులు. ఆఫీసు నుంచి రాగానే బామ్మ గురించి నాన్నగారికి ఏదన్నా చెబితే, అంతా వినేసి, ఆవిడ పెద్దావిడ, చెప్పింది చేస్తే సంతోషిస్తుంది అంటూ మాట మారుస్తూ లోపలికి వచ్చి మొట్టమొదటగా, బామ్మ మంచం దగ్గరికెళ్లి ఆవిడని మందులేసుకున్నావా అని పలకరించి, చేతిలో దానిమ్మ పండో, యాపిల్ పండో పెట్టేవారు. ఆ రోజుల్లో యాపిల్ పండు తినడం గొప్పగా వుండేది. ఇంట్లో అందరికీ కొనడం, కష్టం కనుక ఒకటి పట్టుకొచ్చి ఆవిడకిచ్చేవారు. అప్పుడు మాకు కొంచెం గుర్రుగా వున్నా, ఆయన తల్లిదండ్రులకిచ్చిన గౌరవం చూసి, మేము కూడా అమ్మానాన్నలని అలాగే చూసుకోవడానికి అది పునాది వేసారని, తరువాత అనుభవంలోకి వచ్చింది.

మేము స్కూల్ నుంచి వచ్చేసరికి, ఒక చెంబులో నీళ్లు, పసుపు వేసుకుని గుమ్మంలో రెడీగా వుండేది. అప్పట్లో స్కూల్‌కి పుస్తకాలు చేతిలో పట్టుకునే వెళ్లేవాళ్లం. టిఫిన్ బాక్స్‌ని పుస్తకాల పైన వుంచి నడుస్తూ వెళ్లేవాళ్లం. పుస్తకాలు సరస్వతీదేవి, వాటి మీద టిఫిన్ డబ్బా పెడితే సరస్వతీదేవిని ఎంగిలి చేసినట్టవుతుందనీ, చదువు సరిగ్గా రాదనీ గొడవ పెట్టేది బామ్మ. ఎడంచేత్తో పుస్తకాలు, కుడిచేతిలో టిఫిన్ డబ్బా పట్టుకుని, బయట వరకూ వచ్చేవాళ్లం. బయటికి రాగానే, రెండు చేతులూ కట్టేసినట్టున్నాయని, పుస్తకాల మీద పెట్టుకుని ఫ్రీగా నడిచేవాళ్లం. మళ్లీ ఇంటికి వచ్చే ముందు, టిఫిన్ డబ్బా

విడిగా పట్టుకుని లోపలికొచ్చేవాళ్లం. మా అమాయకత్వం వలన బామ్మకి ఏమీ తెలియదు అనుకునేవాళ్లం. కానీ ఆవిడకి మా మీద అనుమానమే. అందుకే స్కూల్ నుంచి ఇంటికి వచ్చే టైమ్‌కి పసుపునీళ్లు పట్టుకుని "పుండరీకాక్ష, పుండరీకాక్ష" – అంటూ పసుపు నీళ్లు మా నెత్తిమీద పుస్తకాల మీద, బట్టల మీద చల్లేది.

అయ్యో! బామ్మ స్కూల్ డ్రెస్ అంతా పసుపు మరకలు అయ్యాయి. రేపు స్కూల్లో టీచరు చూస్తే, బెంచీ ఎక్కిస్తుంది అంటూ గొడవ పెట్టేవాళ్లం. "ఆ బుద్ధి ముందే ఉండాలి. నా కళ్ళు కప్పాలని చూస్తారా? అంటూ తను చెయ్యాల్సింది చేసేసి లోపలికి వెళ్లిపోయేది.

స్కూల్ నుంచి ఇంట్లోకి రాగానే గేటు పక్కన ఒక నల్లా ఉండేది. అక్కడే కాళ్లూ కడుక్కుని లోపలికి రావాలి. సరిగ్గా కాళ్లు కడ్కుకున్నామా లేదా అని చూస్తూ నెత్తి మీద పసుపునీళ్లు చల్లెది. బట్టలు మార్చుకునే గదిలోకి వెళ్లడానికి సెపరేటుగా ఎంట్రెన్స్ వుండేది. స్కూల్ డ్రెస్ మార్చుకుని వేరే బట్టలు వేసుకునేందుకు గదిలో పైన తాడుతో దండెం వుండేది. దాని మీద స్కూల్ డ్రెస్ వేసి వేరే బట్టలు కట్టుకుని బయటికి వచ్చేవాళ్లం.

ఇదంతా కూడా బామ్మ పర్యవేక్షణలో నడిచేది. ఇలా శుచిగా తానుంటూ, మా అందరి చేతా, ఒక హెడ్ మాస్టర్‌లా నుంచుని చేయించేది. "అబ్బబ్బ ఈ పిల్లలు కాళ్లుచేతులూ కడుక్కొని బట్టలు మార్చుకోవడానికి, నా శక్తి అంతా ధారపోస్తున్నాను" "ఉష్" అంటూ అలసిపోయినట్టు తన మంచం మీద కూర్చునేది. ఆ మంచం మీద ఎవరినీ కూచోనిచ్చేది కాదు. మడి ఆవిడకి.

ఇక శనివారం రోజు బామ్మ దానధర్మాలు చేసేది. ఆ రోజు, ముందుగా స్నానం చేయకుండా కొన్ని చిల్లర డబ్బులు, ఒక సోలడబ్బాలో బియ్యం, పాతచీరలు దగ్గర పెట్టుకుని బయట వరండాలో కూచునేది.

ప్రొద్దున్నే 8-00 గం॥లకు మొదలు కార్యక్రమం. మొదటగా సర్వోదయా వాళ్లు డబ్బా పట్టుకొని వచ్చేవాళ్లు. వాళ్లకి, వేదం చదువుతూ వచ్చిన బ్రహ్మడికీ, వారి సంచీలో కృష్ణార్పణం అంటూ బియ్యం పోసేది. తరువాత ఒక కుంటివాడు. వాడికి పదిపైసలు (అప్పట్లో పది పైసలు అంటే 5 పప్పుండలు వచ్చేవి). తరువాత ఇద్దరు ముస్లిమ్ స్త్రీలు వచ్చేవాళ్లు. "యా అల్లా" అనుకుంటూ.

మా బామ్మకి ఎంత ఆచారమున్నా, దానధర్మాల్లో కులమతాల పట్టింపు వుండేది కాదు. "యమ్మే" యా అల్లా. అంటూ వాళ్లు రాగానే, "రండి రండి మీ కోసమే కూచున్నా,

ఇవాళ ఆలస్యం చేశారే, నాకు స్నానానికి టైమ్ అవుతోంది” అంటూ ఇద్దరికీ విడివిడిగా పది పైసలు ఎత్తి వాళ్ల జోలెలో వేసేది. ఒకవేళ తన దగ్గర చిల్లర లేక 20 పైసల నాణెం వుంటే ఇద్దరూ పంచుకోండి, పోట్లాడుకోకండి అంటూ ఒకామె చేతికిచ్చేది.

ఒక్కొక్కసారి బామ్మ దగ్గర అర్ధరూపాయి వుంటే, వాళ్లని చిల్లర అడిగేది. వాళ్ల ఇరవై పైసలు పోగా, 3 పది పైసల బిళ్లలు తిరిగి ఇచ్చేవారు “అవి అక్కడ పెట్టండి” అని, ఇన్ని పసుపు నీళ్లు వాటిమీద చల్లి, “పుండరీకాక్ష” అంటూ తీసుకునేది. అంటే ఆ డబ్బు మీద ఏవైనా వైరస్ ఉండచ్చు అని పసుపు నీళ్లు చల్లి తీసుకునేది. ఇప్పుడు కరోనా టైమ్‌లో రూపాయి కాగితాలను సానిటైజ్ చేసుకున్నట్టు.

బామ్మ ఏదో వాళ్లకి బాకీ వున్నట్టు ప్రతి శనివారం వాళ్లు “యామ్మా” యా అల్లా అంటూ వాళ్లు ఆ వీధి చివర అరుస్తుండగానే, బామ్మా, నీ మేకలు అరుస్తూ వస్తున్నాయి. రెడీగా వుండు అంటూ ఆవిడని ఆటపట్టించే వాళ్లం. అలా ఎక్కిరించకండర్రా! వచ్చే పుణ్యం కాస్తా పోతుంది. నేను చేసేదంతా నా కోసమా! మీ అందరూ బావుండాలని “కాటికి కాళ్లు చాచుకున్నదాన్ని” ఆ దేవుడు ఎప్పుడు పిలుస్తే అప్పుడు రెడీగా వున్నాను అనేది. అలా నలుగురైదుగురు బిచ్చగాళ్లకి ధర్మం చేసేది.

కాసేపటికి కూరగాయలమ్మాయి వచ్చేది. దానితో ఆ మాటా ఈ మాటా మట్లాడుతూ, దాని కష్టసుఖాలన్నీ విని తనకు తోచిన వైద్యం చెబుతూ, నవ నవలాడే వంకాయలు, బెండకాయలు, ఆకుకూరలు ఏరిఏరి కొనేది. దాని చేతికి డబ్బు ఇచ్చి, పాత చీరలు రెండూ తీసి ఇచ్చి, “ఇదిగో నా చీరలు ఫ్యాషన్‌గా లేవని అనుకోకు. పిల్లలకి పక్క కింద వేస్తే మెత్తగా వుంటాయి” అంటూ వాటిని ఎలా వాడుకోవాలో కూడా చెప్పి ఇచ్చేది.

తరువాత ఆ నవనవలాడే వంకాయలు, ఆవిడ బేరం చేసి తీసుకున్న వైనం అంతా, కోడలితో (అదే మా అమ్మతో) చెప్పి, చక్కగా గుత్తొంకాయ కూర చేయమని ఆర్డర్ జారీ చేసి స్నానానికి వెళ్లేది.

సాయంకాలం చీకటి పడుతుండగా తొక్కుడు బిళ్ల ఆటలాడుతుంటే, సాయంకాలం, భూదేవి విశ్రాంతి తీసుకునే వేళ. పదఘటన చేయకూడదు అనేది. నవ్వుతూ, తుళ్లుతూ మేము కబుర్లు చెప్పుకుంటుంటే, “నవ్వు నాలుగు విధాల చేటు”, ఆనాడు ఆ ద్రౌపదికి ఆ నవ్వుతోనే అన్ని కష్టాలు వచ్చాయి అంటూ కళ్లు తుడుచుకుని, ఉప్పుతో దిష్టి తీసి, బట్టలు మార్చుకుని కాళ్లూ చేతులూ కడుక్కుని రమ్మని చెప్పేది. సాయంకాలం ఇల్లంతా సాంబ్రాణి పొగ వేసేది దుష్టశక్తులు పోతాయని.

ఇప్పుడు కరోనా టైమ్‌లో ఎండలో 'డి' విటమిన్ వుంటుంది. ఎండలో కూర్చోండి అని సలహాలు ఇస్తున్నారు. బామ్మ ప్రతిరోజూ స్నానం చేయగానే సూర్యనమస్కారాలు చేసేది. అలా "డి" విటమిన్ సంపాదించుకునేది. ఆ రోజుల్లో బామ్మ చిన్నపిల్లలకి పసికరులు అయితే, పిల్లల్ని కాళ్ల మీద వేసుకుని ఎండలో కూర్చునేది. 3 రోజుల్లో తగ్గిపోయేది.

కాస్త సీజన్ మారగానే, జలుబు, జ్వరాలు వచ్చేవి. జలుబు, జ్వరం వున్న వాళ్ళని పడుకోబెట్టిన గదిలోకి ఎవరినీ వెళ్లనిచ్చేది కాదు. పత్యంగా వేడివేడి మిరియాల చారు, మెత్తగా చేసిన అన్నంలో, మజ్జిగ, కొంచం ఉప్పు వేసి పెట్టేవారు. వేడి వేడి నీళ్లలో పసుపు వేసి ఆవిరి పట్టించేవాళ్లు. తాగడానికి గోరు వెచ్చటి నీళ్లు, టెంపరేచర్ తగ్గడానికి తల మీద తడిబట్ట ఆరగా ఆరగా వేసేది. డెటాల్ వేసి గది అంతా శుభ్రంగా తుడిపించేది. కదలకుండా పడుకోమనేది అంతే! 3 రోజుకల్లా జ్వరం తగ్గిపోయేది. లంఖణం పరమోషధం అని, చాలా లిమిటెడ్‌గా ఆహారం ఇచ్చేవాళ్లు. దాంతో రోగనిరోధక శక్తి పెరిగేది.

నిజానికి బామ్మకి అక్షరం ముక్క చదవడం రాదు. కానీ రామాయణ, భారతాలు, సామెతలు, ధర్మాలు, ధర్మసూక్ష్మాలు, ఆచార వ్యవహారాలు అన్నీ కంఠతా వచ్చు. అలాగే తన జీవితం ధర్మబద్ధంగానే గడిపింది.

అప్పుడు బామ్మ చేసే పనులన్నీ చూసి విసుక్కునేదాన్ని. ఇప్పుడు కరోనా టైమ్ రాగానే బయట దేశాల వాళ్లు, చేతులు, కాళ్లు కడుక్కోండి, బయట నుంచి రాగానే బట్టలు మార్చుకోండి, దూరం పాటించడం, శుచీ, శుభ్రతలు పాటించండి అంటూ వూదరకొడుతుంటే, మనందరం మన పురాణాలు తిరగేసి "అవును ఆ శాస్త్రంలో అలా వుంది, ఈ శాస్త్రంలో ఇలా వుంది అంటూ, ఇలా కరోనా వస్తుందని బ్రహ్మంగారు కాలజ్ఞానంలో ఆనాడే చెప్పాడు'' అని మన పెద్దలు చెప్పినవన్నీ స్ఫురణకు తెచ్చుకుంటున్నాము.

ఇలా మన ఇళ్లల్లో బామ్మలు, ఇటువంటి మహమ్మారి రోగాలు రాకముందే ప్రతినిత్యం శుచీ, శుభ్రతలు పాటించేవారు. అప్పట్లో బామ్మ చెబుతున్న ఆచారాలన్నీ చాదస్తం అని విసుక్కున్నా, అవన్నీ ఇప్పుడు గుర్తుకొచ్చి ఎంత ముందు చూపుతో ఈ ఆచారాలన్నీ పాటించి, మాచేత కూడా చేయించేది కదా! బామ్మ అనుభవసారం ఈనాడు మనకు కరోనా నుంచి రక్షణ కవచం. ఇలాంటి బామ్మలున్న ఇంట్లో కరోనా ఏంటీ? దాని జేజమ్మ అయినా ఆమడ దూరం పారిపోవాల్సిందే అనిపించి నేటితరానికీ బంగారు బాట వేసింది కదా అనుకున్నా! అందుకే బామ్మా! తెగ నచ్చేశావే!

# 3

# 'మూడ్స్'ను పాడు చేసే 'యాడ్స్'

"అమ్మా! బ్రేక్‌ఫాస్ట్‌కి ఏం చేశావ్? రమ్యకు ఇష్టమని 'మ్యాగీ' చేస్తే నేను తినను" స్కూల్ బ్యాగ్ సర్దుకుంటూ అబ్బాయి 'అనంత్' బెదిరింపు.

"అమ్మా నీ కొడుక్కు ఇష్టమని పెసరట్టు (గ్రీన్ దోశ దాని భాషలో) చేస్తే నేనూరుకోను." నేనేమీ తక్కువ కాదన్నట్టు రమ్య.

శ్రీవారికి గ్యాస్ ప్రాబ్లమ్ అని రోజూ ఇడ్లీలు తప్పనిసరి. ఆయనతోపాటు నేను.

ఎవరు తినకుండా వెళ్లినా నాకే కదా బాధ. ముగ్గురికీ మూడు రకాలు చేసి, వాళ్లు ఇష్టంగా తిని వెళ్తుంటే, అలసటంతా మర్చిపోతాను.

"అందరికీ ఇడ్లీలు చెయ్యొచ్చుగా, వాళ్లడిగినవన్నీ చేసి పెట్టిగారాబంతో పాడు చేస్తున్నావు. ఇంక వాళ్లేమి ప్రయోజకులవుతారు?" అంటూ నేనెక్కడ అలసిపోయానని అంటానోనని ముందస్తుగా నా మీద ఒక విసురు విసిరి పిల్లలకి 'బై' చెప్పి తనూ ఆఫీసుకి బయలుదేరారు శ్రీవారు.

అదేంటో పిల్లలు "అన్నం కడుపు నిండా తింటే తృప్తి అమ్మకి... ప్రయోజకులైతేనే సంతృప్తి నాన్నకి" అనుకున్నా.

ఒక తుఫాను వెలసినంత ప్రశాంతంగా వుంది.

చల్లారిన ఇడ్లీలను వేడి చేసుకుని తినేంత ఓపికలేక గడ్డకట్టిన నెయ్యిని కాస్త వాటి మీద రాసుకుని, చట్నీ వేసుకుని కూర్చుని, టి.వి. ఆన్ చేశా! భక్తి టి.వి.లో ఏదన్నా ప్రవచనం విందామని,

పొద్దున్న లేచింది మొదలు టిఫిన్లు, లంచ్‌బాక్స్‌లు సర్దటాలు, పిల్లల అలకలు

సంసార గోలతోనే సరిపోతోంది. భక్తిఛానల్‌లో ధర్మసందేహాల కార్యక్రమం వస్తోంది. అందులో ఒకావిడ దీపారాధన చేసినప్పుడు రెండు వత్తులు  వెయ్యాలా లేక మూడ వత్తుల వేయాలా? ఇంకొక ప్రశ్న వత్తి ఏవైపు వుండాలి తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం, ఈ నాలుగు దిక్కులలో ఏ దిక్కు వత్తి చూడాలి. ఇంకొకాయన ఈశాన్యంలో దేవుడి గది ఉండాలి కదా! మాది అపార్టుమెంటండీ, ఆ వైపున గదిలేదు ఏమి చెయ్యాలి? ఇలా ప్రశ్నలు. ఆ చెప్పే ఆయన అన్నిటికీ ఈ పురాణంలో ఇలా వుంది. ఆ పురాణంలో అలా వుందంటూ సందేహాలకు శాస్త్రప్రకారం జవాబులిచ్చి, ఆఖరుగా అమ్మలారా, అయ్యలారా దేనికైనా భక్తి ప్రధానం. కృష్ణ భగవానుడు భగవద్గీతలో–

"పత్రం, పుష్పం, ఫలం, తోయం భక్తితో సమర్పిస్తే నాకు ప్రియం" అన్నారు. అందుకని ఎలా చేసినా భక్తితో చేయండి భగవంతుని పూజ అని చెప్పారు.

అవును కదా! గీతలో ఇలాగే చెప్పారు. నా మనసు పొద్దున లేచింది మొదలు రొదపెడుతూ ఉంటుంది. పొద్దున్న లేచి టిఫిన్లు కాఫీలు తప్పితే దేవుడికి పూజా పునస్కారాలు చేయడం లేదని. ఇది విన్న తరువాత మనసుకి కొంచెం వూరట కలిగింది. పూజ చేసుకోవాలి దేవుడికి దీపం పెట్టాలి అని మనసులో అనుకున్నా, పూజ చేసినట్టేనని కూడా చెప్పారు. అది కూడా ఈ కలికాలంలో ధర్మశాస్త్రం మనుషులకిచ్చిన సర్దుబాటట! ఈ మాట వినేసరికి మరింత వూరట కలిగి, ఇంకా ఏం చెబుతారా అని చూస్తున్నాం. ఇంతలో ప్రకటనల కోసం ఒక బ్రేక్ వచ్చింది. ఏదన్నా చూద్దామంటే ఈ 'యాడ్'లు మధ్యలో అనుకుంటూ...

ఇడ్లీముక్క నోట్లో పెట్టుకోబోతున్నా హెల్పేజ్ ఇండియా వాళ్ల ప్రకటన.. ఒక చిన్నారి పాపని అతి దీనంగా చూపిస్తూ "మీరు ఇలాంటి చిన్నారుల ఆకలి తీర్చగలరా! ఆదుకోగలరా! నెలకు రూ 500/–లు  పంపండి చాలు" అంటూ అతి దీనస్థితిలో ఉన్న పాపని చూసేసరికి ఇడ్లీముక్క నోట్లో మింగుడుపడలేదు.

"శ్రీవారితో కనీసం ప్రతినెల రూ 500/–లు పంపమని చెప్పాలి అనుకున్న తర్వాత ఇడ్లీముక్క లోపలికి వెళ్లింది. ఇంతలో "మీ బాత్‌రూమ్ గోడల మీద మురికిగా వుందా? ఎంత రుద్దినా టైల్స్ తెల్లగా అవడం లేదా" అంటూ అబ్బాస్ వచ్చాడు. మురికి పట్టిన బాత్ రూమ్ టైల్స్‌ని పదే పదే చూపిస్తూ, "ఇప్పుడు హార్పిక్ రెండు రకాలు, బాత్‌రూమ్ టైల్‌కి ఎరుపు రంగుది" అంటూ మళ్లీ మురికిగా, అసహ్యంగా వున్న టైల్స్‌ని

పదేపదే చూపించి, వాటిని శుభ్రపరచడం చూపిస్తున్నాడు. చాలా జుగుప్సగా అనిపించింది.

ఇవాళ నాకు టిఫిన్ తినే ప్రాప్తి లేనట్టుంది, తిన్న రెండు ముక్కలు కూడా బయటికి వచ్చేలా అనిపించి టి.వి. కట్టేసి లేచాను. వంట గదిలోకి వెళ్లేసరికి 'మా సంగతి పట్టించకోవా?' అంటూ సింక్‌లో గిన్నెలు ఎదురు చూస్తున్నాయి. వాటిని శుభ్రం చేసి స్టవ్ తుడిచి, హాల్లో కొచ్చాను. పిల్లలు ఆగం చేసిన ఇంటిని సర్దేసరికి ఒంటి గంట అయింది. వాషింగ్ మిషన్‌లో బట్టలేసి ఆన్ చేస్తుంటే లేచిన దగ్గర నుంచి ఎన్ని రకాల పనులో. "విష్ణుమూర్తి యుగానికో అవతారమెత్తాడు. అమ్మలు రోజుకి పది అవతారాలెత్తుతారు. అయినా ఒక్క మెప్పుకోలు మాట ఉండదు ఎవరి దగ్గర్నించి" అనుకుంటుంటే ఒక చిరుకవిత ఆశువుగా వచ్చింది నాకు.

"అమ్మను ఎన్ని కోణాల్లో ఆవిష్కరించినా
కొరత ఇంకా మిగిలే వుంటుంది
పొద్దుపొడుపుతో నిద్రలేచే 'అమ్మ'
ఎత్తే అవతారాలెన్నో
యుగానికో అవతారమెత్తాడు విష్ణుమూర్తి
రోజులో పది అవతారాలెత్తుతుంది మాతృమూర్తి"

కవిత బాగా వచ్చిందని. మన గురించి మనమే చెప్పుకోవాలి మరి. నాకు నేనే 'సెభాష్' అని వీపు చరచుకున్నా.

ఎల్లుండి అమ్మాయి పుట్టినరోజు డ్రెస్ కొనాలి అని గుర్తుకొచ్చింది. దానితోపాటు వాడికీ కావాలి, లేకపోతే ఏడుపు మొహం పెట్టుకుని కూర్చుంటాడు. ఏకంగా లంచ్ కానిచ్చి వెళ్తే. పిల్లలు స్కూల్ నుంచి వచ్చే టైమ్‌కి రావచ్చు అనుకున్నా.

అయిటమ్స్ పొద్దున్న చేసినవే. అన్నం మాత్రం వేడిగా కుక్కర్‌లో పెట్టుకుని, నెయ్యి, కరగబెట్టుకుని,పెరుగ డైనింగ్ టేబుల్ మీదకు తెచ్చుకుని కూర్చున్నా. ప్రొద్దున్న టిఫిన్ సరిగ్గా చెయ్యలేదు. ఆకలి దంచేస్తోంది. ఈ టైమ్‌లోనే కదా కాస్త తీరిక చిక్కేది అనుకుంటూ "కుక్క తోక వంకర" అన్నట్లు మళ్లీ టి.వి. ఆన్ చేశా. మధ్యాహ్నం తెలుగు రుచి వంట కార్యక్రమం వస్తోంది. ఏదైనా కొత్తవంటకం చూపిస్తారేమో, పిల్లలకి బోర్ కొట్టకుండా, ఏదైనా టిఫిన్స్ సాయంత్రం స్నాక్స్ చేయచ్చు అనుకుని చూస్తున్నా. అంతలో వంటింటి చిట్కా చూసే ముందు ఒక బ్రేక్ అంటూ మళ్లీ ప్రకటనలు. "అత్తగారు

సిగ్గుపడుతూ అడుగుతున్న కొత్త కోడలితో మరుగుదొడ్డి కట్టించాముగా! వెళ్లు" అంటుంది. కోడలు "కానీ అది శుభ్రంగా లేదు" అంటుండగా అక్షయ్‌కుమార్ ప్రవేశిస్తాడు. "మీ మరుగుదొడ్డిని దేనితో శుభ్రపరుస్తున్నారు" అంటూ లోపలికి వచ్చి పాచిపట్టి అసహ్యంగా వున్న టాయిలెట్ సింక్‌ని చూపిస్తూ, అది హార్పిక్ వాడితే ఎలా శుభ్రపడుతుందో చెబుతూ మార్చి మార్చి అశుభ్రంగా ఉన్న టాయిలెట్‌ను చూపించాడు. తలవంచుకుని తినడం మొదలుపెట్టాను.

కాసేపట్లో "టాయిలెట్ బ్రష్"ని పట్టుకుని అక్కినేని నాగార్జున ప్రత్యక్షం అయ్యాడు. "మనం టాయిలెట్‌ని వాడుతున్నప్పుడు మన టాయిలెట్‌ని మనమే శుభ్రపరచుకోవడానికి సిగ్గెందుకు?" అని ప్రశ్నిస్తూ ఫలానా కంపెనీ టాయిలెట్ బ్రష్‌ని వాడండి అంటూ మరొక 'యాడ్'. భరించలేక టి.వి. ఆఫ్ చేసే లోపల "ఇప్పుడు ఇల్లాలికి వంటింటి చిట్కా చూద్దామా?" అంటూ వచ్చింది. ఈ చిట్కా చూద్దామని అనుకున్నా, చిట్కా సగం చెప్పి ఇప్పుడు మరొక బ్రేక్ అంది. తప్పదురా అనుకుని చూస్తున్నా!

"దాగి వున్న బొద్దింకలని సహితం, బయటికి రప్పించి సంహరిస్తుంది. బేగాన్ స్ప్రే (హిట్) వాడండి అంటూ వెల్లకిలా పడి కొట్టుకుంటున్న బొద్దింకని చూపించార మరో ప్రకటనలో. దాన్ని చూస్తుంటే నా మనసు విలవిలలాడి గిలగిలకొట్టుకుంది. వేడివేడి అన్నంలో "ఆలూ ఫ్రై" తింటున్న ఆనందమంతా ఆవిరయిపోయి, వంటింటి చిట్కా వద్దూ పాడూ వద్దు అనుకుని, టి.వి. ఆఫ్ చేసి షాపింగ్‌కి బయలుదేరాను. షాపింగ్‌కి మనం ఎంత బడ్జెట్ పెట్టుకుని వెళ్లినా, అంతకంటే ఎక్కువ ఖరీదువే బావుంటాయి. మనకు నచ్చుతాయి. అదేమిటో! పోనీలే ఏడాదికి ఒకసారి వచ్చే పుట్టినరోజు అనుకుని రమ్యకి మంచి గౌను తీసుకుని, అనంత్ కోసం ఇంకో షాప్‌కెళ్లి బట్టలు తీసుకున్నా. శ్రీవారు చెప్పిన బడ్జెట్ మించిపోయింది. "కార్డు" గీకటమేగా నీ పని" అంటూంటారు. అక్కడికి నేనేదో దుబారా చేస్తున్నట్టు. రాత్రి భోజనాలయిన తరువాత కొన్న బట్టలు చూపించాను. పిల్లలకి శ్రీవారికి. పిల్లలిద్దరికీ చాలా నచ్చాయి సంబరంగా బట్టలను మీద వేసుకుని చూసుకుని థాంక్యూ యూ అమ్మా అంటూ బుగ్గమీద ముద్దు పెట్టుకుని పడుకోవడానికి వెళ్లారు.

శ్రీవారు మాత్రం కొంచెం సీరియస్‌గా "నీకు చెప్పిన బడ్జెట్‌తో షాపింగ్ చేయడం రాదుగా" అన్నారు. బట్టలు బావున్నాయా లేదా చెప్పకుండా. పదిరకాల షాపులు తిరిగి, ఎక్కడ డిస్కౌంట్ వుందో కనుక్కుని కొనుక్కొస్తే ఒక్క మెప్పుకోలు మాట లేదు కదా

కనీసం బావున్నాయి అని కూడా అనలేదు.

ఇంతకుముందు చాలాసార్లు అన్నాను. "మీరు కూడా రండి. ఇద్దరూ వెళ్తే షాపుల్లో రేట్లు ఎలా వుంటాయో తెలుస్తుంది" అని.

"నాకు రేట్లు ఎలా ఉంటాయో తెలీకుండానే ఇంత పెద్ద ఉద్యోగం చేస్తున్నానా? షాపులవాళ్లు ఆడవాళ్లని ఎలా బోల్తా కొట్టిస్తారో నాకు తెలుసు" అయినా మీ ఆడవాళ్ల లాగా, ఆ షాపులన్నీ నేను తిరగలేను. "వేస్ట్ ఆఫ్ టైమ్" అంటూ తప్పించుకున్నారు. దేనికీ ఓపిక లేదు, పైగా ఎక్కువ రేట్‌లో తెచ్చానని నామీద నింద. పిల్లలు పడుకున్నారు. క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారు శ్రీవారు. కినుకగా వున్నారు కదా కాసేపు తనతో బాటే క్రికెట్ చూస్తూ మూడ్ బాగుచేద్దామనుకుని పక్కనే కూర్చున్నా. మన ఇండియా బాగానే ఆడుతోంది. విరాట్ కోహ్లీ సిక్సర్ కొట్టాడు. శ్రీవారు కూడా చప్పట్లు కొడుతూ సంతోషంగా ఉన్నారు. 'మ్యాచ్' మంచి రసపట్టులో ఉండగా సడన్‌గా మధ్యలో యాడ్ వచ్చింది. రాహుల్ ద్రవిడ్ వచ్చాడు. ఏదో క్రికెట్‌కి సంబంధించినదే అనుకున్నా, కానీ కాదు "పాన్, గుట్కా నమలకండి! మీ ఆరోగ్యం పాడు చేసుకోకండి!" అని చెప్తూ గుట్కా నమిలిన వాళ్ల పుచ్చిపోయిన పళ్లు, నోరు, ఆపరేషన్ చేసి తీసేసిన, నోరు, నాలుక, దవడలు అతి భయంకరంగా, జుగుప్స కలిగేలా చూపిస్తున్నారు. ఒకతను "నా ఆపరేషన్ కోసం మా ఆవిడ రెండు గాజులూ అమ్ముకున్నాను" అంటూ కుట్లు వేసిన దవడలు చూపిస్తున్నాడు. అది ఒక యాడ్ అని అప్పుడు తెలిసింది.

రాత్రి తిన్న అన్నం బయటకికొచ్చేలా వుండి, ఇక నా వల్ల కాదు బాబోయ్ అనుకుని బెడ్‌రూమ్‌లోకి వచ్చి మంచం మీద వాలాను. అలసిపోయిన శరీరం నిద్రలోకి జారుకుంది. రాత్రి నా కలలో వెల్లకిలా పడి కొట్టుకుంటున్న బొద్దింక, పుచ్చిపోయిన నోరు, దవడలు, పాచిపట్టిన మరుగుదొడ్డీ, టాయిలెట్ బ్రష్‌లూ, అతి దీనంగా వున్న చిన్నారి బాలిక ఒకదాని తరువాత ఒకటి సినిమా రీలులా తిరుగుతుంటే, అస్థిమితంగా అటూ ఇటూ పొర్లుతుండగా తెల్లారిందంటూ ఆలారం మోగింది.

# 4

# మబ్బు తొలగిన మనసు

"ఛీఛీ! ఒంటరిగా వున్న ఆడవాళ్లంటే ఎంత చులకన ప్రతివాళ్లకీ. వయసులో వున్న స్త్రీ మీద అయితే ఎన్నో అభాండాలు వేస్తారు. కానీ 70 ఏళ్ల వయసులో నాకీ ఆంక్షలేమిటి? కన్నీళ్ళ పర్యంతమవుతూ అంది సుజాత.

సుజాత ఓ పేరున్న మంచి రచయిత్రి. తన కథ కానీ, వారపత్రికలో సీరియల్ కాని పాఠకులను ఉర్రూతలూగించేవి. తన కథల ద్వారా ఎంతో మంది స్త్రీలలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించింది. సుజా కొడుకూ, కూతురూ పెళ్ళిళ్లు చేసుకుని అమెరికాలో సెటిలయ్యారు. అనారోగ్యంతో భర్త ఇటీవలే పోయారు. ఆ లోటును భర్తీ చేయడానికి, సుజా తన సమయాన్ని సమాజసేవా కార్యక్రమాలవైపు మళ్లించింది. ఇది తనకెంతో ఆత్మతృప్తిని ఇచ్చిందనీ, చాలా ప్రశాంతంగా వుందనీ చెప్పేది.

సుజాతకున్న అసంఖ్యాక అభిమానుల్లో తనకు బాగా అభిమానినీ. మంచి స్నేహితురాలునీ నేను. ఆమె స్నేహం జీవితంలో దేవుడిచ్చిన గొప్ప బహుమానం నాకు. ఫోన్లలో సంభాషణలేకానీ, తనని కలిసి చాలా కాలమయిందని సుజాత ఇంటికి వచ్చా. ఇంట్లో లేదు. ఇంట్లోనే వుండే పని+వంటతమనిషి నర్సమ్మ "అమ్మ డాక్టరు దగ్గరకెళ్లారు. వచ్చేస్తారు కూర్చోండి" అంటూ మంచి నీళ్లగ్లాసు అందించింది. ఏ డాక్టరు దగ్గరికి? అనడిగాను. "ఏమో తెలీదమ్మా! తొరగా వచ్చేస్తానన్నారు" అంది నర్సమ్మ. నర్సమ్మతో పిచ్చాపాటీ మాట్లాడుతుండగానే వచ్చింది సుజాత.

"నన్ను చూడగానే సంతోషంతో కౌగలించుకుంది. చాలాకాలం తరువాత కలవడంతో ఆనందభాష్పాలు వచ్చాయి ఇద్దరికీ. సుజా కౌగిలింత చాలా ఆత్మీయంగా వున్నా, మనసులో ఏదో బాధ దిగమింగుకుంటున్నట్టు, చిన్న నిట్టూర్పు వెలువడింది.

"ఏమిటీ డాక్టరు దగ్గరకి వెళ్లావు? ఏమయింది? రొటీన్ చెకప్పా అని అడిగాను.

"ఆ! రొటీన్ షుగర్ లెవెల్ చెకప్‌కి వెళ్లాను. అదేమిటో పోస్ట్‌లంచ్ 320 వుంది. నీకు తెలుసుగా నేనసలు స్వీట్స్ తినను. అన్నం కూడ చాలా కొలతగా తింటాను. సడెన్‌గా ఇంత ఎందుకు పెరిగిందో అర్థం కావడం లేదు" కొంచెం దిగులుగా అంది.

"ఒక్కొక్కసారి టెన్షన్ వుంటే కూడా షుగర్ లెవెల్ పెరుగుతుంది" అన్నాను ఏమనాలో తెలియక.

"అవును టెన్షన్ వల్లే పెరిగింది" అంది. ఆశ్చర్యంగా చూశాను తనవంక. బాధ్యతలన్నీ తీరి, సమాజ సేవా కార్యక్రమాలలో ప్రశాంతంగా జీవనం గడుపుతున్న సుజాతకి టెన్షన్ ఏమిటి? అదే భావం వ్యక్తపరుస్తూ తనవంక చూశా!

"70 ఏళ్ల వయసులో నాకీ ఆంక్షలేమిటి? స్త్రీని ఏ వయసులోనూ తన కాళ్లమీద తనని నిలవనియ్యరా? ఎప్పుడూ ఏవో పుల్లవిరుపు మాటలే? మొగుడనే వాడు రోగంతో మంచాన పడి వున్నా, దేనికీ పనికి రాకపోయినా ఆ ఇల్లాలికి బోలెడంత సానుభూతి చూపిస్తుంది, గౌరవిస్తుంది ఈ సమాజం.

నా సంగతే చూడు, నాలుగైదు ఏళ్లుగా మా వారు ఒంట్లో బాగాలేక, మంచంలోనే వుంటున్నారు. పిల్లలిద్దరూ అమెరికా నుంచి వచ్చి చూసి వెళ్లారు. ఇంటా బయటా పనులన్నీ నేనే చూసుకున్నాను. ఆయన కాలం చేయగానే చుట్టుపక్కాలు, సొంత అక్క చెల్లెళ్లు కూడా "నీకెందుకే ఇంత ఇల్లూ వాకిలీ? ఒక్కదానివే నౌకర్లని పెట్టుకుని ఇంత ఇంట్లో ఎందుకు చెప్పు. అన్నీ అమ్మి పారేసి, హాయిగా అమెరికా కొడుకు దగ్గరకెళ్లి వుండు" అంటూ ఉచిత సలహాలు పారేస్తూ నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. ఆయన ఉన్నప్పుడూ పనులన్నీ నేనే చేరుకున్నా, ఇప్పుడూ నేనే చేసుకుంటున్నా, ఎవరి సహాయమూ అడుక్కోకుండా దేవుడిచ్చిన దానిలో కాస్త దానం, ధర్మం, సేవా కార్యక్రమాలతో హాయిగా కాలం గడుపుతుంటే, నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ నన్ను నిర్వీర్యం చేస్తున్నారు'', ఎంతో ఆవేదనతో సుజా మాట్లాడుతున్న తీరు, తను చాలా గాయపడిందనిపించింది.

"సరే అమెరికాలో కొడుకు దగ్గరెడతాననుకో నీకు తెలియంది ఏముంది? కొడుకూ, కోడలూ, మనమలూ పొద్దున లేచింది మొదలు ఉరుకులూ పరుగులూ పెడుతుంటే గుడ్లప్పగించి వాళ్లవంక చూడటం తప్ప నాకేమీ పనుండదు. టీ.వీ. చూడడం తప్ప వేరే గత్యంతరం వుండదు. ఏదో పరాయి వాళ్ల పంచన బ్రతుకుతూ, శని ఆదివారాలు ఎప్పుడు వస్తాయా, ఎప్పుడు బయట ప్రపంచం చూపిస్తారా అని ఎదురు చూపులు చూడటం" మనసులో ఆవేదన ప్రవాహంలా తన్నుకువస్తోంది.

"ఈ మాటలతోనే, నా మీద నాకు నమ్మకం పోయి నేను నేనులా వుండాలా? సమాజం మాట వినాలా? అన్న సంఘర్షణతోనే షుగర్ లెవెల్ పెరిగినట్టుంది" మణీ అంటూ బేలగా నా వంక చూసింది.

సుజాతను చూస్తే, నాకు చాలా ఆశ్చర్యమేసింది. ప్రఖ్యాత రచయిత్రి సుజాతేనా ఇలా బేలగా మాట్లాడుతోంది. తన రచనల ద్వారా ఎంతోమంది స్త్రీలలో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా తోడ్పడింది. తన విషయానికొచ్చేసరికి, అవేవీ గుర్తుకు రావడం లేదు. సుజాలోని ధైర్య వనితను మేల్కొలిపే బాధ్యత తీసుకున్నాను. ఇతర స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు మా సంభాషణలో చోటు చేసుకునే విధంగా కొనసాగించాను. "సుజా నీకు తెలియంది ఏముంది చెప్పు?" భర్త తాగొచ్చి, కొట్టి చంపుతున్నాడని, పిల్లల్ని తీసుకుని విడిగా వచ్చి పాచిపని చేసుకుని చదివించుకుంటున్న స్త్రీని, మానసికంగా బేలగా మార్చి, మళ్లీ ఆ భర్త కాళ్ల మీద పడి, కాపురం చేసే విధంగా చేసి, వికటాట్టహాసం చేస్తుంది సమాజం.

నీకు తెలుసుగా మన వనజ గురించి, ఎన్నో వేదికల మీద స్త్రీల సమస్యల పట్ల అనర్గళంగా ప్రసంగించి, మహిళా రత్న, అభ్యుదయ మణి లాంటి బిరుదులెన్నో పొందింది. అది ఈ మధ్య ఫోన్ చేసి తన ఆవేదన వెళ్లబోసుకుంది. తను వేదిక ఎక్కి ప్రసంగిస్తున్నప్పుడు, చప్పట్లు కొట్టి అభినందించినవారే, వేదిక దిగి రాగానే "మీవారు రాలేదాండి? వస్తే బాగుంటుంది కదా? మీ వాక్చాతుర్యం తెలిసేది? అంటూ వ్యంగ్యోక్తులు, అక్కడికి తనేదో ఇల్లూ వాకిలీ పట్టకుండా తిరుగుతున్నట్టు ప్రశంశిస్తున్న చూపుల్లోనే కొంత అవహేళన కనపరుస్తూ మాట్లాడుతున్నారంటూ వాపోయింది.

"అలా చూస్తే పురుషులందరూ వారి భార్యలను, స్త్రీలందరూ వారి భర్తలనూ తీసుకునే సభలకు వస్తున్నారా? అని అడిగేవారు లేరు. కళాపోషణ అంటూ సభలకు వచ్చి వాళ్లమీదా వీళ్ల మీదా కామెంట్స్ చేస్తూ చల్లగాలి పీల్చి ఇళ్లకెళ్తారు. ఇదే వీళ్ల కళాపోషణ.

ఎన్ని ఏళ్లు గడిచినా స్త్రీకి స్వాతంత్ర్యం వచ్చిందంటూనే స్వతంత్రంగా బ్రతికే స్త్రీని చూసి ఓర్వలేరు. ఇంత పెద్ద రచయిత్రివి, ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచిన నీకు తెలీని విషయం కాదు ఇది. నువ్వే ఇలా బేలగా మారితే ఎలా? సమాజం గురించి పట్టించుకున్నంత కాలం మనమీద ఇలా రాళ్లు రువ్వుతూనే వుంటుంది. సుజీ! నువ్విదేం పట్టించుకోకు. నువ్విక్కడుంటే, మనందరం కలుసుకుని, కూసింత సమాజసేవ చేసుకుంటూ, స్వతంత్రంగా సంతోషంగా, బతుకుదాం! అంటూ హుషారు చేశాను.

# 5

# కారు.. మా వారు!

కారులో షికారు గురించి నాకూ మా వారికీ వాదోపవాదాలు జరగడం మా ఇంట్లో సర్వసాధారణం. నేను ఉద్యోగస్తురాలిని. పిల్లలిద్దరూ పై చదువులకని అమెరికా వెళ్లారు. ఆఫీసులో ఫైల్స్‌తో కుస్తీపట్టి ఇంటికి రాగానే కాస్త రిలాక్స్ అయిన తర్వాత ఎదురు బొదురుగా కూర్చొని, మా మొహాలు మేమే చూసుకుంటూ కారణం వెతికి మరీ పోట్లాడుకోవడం కన్నా ఎటన్నా బైటికి వెళ్తే కాస్త మార్పుగా వుంటుంది అని మావారిని అడిగా. వెంటనే "ఎక్కడికెళ్దాం? అక్కడ కారు పార్కింగ్ వుంటుందా?" అంటూ మావారు ప్రశ్నలు సంధించారు.

"వుండే వుంటుంది అయినా నాకు మాత్రం ఏం తెలుసు? పార్కింగ్ లేకపోతే ఏ సందులోనో, గొందులోనో ఆపవచ్చు పదండీ" అన్నాను.

"నీకే నువ్వు బాగానే చెప్తావు. హాయిగా ఎక్కి కూర్చోవడమే కదా నీ పనీ! ఏ సందులో పెట్టబోయినా ప్రతి ఇంటి ముందు నో పార్కింగ్ బోర్డులే! షాపు ముందు పెడదామా అంటే గిరాకీ పోతుందని గొడవపెడ్తాడు. ఇంకెక్కడన్నా వెడదామా అని ఆగి చూస్తుంటే, ఎక్కడ పెడతాడా ఫైన్ వేద్దామని గుంటనక్కలా పోలీసు చూస్తూ వుంటాడు" అంటూ ఓ పెద్ద క్లాసు పీకారు.

నా వైపు చుట్టాలు, ఆయన వైపు చుట్టాలు అందరూ హైదరాబాదులోనే వున్నారు. వాళ్లళ్లో, స్నేహితులు, ఆఫీసు కొలీగ్స్, ఇరుగుపొరుగు వాళ్ళు ఇలా ఎవరో ఒకరి ఇంట్లో పుట్టినరోజు పార్టీ, గెట్ టు గెదర్ పార్టీ ఏదో ఒకటి జరుగుతూనే వుంటాయి. వాళ్ళిచ్చిన ఆహ్వాన పత్రిక పూర్తిగా చదవకుండానే "అక్కడ కారు పార్కింగ్ ఉందా? వెధవలు బ్రహ్మాండంగా పెద్దపెద్ద హాల్స్ కడతారు, పార్కింగ్ ప్లేస్ దగ్గర కక్కుర్తి పడతారు" అంటూ ఇచ్చిన వాళ్లది పాపమన్నట్లు, దేశం గురించీ, రాష్ట్రం గురించీ, పెరిగిపోతున్న కార్లు రోడ్లను ఆక్రమిస్తూ చేస్తున్న కార్ల పార్కింగ్ గురించి, సివిక్‌సెన్స్ లేని పబ్లిక్ గురించి

కచ్చగా లెక్చర్ ఇచ్చి వాళ్ళ బుర్ర తినేయడం పరిపాటయింది మా వారికి. వచ్చిన వాళ్ళు ఏమనుకుంటారోనని, మధ్యమధ్యలో నేను జోక్యం చేసుకుని, ఫంక్షన్ విశేషాలు అడిగి కాఫీనో, కూల్‌డ్రింకో ఇచ్చి పంపడం నావంతయ్యేది.

తీరా అన్నీ కనుక్కుని బయలుదేరిన తరువాత సదరు ఫంక్షన్ హాలులో పార్కింగ్ వున్నా సరే, హాలుకి అరకిలోమీటరు దూరంలో, అటు ఇటూ చూసి ఒక చెత్తకుండీ దగ్గర కారు ఆపి దిగమనేవారు. “అదేమిటి హాలులో పార్కింగ్ వుందన్నారుగా, ఇక్కడ ఈ చెత్తకుండీ దగ్గర ఆపారేమిటి, ముక్కుపగిలే వాసన, పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుని, దర్జాగా హాలు దగ్గర దిగక, ఈ చెత్తకుండీ దగ్గర దిగడమేంటి” అన్నాను ముక్కు మూసుకుంటూ. మా వారి దగ్గర రెడీమేడ్ జవాబులుంటాయి. “హాలులో అందరూ పెడతారు. వెళ్లేటప్పుడు కారు తీయడం కష్టమవుతుంది. ఈ చెత్తకుండీ దగ్గరయితే కాంపిటేషన్‌కి ఎవరూ రారు. తిరిగి వెళ్లేటప్పుడు కారు తీయడం తేలిక, అయినా ఆఫీసులో ఎప్పుడూ కూర్చునే వుంటావుగా కాస్త నడిస్తే ఒంటికి మంచిది” అంటూ ముందుకు కదిలేవారు. మూడ్స్ ఆఫ్ అయి, చచ్చినట్టు ఆ అరకిలోమీటరు పట్టుచీర పైకి పట్టుకుని ఆయన్ని అనుసరించక తప్పేది కాదు.

ఇంక ఇంకోరకం ఫంక్షన్లు ‘గృహప్రవేశాలు’. హైదరాబాదు నగరంలో అద్దెలు పెట్టుకోలేక, సిటీకి ఏ మారుమూలో ఇల్లు కట్టుకుని గృహప్రవేశాలకు పిలిచేవారు. స్నేహితులు, సన్నిహితులు, కార్డు వెనకాల రూటు మ్యాప్ కూడా వేసి, తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పేవారు.

సరే ఆ రోజు రాగానే వాళ్లిచ్చిన సదరు ఇన్విటేషన్ కార్డు డ్రైవింగ్ సీటు ముందర పెట్టుకుని కొంత దూరం సరిగ్గానే తీసుకెళ్లేవారు. తరువాత మ్యాప్‌లో కుడివైపు తిరిగాలి అని రాసుంది కాని కుడివైపు ‘వి’ షేపు రెండు రోడ్లున్నాయి. ఎటు తిరగాలో అనుకుంటుంటే, “పోనీ ఎవరినైనా అడుగుదామండీ” అన్నాను. అక్కరలేదు నేను ఈ రూటులో చాలాసార్లు వచ్చాను, ఇదంతా నాకు కొట్టిన పిండే అంటూ గొప్పలు చెప్పి, గల్లీలన్నీ తిప్పితిప్పి, చివరకు ఇల్లు పట్టుకోలేక, ఆ మూల ఇల్లు కట్టుకున్నది చాలక, మమ్మల్ని ఆహ్వానించినందుకు వాళ్ళమీద విసుక్కుంటూ, ఆ సన్న సన్న గల్లీల్లో అడ్డమొచ్చిన కోళ్లనీ, కుక్కలనీ గట్టిగా హార్న్ కొట్టి బెదరకొడుతూ, కుక్కల్ని చంపవద్దన్న “బ్లూక్రాస్” వాళ్లని తిట్టుకుంటూ, వాటిని తప్పించబోయి, టెలిఫోన్ స్తంభానికో, కరెంటు స్తంభానికో గుద్ది కారుకి సొట్టలు పడిన తరువాత, సదరు ఇంటాయనికి ఫోన్ చేసి “మేం ఫలానా

చోటవున్నాం.. ఎటు రావాలి" అని అడిగేవారు. "ఇదేదో ముందరే అడిగితే ఈ తిప్పలు, కారుకి సొట్టల వుండేవి కాదు కదా!" అన్నాను. తన మగతనానికి సవాల్ అన్నట్టుగా నా వైపు సీరియస్‌గా చూసి నీకేం ఎన్నైనా కబుర్లు చెప్తావు. ట్రిమ్ముగా తయారయి కారులో కూచుంటావు. నడిపేవాడికి తెలుస్తుంది ఈ హైదరాబాదు రోడ్లలో కారు నడపడం ఎంత కష్టమో" అంటూ తనెంత కష్టపడుతున్నాడో అని నేను తెలుసుకోవాలని మళ్లీ నా మీద ఒక సైటెర్. చివరకు ఆ ఇంటాయన మీరక్కడే వుండండి, నేను మనిషిని పంపిస్తానని మా కారు నెంబరు నోటు చేసుకుని మమ్మల్ని తీసుకెళ్ళేవారు.

ఎలాగో అలాగ అటెండ్ అయి, మళ్లీ ఆ బఫేలో నుంచుని మళ్లీ మళ్లీ పదార్థాలు వెళ్లి వేసుకునే ఓపిక లేక ఒకేసారి కావలసినవి వేసుకుని, ఎక్కట్నోంచో కుర్చీ వెతుక్కుని తింటుంటే, గొంతు పట్టేసింది మంచినీళ్లు అక్కడెక్కడో వుంటే వెళ్లి తెచ్చుకుని నీళ్లు తాగి గ్లాసు కిందపెట్టి, ప్లేట్ తీసుకుని తింటుంటే, ఎవరో పిల్లవాడు వచ్చి గ్లాస్ తన్నేశాడు. పట్టుచీర అంచు అంతా తడిసింది. కోపం వచ్చినా, ఆ చిన్నపిల్లవాడిని ఏమంటాములే అని, ఎలాగో అంతా భోజనం కానిచ్చి, అందరి దగ్గర సెలవు తీసుకుని బ్రతుకు జీవుడా అంటూ ఇల్లు చేరాము. సొట్టలు పోయిన కారు చూసి బాధవేసి కారు చూడ్డానికి అసహ్యంగా వుంది. ఆ సొట్టలు తీయించి కొంచెం కలర్ టచ్ అప్ చేయిద్దాం" అన్నాను.

"ఏమవసరం లేదు. హైదరాబాదు నిండా ఇరుక రోడ్లేగా! రిపేర్ చేయించగానే.. ఏ వెధవో వచ్చి మళ్ళీ డాష్ కొడతాడు. అలాగే వుండనీ" అంటూ విసుగు. అది మగవాళ్ల జన్మ హక్కు కదా! ఆ సొట్టబుగ్గల కారులోనే ఎక్కడికెళ్ళినా, రోడ్డుమీద అడ్డమొచ్చిన వాళ్ళని "ఏరా ఇంట్లో చెప్పొచ్చావా అంటూ తిట్ల ప్రహసనాలూ నసభరిస్తూ పక్కన కూర్చోడం ఎంత కష్టమో, ఎంత విసుగ్గా వుంటుందో. "హాయిగా క్యాబ్‌లో వెళ్దామండి, ఈ అడ్రసు వెతుక్కోవడాలు వుండవు. చెప్పిన చోటకి టక్కున తీసుకెళ్లి దింపుతాడు. మీకూ టెన్షన్ వుండదు" అన్నాను.

"నాకేం టెన్షన్ లేదు, అయినా క్యాబ్ బుకింగ్ చేస్తే అక్కడ దింపి వెడతాడు. మళ్లీ రిటర్న్‌లో బుక్ చేసుకోవాలి. ఫంక్షన్ లేట్ అవుతే మళ్లీ క్యాబ్ దొరకడం కష్టం అయినా నీకేమీ కష్టం లేదు కదా, హాయిగా ప్రక్కన కూచోక" అంటూ తేల్చిపారేశారు.

ఇంక చేసేదేముంది? ఈ జన్మకి ఈ సొట్ట బుగ్గల కారులో, మా వారితో "జోరుగా హుషారుగా షికారు పోదమా" అని పాడుకుంటూ సర్దుకు పోవాల్సిందే..!

# 6

# తన్మయ దృశ్యం

"అమ్మా! ఏంటీ ఎప్పుడూ పెళ్లి పెళ్లి అంటూ ఏదో ఒక అబ్బాయి ఫోటో పంపించి, బాగున్నాడా? వాళ్ల అమ్మా! వాళ్లతో మాట్లాడమంటావా? అంటూ ఊదరకొడతావు. కొంచెం ఆలోచించుకోవడానికి టైమ్ ఇవ్వకుండా వెంటనే "ఎస్" ఆర్ "నో" అని చెప్పమంటే ఎలా?" అమెరికా నుంచి శిరీష విసుక్కుంటూ ఫోన్ చేసింది.

"బి.టెక్" అయిన తరువాత, అమెరికాలో "ఎం.ఎస్." చేస్తానని, దానికి కావలసిన "టోఫెల్", "జి.ఆర్.ఇ." పరీక్షలు రాసి మంచి స్కోరు తెచ్చుకుంది. శిరీషని వదిలి వుండటం కష్టమయినా, "పోనీలే ఉన్నత చదువు కోసం వెళతానంటే కాదనడం ఎందుకని, మనసుకి సర్దిచెప్పుకుని సరేనన్నాము. అక్కడ తన స్నేహితురాళ్లతో కలిసి ఇల్లు అద్దెకు తీసుకుని కాలేజీకి వెడుతూ, వండుకుని తింటూ, సాయంత్రం కాలేజీ నుంచి వచ్చిన తరువాత, పార్ట్ టైమ్ ఉద్యోగం చేసుకుంటూ అష్టావధానం చేస్తూ చదువుకుంటున్నారు.

వెళ్లిన కొత్తలో తరచుగా ఫోన్ చేస్తూ, వాళ్లు పడే అవస్థల గురించి చెప్పేది. అవి విన్న తరువాత, ఇక్కడ ఇంత గారాబంగా పెరిగింది. ఇంజనీరింగు చదివేటప్పుడు కూడా, కాలేజీకి టైమ్ అయిపోయిందని తినకుండా వెళ్తుందని, అన్నం కలిసి నోట్లో ముద్దలు పెట్టేదాన్ని. లంచ్ బాక్సలో శిరీష కిష్టమైన టిఫిన్ పెట్టి, పదిసార్లు హెచ్చరిక చేసేదాని, టిఫిన్ తినడం మర్చిపోవద్దని.

సాయంకాలం శిరీష కాలేజీ నుంచి వచ్చే సమయానికి ఎదురు చూస్తూ కూర్చునేదాన్ని, వస్తూనే కాలేజ్ బస్సులో సీటు దొరకలేదనీ, 50 సీట్లు వుంటే, 100 మందిని ఎక్కించారనీ, గంటన్నర బస్సులో నుంచుని వచ్చాననీ, దాని తాలూఉ విసుగంతా నామీద చూపిస్తూ, కాసేపటికీ సేదదీరి "ఏం చేసావ్ స్పెషల్ ఈ రోజు" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరేది. అది కాలేజీ కబుర్లు చెబుతుంటే, కొసరికొసరి తినిపిస్తూ ఆనందంచేదాన్ని.

అలాంటివి అక్కడ అది పడుతున్న అవస్థలు విని దుఃఖంతో గొంతు పూడుకుపోయి మాట్లాడలేకపోయాను. ఫోన్‌లో నా గొంతు వినపడకపోయేసరికి. "ఇక్కడ ఇలా వుంటుందని తెలుసుకునే వచ్చాను కదమ్మా! నేనే కాదు నాతోపాటు వచ్చిన అమ్మాయిలందరూ ఇలాగే అవస్థ పడుతున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ అలవాటు చేసుకుంటున్నాం. నువ్వు ఇలా బాధ పడుతుంటే, నీకింక ఫోన్ చెయ్యను" అంటూ బెదిరించేది.

ఒకరోజు ఫోన్ చేసి "అమ్మా మేము చాలా గొప్పవాళ్లమయ్యాం తెలుసా! డైనింగ్ టేబుల్ కొనుక్కున్నాం" అంటూ సంబరంగా చెప్పింది.

"మీ పార్ట్ టైమ్ ఉద్యోగాల్లో అంత డబ్బు మిగిలిందా" ఆశ్చర్యంగా అడిగా. గలగలా నవ్వుతూ "పిచ్చి అమ్మా! మేము కొనుక్కోలేదు. ఇక్కడ ఎవరైనా కొత్త వస్తువులు కొనుక్కుంటే, పాతవి బయటపెడతారు. అవసరం వున్నవాళ్లు, మాలాగా చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులు వాటిని తెచ్చుకుని వాడుకుంటారు. అలా మేము బయటపెట్టిన డైనింగ్ టేబుల్ తెచ్చుకున్నాం. ఎవరైనా కుర్చీలు, ఎ.సి.లు లాంటివి పెడితే మళ్లీ తెచ్చుకుంటాం". ఇక్కడ ఇదంతా మామూలే! లైట్ తీసుకో అంది. లైట్ తీసుకోమంది కానీ నాకు మళ్లీ కళ్లంబడి నీళ్లు వచ్చాయి. ఈ పిచ్చి పిల్ల పాత టేబుల్ తెచ్చుకుని మురిసిపోతోంది. అమెరికాలో చదువుకుంటా అని వెళ్లి ఎన్ని కష్టాలు పడుతోందో! మనసు మూగగా రోధించింది. ఇలా రకరకాల ఇబ్బందులు పడుతూ భావోద్రేకాల నడుమ యం.ఎస్. డిగ్రీ తెచ్చుకుంది.

విద్యార్థి వీసా కూడ వుండగానే మధ్యలో ఒకసారి ఇండియా వచ్చి నెలరోజులుండి మురిపించి వెళ్లింది.

మా అమ్మ నన్ను పోరు పెట్టడం మొదలుపెట్టింది. పిల్లను అంత దూరం పంపించావు. అదేదో ప్రేమ గొడవల్లో పడకుండా, మంచి సంబంధం చూసి పెళ్లి చేసి పంపించు అంటూ. అమ్మ చెప్పింది కూడా నిజమే కదా అని. "తెలుగు మాట్రిమోని"లో శిరీషకి తెలియకుండా నా ఈ-మెయిల్ అడ్రస్ ఇచ్చి, అనుకూలంగా వున్న వాటిని సెలెక్ట్ చేసి పెట్టా. రాగానే అడుగుదామని.

"ఇప్పుడే పెళ్లేమిటి? ఇంత కష్టపడి చదివి, ఉద్యోగం చేయకుండా పెళ్లేమిటి? నా సొంత సంపాదనతో నాకు కావలసినవన్నీ, మిమ్మల్ని అడగకుండా కొనుక్కుంటే

ఎంత థ్రిల్‌గా వుంటుందో తెల్సా. నన్ను ఆ ఆనందాన్ని అనుభవించనీ! అంది.

"అది చెప్పింది కూడా నిజమే కదా! దానికి కాస్త ఉద్యోగంలో కుదుటపడనీ! పూర్వకాలం వాళ్ళలాగే పెళ్లీ పెళ్లీ అంటూ దాని వెనకాలపడుతున్నావు" అంటూ మా వారి వత్తాసు దానికి.

"అవును ఇప్పుడు ఇలాగే అంటారు. రేపు అది ఎవరినన్నా, కట్టుకుని వచ్చిందంటే, నీ పెంపకం ఇలా ఏడ్చింది అంటూ దెప్పి పొడుస్తారు. పిల్లకి పెళ్ళి చేయకుండా ఆడపిల్ల సంపాదన అనుభవించాలని చూస్తున్నారంటూ నలుగురూ దెప్పి పొడుస్తారు. మీకేం తెలుసు ఆడవాళ్ల పాట్లు?" ఏమీ పట్టనట్టు కూర్చున్న శ్రీవారి మీద ఎగిరాను.

"సరే! నీకు నచ్చిన సంబంధం చూడు. దాన్ని ఒప్పించు. మీ ఇద్దరికీ ఇష్టమయితే నాకేం అభ్యంతరం లేదు. ఆ సమయానికి వచ్చి పీటల మీద కూర్చుంటాను. బాధ్యతంతా నామీద వేసి చేతులు దులిపేసుకున్నారు.

చివరకు నా పోరు పడలేక "సరేలే చేసుకుంటాను. కానీ ఆ అబ్బాయితో నేను మాట్లాడాలి. నా అభిప్రాయంతో ఏకీభవిస్తేనే చేసుకుంటాను. తరువాత నువ్వు మాత్రం నన్ను బలవంతం చెయ్యద్దు" అంటూ కండిషన్‌తో ఒప్పుకుంది. అమ్మయ్యా! అనుకుని సంతోషపడిపోతూ "అబ్బాయితో ఏం మాట్లాడదామనుకుంటున్నావు?" అనడిగా.

"ఏం లేదమ్మా! పెళ్లి చేసుకోగానే, మళ్లీ పిల్లల్ని కనమంటూ, అటువాళ్లూ, ఇటు మీరూ చంపుకు తింటారు. అందుకే కాబోయే అతనితో ముందుగానే చెబుతాను "మనకి పిల్లలు వద్దు – ఇండియాలో చాలామంది అనాధ పిల్లలు వున్నారు – వాళ్లల్లో ఒకరిని పెంచుకుని చక్కటి జీవితాన్నిద్దామని. "దానికి ఇష్టమయితే పెళ్లి చేసుకుంటానని. అతను ఒప్పుకుంటే సరే! లేకపోతే పెళ్లి చేసుకోకుండానే, ఒక పేదపిల్లనీ పెంచుకుని, బాగా చదివించి, దేశమాత రుణం కొంచమైనా తీర్చుకుంటా... ఒక గుక్కలో నిక్కచ్చిగా చెప్పింది.

అవాక్కయ్యాను. శిరీష ఉన్నతాశయానికి గర్వంగా వున్నా, అలా విశాల హృదయం వున్న అబ్బాయి ఎక్కడ దొరుకుతాడు. మళ్లీ విషయం మొదటికి వచ్చింది. కొంచెం తెప్పరిల్లి "అది కాదమ్మా! మీకంటూ సొంతంగా ఒక పిల్లో, పిల్లాడో పుట్టాక, రెండో వాళ్లని పెంచుకుంటే బాగుంటుంది. మాతృత్వంలో వుండే మాధుర్యాన్నీ అనుభవించవచ్చు. ఆదర్శాన్నీ పాటించవచ్చు. ఆలోచించు అంటూ నచ్చా చెప్పా.

నా ప్రయత్నాలు, ఫలించి చివరికి నేను నెట్‌లో చూసి పంపించిన అబ్బాయిని కలవడానికి వప్పుకుంది. అమెరికా మేరీలాండ్‌లో పని చేస్తున్న మా అబ్బాయికి సంతోషంగా ఈ విషయం చెప్పాను. చెల్లెలితో మాట్లాడి వాళ్లిద్దరూ కలుసుకునే ఏర్పాటు చేశాడు. కలుసుకున్న తరువాత ఫోన్ చేసి ఆత్రంగా అడిగా 'నచ్చాడా?' అని. ఒక్కసారి కలవగానే, ఒకళ్ల గురించి ఒకళ్లకి ఏం తెలుస్తుంది. 3, 4 సార్లు కలవాలి. అప్పుడే అభిప్రాయాలు తెలుస్తాయి" అంటూ సస్పెన్స్‌లో పెట్టింది. ఈ సంబంధం కుదరాలని దేవుళ్లందరికీ మొక్కుకున్నాను. నా పూజలు ఫలించి శుభవార్త చెప్పింది. అంగరంగ వైభవంగా శిరీష – శ్రీనివాస్‌ల "పెళ్లి జరిపించాము. పెళ్లయిన రెండేళ్ల వరకూ హాయిగా చిలకా గోరింకల్లా తిరిగారు. నాకు, మా వియ్యపురాలికీ అమ్మమ్మా, నాన్నమ్మ అని పిలిపించుకోవాలని కోరికతో వాళ్లని పోరు పెట్టాం. తనతో పెళ్లయిన వాళ్లందరూ తల్లులవ్వడం చూసి శిరీషలో కూడా మార్పు వచ్చింది. ఒక శుభ ఘడియలో "మేమిద్దరం తల్లిదండ్రులు కాబోతున్నాం" అంటూ అందరికీ మైల్ పెట్టారు. ఇదో కొత్త పద్ధతి కామోసు అనుకుని సంతోషపడ్డాను.

అమ్మాయి పురిటి కోసం అమెరికా వెళ్లాను. పండంటి మగబిడ్డను ప్రసవించింది. పురిటి నొప్పులు మరచి, బిడ్డను చేతికివ్వగానే తన గుండెలకి హత్తుకుని మురిసిపోయింది. ఒళ్లంతా పచ్చి పుండులా వున్నా, వాడిని పొదిని పట్టుకుని స్తన్యమిచ్చింది.

ఆశ్చర్యంతో, ఆనందంగా చూశా ఆ అపురూప తన్మయ దృశ్యాన్ని, అసలు పిల్లలేవద్దన్న శిరీషలో వచ్చిన మార్పు చూసి "మాతృత్వంలోని మహిమ ఇదే కదా!" అనిపించింది.

తన మాట నిలబెట్టుకుంటూ ఇండియాలో ఒక అనాధ పిల్లని "సేవ్ ఎ చైల్డ్" సంస్థ ద్వారా దత్తత తీసుకుని చదివిస్తోంది.

# 7

# మై కాల్ ఈజ్ నెప్పింగ్

"అమ్మా! గవర్నమెంట్ ఇస్కూల్‌లో ఇంగ్లీషు మీడియం పెడతారంట. పేపర్లో వేసిందా?" అంటూ పనిమనిషి రత్తాలు అడుగుతూ లోపలికి వచ్చింది.

"అవును పెడతారట" పేపర్లో రాశారు అని చెప్పాను.

''పోనీలే అమ్మా! మా బిడ్డను ఈ సంవత్సరం కాన్వెంట్ స్కూల్లో జేరిపిద్దామనుకుంటండం నేనూ, మా ఆయన. గవర్నమెంటోల్లే ఇంగ్లీషులో చదివిస్తే పైసలు మిగలతాయి" అని సంబరంగా చెప్పింది.

ఇంగ్లీషు మీడియం అనగానే నా మనసు నా స్కూల్ రోజుల్లోకి పరకాయ ప్రవేశం చేసింది. మా ఇంటి దగ్గరున్న ప్రభుత్వ పాఠశాలలో హాయిగా, ఆడుతూ పాడుతూ ఆరో క్లాసు ఏడాది పరీక్షలు రాశాను. ఎప్పుడూ క్లాస్‌లో మొదటి స్థానంలో ఉండి, టీచర్లందరి చేత మెప్పు పొందేదాన్ని, అది నాకు చాలా ఆనందంగా, గర్వంగా ఉండేది.

ఒకరోజు మా అమ్మ నాన్నగారితో "రోజా పెద్దదవుతోంది. ఈ కో ఎడ్యుకేషన్ స్కూల్ మానిపించి గరల్స్ కాన్వెంట్ స్కూల్లో వేద్దాం. ఇంగ్లీషు మీడియంలో వేస్తే, రేపు పెద్ద చదువులకెళ్లినా, ఉద్యోగం చేయాలన్నా భవిష్యత్తు ఇంగ్లీషుతోనే ఉంది కదా! తెలుగు సబ్జెక్ట్ ఎలానూ ఉంటుంది" అని చెప్పడం, నాన్న సరేననడం జరిగిపోయింది.

నాకు ఓ మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న తపనతో ఓ పేరు మోసిన కాన్వెంట్ స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేర్పించారు. నేను కూడా చాలా ఉత్సాహంగా, కొత్త స్కూల్ డ్రెస్, బూట్లు, మంచి పుస్తకాల బ్యాగ్ చూసి మురిసిపోయాను. మా స్కూల్ డ్రెస్ గులాబీ రంగు స్కర్ట్. తెల్లజాకెట్. గులాబీరంగు డ్రెస్‌లో ముద్దుగా ఇమిడిపోయిన నన్ను చూసి అమ్మా నాన్నలు మురిసిపోయారు. నేను కూడా చాలా సంతోషంగా, హుషారుగా స్కూల్ బస్‌లో మొదటిరోజు బడికి వెళ్లాను.

కొత్త స్కూల్ కావడంవల్ల నాకు స్నేహితులెవరూ లేరు. ఆ స్కూల్ ఆవరణ చాలా పెద్దది. పెద్ద గ్రౌండ్‌లో అందరు పిల్లలు తరగతి వారీగా వరుసగా నిల్చున్నారు. ఒక్కొక్క క్లాసుకి ఒక వాలంటీర్ ఉన్నారు. నేను కొత్తదాన్ని కాబట్టి వాలంటీర్ నా బాడ్జ్‌మీద క్లాసూ, సెక్షన్ చూసి 7వ క్లాసు 'బి' సెక్షన్ వరుసలో నిలబెట్టింది. ప్రిన్సిపల్, ఇతర టీచర్లు స్టేజి మీద నిలబడ్డారు. సీనియర్ విద్యార్థులు "వందేమాతరం" ప్రార్థన పాడారు. ప్రార్థన అవగానే ప్రిన్సిపల్ "గుడ్‌మార్నింగ్ చిల్డ్రన్" అంటూ అందరినీ విష్ చేసింది. "గుడ్‌మార్నింగ్ మేడమ్" అంటూ పిల్లలందరూ ముక్తకంఠంతో చెప్పి, మార్చ్ చేస్తూ వరుస క్రమంలో క్లాసుల్లోకి వెళ్లారు. నేను కొత్తదాన్ని అవడంతో ముందు బెంచీలో కూర్చోమన్నారు.

మొదటి క్లాసు "ఇంగ్లీషు" సబ్జెక్ట్. ఇంగ్లీషు చెప్పే హేమా టీచర్ వచ్చింది. అందరితోపాటు నేను కూడా లేచి నిల్చున్నాను.

"గుడ్‌మార్నింగ్ టీచర్" అన్నారందరూ.

"వెరీ గుడ్‌మార్నింగ్ స్టూడెంట్స్. బి సీటెడ్ ఇన్ యువర్ సీట్స్" అంటూ కుర్చీలో కూర్చుంది.

ఇక్కడే వచ్చింది నాకు చిక్కు. ఇప్పటి దాకా నాకు 'ఏబీసీడీ' మాత్రమే నేర్పించారు. గుడ్‌మార్నింగ్ తప్పితే ఏమీ అర్థం కాలేదు. అందరూ ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు. ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదు. బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాను. ఇంగ్లీషు క్లాసు అయిపోయింది. వేరే టీచర్ వచ్చే లోపల నా పక్కన కూర్చున్న అమ్మాయిని అడిగా నీ పేరేమిటి? అని ''ఇష్'' అంటూ నోటిమీద వేలు పెట్టి (తెలుగులో మాట్లాడకూడదు). "స్పీక్ ఇన్ ఇంగ్లీషు" అంటూ తన పేరు సుష్మ అని చెప్పింది. తరువాత సైన్స్ టీచర్ వచ్చింది. ఏ టీచర్ వచ్చి ఏ పాఠం చెప్పినా నాకు అన్నీ ఒకటే రకంగా ఉన్నాయి. ఒక్క ముక్క అర్థం కాలేదు. నన్ను పట్టించుకున్న వాళ్లు లేరు. అదే పాత స్కూల్లో అయితే ఎంత బావుండేదో, నేనే అన్నింట్లో ఫస్ట్. అందరూ మెచ్చుకునేవాళ్లు. ఈ కాన్వెంట్ స్కూల్లో అంతా గందరగోళంగా ఉంది. అక్కడి వాతావరణం అర్థం కాక కళ్లంబడి నీళ్లు వచ్చాయి.

మధ్యాహ్నం లంచ్ బెల్ అయింది. విశాలమైన పచ్చని లాన్‌లో అందరూ బాక్స్‌లు తెరచి మాట్లాడుకుంటూ తినడం మొదలుపెట్టారు. నేను కూడా బాక్స్ తెచ్చుఉని సుష్మ

పక్కన కూచుని "నేను కొత్తగా చేరాను. నాతో స్నేహం చేస్తావా?" అనడిగాను.

"యు ఆర్ వెల్‌కమ్ హావ్ లంచ్ విత్ అజ్" అంటూ ఆహ్వానించింది. ఆ మాటలకు అర్థం తెలియకపోయినా ఒప్పుకుందని అర్థం అయింది. ఏమనుకుందో ఏమో నా మొహం చూసి ఈ స్కూల్లో ఇంగ్లీషులోనే మాట్లాడాలి. ఇంగ్లీషు మీడియం కదా మనది. తెలుగులో మాట్లాడితే ఫైన్ వేస్తారు. మన బెంచీకి ఝూన్సీ లీడర్. మనం తెలుగులో మాట్లాడితే ఒక వాక్యానికి పావలా ఫైన్ వేస్తుంది. నీ వల్ల నాక్కూడా ఫైన్ పడుతుంది. ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకో" అంటూ ఒంగి నా చెవిలో చెప్పింది.

క్లాసులోకి వెళ్లిన తరువాత మాథ్స్, సోషల్ ఏవేవో క్లాసులు జరిగాయి. ఇంటి బెల్ కొట్టగానే బతుకుజీవుడా అనుకుంటూ ఇంటికొచ్చాను. నాకోసం అమ్మ జీడిపప్పు ఉప్మా చేసి నేను చెప్పే కబుర్ల కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తోంది. నిరుత్సాహంగా, ఏడుపు మొహం పెట్టుకుని వచ్చిన నన్ను చూసి గాభరాపడి విషయం అడిగింది. విషయమంతా చెప్పి బావురుమన్నాను. ఇంతలో నాన్న కూడా ఆఫీసు నుంచి కాస్త ముందుగా వచ్చారు. గుమ్మంలోనే నాన్నను గట్టిగా కావలించుకుని "నాన్నా! నాకీ స్కూల్ ఏమీ నచ్చలేదు. నన్ను పాత స్కూల్‌కి మార్పించేయి" అన్నాను ఏడుస్తూ.

"ఏమైంది ఎందుకేడుస్తున్నావు అంటూ బుజ్జగిస్తూ లోపలికి తీసుకొచ్చారు నాన్నా".

"క్లాసులో వాళ్లేం చెబుతున్నారో నాకేమీ అర్థం కావడం లేదు. అందరితో ఇంగ్లీషే మాట్లాడాలిట. తెలుగులో మాట్లాడితే ఫైన్ కట్టాలిట. నాకీ స్కూల్ వద్దు నాన్నా! చాలా భయంగా ఉంది. క్లాసులో అందరూ నన్నో ఇంగ్లీషు రాని మొద్దమ్మాయిలా చూస్తున్నారు. నాకు చాలా అవమానంగా ఉంది" అంటూ మళ్లీ బావురుమన్నాను.

నాన్న నన్ను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ "చూడు ఈ రోజు మొదటి రోజు కదా అలాగే ఉంటుంది. అందరూ ఇంగ్లీషు మాట్లాడుతుంటే నీకూ వచ్చేస్తుంది. నువ్వు చాలా తెలివిగలదానివి. కొద్ది రోజులు ఓపిక పట్టు. మరీ బాగా లేకపోతే అప్పుడు నీ ఇష్టం వచ్చినట్టు చేద్దాం. బోలెడంత డబ్బు కట్టి మంచి స్కూల్లో వేశాం. మా బంగారు తల్లి కష్టపడి చదివి మాకు మంచి పేరు తెచ్చి పెడుతుంది కదూ!" అంటూ బుజ్జగించారు.

ఇలా రోజూ నేను ఏదో ఒక కంప్లయింట్ చెపుతూ, బడి మార్పించమనడం, అమ్మానాన్నలు నచ్చ చెప్పి పంపించడం జరిగింది.

నెల రోజులయ్యేసరికి ఇంగ్లీషు అర్థం అవడం మొదలయ్యింది. కానీ మాట్లాడటం రాలేదు. ఎవరిని పలకరిద్దామన్నా ఫైన్ వేస్తారనే భయంతో బిక్కుబిక్కుమంటూ కూర్చోవడం దుర్భరంగా ఉంది.

ఒక రోజు కొత్తగా కట్టిన భవనంలోకి మా క్లాసు మార్చారు. అక్కడ కూర్చోడానికి ఇంకా బెంచీలు, వెయ్యలేదు. కొద్ది రోజులు కింద కూర్చుని సర్దుకోమంటూ క్లాసు టీచర్ చెప్పింది.

ఆ రోజు వరుసగా నాలుగు క్లాసులు కింద కూర్చునేసరికి నా కాలు తిమ్మిరి పట్టింది. లేచి నుంచుని కాలు ఝూడిద్దామంటే, టీచర్ ఏమంటుందోనని భయం. కొంతసేపటికి భరించలేక, ఒక్కసారిగా లేచి నుంచున్నాను.

ఒక్కసారిగా నుంచున్న నన్ను చూసి "వాట్ హాపెండ్" టీచర్ ఆశ్చర్యపోతూ అడిగింది.

కాలు తిమ్మిరి ఒకవైపు, పైగా జవాబు ఇంగ్లీషులో చెప్పాలి. లేకపోతే ఫైన్. ఈ నెలరోజుల్లో నాకొచ్చిన కొద్దిపాటి ఇంగ్లీషులో "మై కాల్ ఈజ్ నెప్పింగ్ టీచర్" అన్నాను. (మై లెగ్ ఈజ్ సైనింగ్) మంచి ఇంగ్లీషులో జవాబిచ్చానని సంతోషం వేసింది.

"వాట్ డిడ్ యు సే?" అంటూ నా జవాబుకి తికమక పడి తేరుకుని పడీపడీ నవ్వింది టీచర్. క్లాసులో పిల్లలందరూ కూడా నవ్వడం మొదలుపెట్టారు. ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాక, సిగ్గుతో తలవంచుకున్నా అమాయకంగా. ఇపుడు తలచుకుంటే ఎంత నవ్వొస్తుందో.

ఆ విషయం ఈ రోజుకీ రీల్‌లా నా కళ్లముందర తిరిగి నాలో నేను ముసి ముసి నవ్వులు నవ్వుకుంటుంటే. "ఏంటమ్మా! నీలో నువ్వే నవ్వుకుంటున్నావు. నా పని అయింది వెళ్లొస్తా" అంటూ రత్తాలు మాటలతో వర్తమానంలోకి వచ్చా.

# 8

# ఆమె ధైర్యలక్ష్మి

"అమ్మా పిల్లల్ని సర్కారు బడిలో వేద్దామనుకుంటున్నాను. ఇక్కడకి దగ్గరలో బడి ఉందా?" మా పనిమనిషి లక్ష్మి అడిగింది. మేముండేది అపార్టుమెంటులో. వాచ్‌మెన్ ఎవరు ఉంటే, వాడి భార్య మా ఇళ్లల్లో పని చేస్తుంది. వాచ్‌మెన్ వీరయ్య కొత్తగా చేరాడు. భార్యా, ఇద్దరు పిల్లలు. మనిషి చాలా నీట్‌గా ఉంటాడు. భార్య లక్ష్మి చాలా చక్కనిది. పని కూడా చాలా శుభ్రంగా చకచకలాడుతూ చేస్తుంది. పనిలోకి కుదరగానే, పిల్లల్ని బడిలో వేయాలని తాపత్రాయ పడింది. దాన్ని చూస్తే ముచ్చటేసింది. పిల్లవాడిని మూడో క్లాసులో, పిల్లని రెండో క్లాసులో వేయాలని చెప్పింది.

మరి పాత స్కూల్ నుంచి టి.సి. తెచ్చావా అనడిగాను.

"తేలేదు మేము ఇక్కడికి వచ్చేటప్పటికి, బడి ఇంకా తెరవలేదు. అదే చెప్తాను. తరువాత ఇస్తానని, చేర్చుకుంటారు" అనండి.

"సరే దానికంత భరోసా ఉన్నప్పుడు నాకెందుకు" అనుకుని.

"ఇక్కడికి దగ్గరలోనే గవర్నమెంటు స్కూల్ ఉంది. ఏడో క్లాసు వరకూ నేను అక్కడే చదువుకున్నాను. చదువు బాగానే చెప్తారు" అన్నాను.

"తరువాత ఎందుకు మానేశారమ్మా" అనడిగింది.

"చదువు మానెయ్యలేదు. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఆడపిల్లల బడిలో వేయమని మా అవ్వ పోరు పెట్టేసరికి మా నాయన ఎనిమిదో క్లాసు నుంచి మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాలలో చేర్పించారు". దానికి సంజాయిషీ ఇస్తున్నట్టుగా చెప్పాను.

"అయితే అమ్మా! మీరు కూడా రండి. పిల్లల్ని బడిలో చేర్పించి వద్దాము. మీరు వస్తే తొందరగా పని అవుతుంది. మిగతా ఇళ్లల్లో పని ముగించుకుని వస్తాను" అడిగింది లక్ష్మి.

"సరే అలాగే వస్తానులే!" అన్నాను. మనసులో చిన్నప్పుడు చదువుకున్న స్కూల్ చూడాలని కుతూహలంగా ఉంది.

మధ్యాహ్నం రెండు గంటలకి, పని ముగించుకుని వస్తాను" అడిగింది లక్ష్మి.

"సరే అలాగే వస్తానులే!" అన్నాను. మనసులో చిన్నప్పుడు చదువుకున్న స్కూల్ చూడాలని కుతూహలంగా ఉంది.

మధ్యాహ్నం రెండు గంటలకి, పని ముగించుకుని పిల్లలిద్దరినీ తీసుకుని వచ్చింది. వాళ్లతోపాటు నా చిన్నప్పటి బడికి వచ్చాను. స్కూల్‌లో పిల్లలంతా పరుగులు తీస్తూ ఆటలాడుతూ కనబడ్డారు. "హెడ్ మాస్టరుగారి గది ఎక్కడ" అని అడిగి వెళ్లాము. ఆయన గది, కొత్తగా చేరే పిల్లలతో, వాళ్ల తల్లిదండ్రులతో కిటకిటలాడిపోతోంది.

బడిపిల్లలకి, సర్కారు పెట్టే మధ్యాహ్నపు భోజనాలు ముగించుకుని, పిల్లలంతా ఆడుతూ, కొట్టుకుంటూ వాదులాడుకుంటూ క్లాసులోకి వెడుతున్నారు. ఒకటే గోలగోలగా ఉంది వాతావరణం. పైగా పదో క్లాసు సప్లిమెంటరీ పరీక్షలకు ఈ స్కూల్లో సెంటరు వేశారు. పాపం హెడ్ మాస్టరు ఒక నోటితో పదిమందికి సమాధానం చెబుతూ, కొత్తగా చేరే వారిని ఇంటర్వ్యూ చేస్తూ, అష్టావధానం చేస్తున్నాడు.

ఆఫీసులో ఏ.సి. గదిలో కూర్చుని పని చేసుకుంటూ, బెల్ నొక్కగానే వచ్చే పర్సనల్ అసిస్టెంటుతో, అటెండరుతో పనులు చేయించుకుంటూ, నిశ్శబ్ద వాతావరణానికి అలవాటుపడిన నాకు చాలాకాలం తరువాత, ఈ బడి వాతావరణం కొత్తగా, గందరగోళంగా ఉండి చికాకు అనిపించింది. అయినా తమాయించుకుని, హెడ్‌మాస్టరు రూములోకి చొరబడి, నేను ఫలానా అని పరిచయం చేసుకుని, 1961 ప్రాంతంలో ఇదే బడిలో చదువుకున్నానని చెప్పి, ఇప్పుడు వచ్చిన పని చెప్పాను. పాపం, ఆయన అంత ఉక్కిరిబిక్కిరిగా ఉన్నా, ఎంతో మర్యాదగా కూర్చోండమ్మా ఒక్క నిముషం" అని కుర్చీ చూపించి, బెల్ నొక్కి స్కూల్ ఆయాని పిలిచాడు.

తరువాత రెండు ఫారాలు ఇచ్చి "వీళ్లని లలితా టీచర్ దగ్గరికి తీసుకెళ్లి, నేను పంపించానని చెప్పు. ఈ ఫారమ్‌లు నింపించి తీసుకురా" అంటూ మమ్మల్ని ఆమె

వెంబడి పంపించాడు. "ఆయా", లక్ష్మిని బయటే ఉండమని చెప్పి, నన్ను స్టాఫ్‌రూమ్‌కి తీసుకెళ్లింది. టీచర్స్ అందరినీ పలకరించి వారి పేర్లూ, ఏ క్లాసులకీ పాఠాలు చెబుతారు అని అడిగి తెలుసుకున్నాను.

"నేను ఈ బడిలో ఏడో క్లాసు వరకు చదువుకున్నాను" అన్నాను.

"అవునా" అంటూ వాళ్లందరూ ఉత్సాహంగా అడిగారు.

"అవును" అప్పుడు సూర్యనారాయణమూర్తి సారు తెలుగు చెప్పేవారు. క్లాసుకి రాగానే అందరినీ కళ్లు మూసుకుని 5 నిముషాలు ధ్యానం చేయమనేవారు. మేమందరం కళ్లు మూసుకుని దొంగతనంగా కళ్లు తెరుస్తూ మూస్తూ, 5 నిముషాలు ఎప్పుడు అవుతుందా అని చూసే వాళ్లం. ఆయన ధ్యానంలో ఉన్నా, ఎలా తెలిసేదో ఏమో అలా కళ్లు మూసి తెరిచిన వాళ్లని పిలిచి, ఒంగో పెట్టి ఒక్క గుద్దు గుద్దేవాడు. గుడ్ల నీళ్లు కక్కుకుంటూ, సీటుకొచ్చి కూర్చునేవాళ్లు. ఇప్పుడంటే, యోగా, ధ్యానం అని బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. కానీ ఆ రోజుల్లోనే ఆయన మాచేత ధ్యానం చేయించారు. దాని విలువ అప్పట్లో మాకు తెలిసేది కాదు'' అంటూ చెబుతుంటే టీచర్లంతా ''అవును సూర్యనారాయణమూర్తిగారు చాలా పద్ధతి గల మనిషి. మీరు ఆయన దగ్గర చదువుకున్నారా? అంటూ సంభ్రమంగా అడిగారు.

ఇంతలో హెడ్‌మాస్టరు పిలుస్తున్నారంటూ ఆయా వచ్చింది. ఫామ్ తీసుకుని ఆయన గదిలోకి వచ్చాము. ఫామ్ సరిగా నింపారో లేదో చూసుకుని, పిల్లల టి.సి.లు చూపించమని లక్ష్మిని అడిగారు. ఏమాత్రం తొట్రుపడకుండా "ముందు చేర్చుకోండి సారూ. ఈసారి మావూరు వెళ్లినప్పుడు తెచ్చి చూపిస్తా" అంది లక్ష్మి.

నా మొహం చూసి ఏమనలేక "సరే తప్పకుండా ఈసారి తీసుకురా. మా రికార్డులో పెట్టుకోవాలి కదా?" అన్నారు. తరువాత నా వైపు తిరిగి ఒక్కొక్క విద్యార్థికి వంద రూపాయలు కట్టాలి. అది కూడా ఏడాదికి ఒక్కసారే! పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులూ మేమే ఇస్తాము. మధ్యాహ్నం పిల్లలకు చక్కటి భోజనాలు పెడతాము. మామూలు బియ్యం కాదు చాలా ఫైన్ రైస్. మన ఇళ్లల్లో కొనే బియ్యం కన్నా మంచి సన్నబియ్యం, కూర, సాంబారు పెడతాం" అంటూ వివరించాడు.

"గవర్నమెంటు స్కూళ్లల్లో ఇన్ని సదుపాయాలున్నాయా" అని ఆశ్చర్యపోయాను. పిల్లలిద్దరికీ రెండు వందల రూపాయలు నేనే కట్టి పిల్లల్ని బడిలో చేర్పించి, లక్ష్మికి

ఉపకారం చేశాననీ, అది నా వంక కృతజ్ఞతాభావంతో చూస్తుందనీ ఊహించా".

కానీ అదేమీ కనపడకపోగా (నన్ను పిలుచుకొచ్చిందే అందుకోసమన్నట్టు) నిర్లిప్తంగా హెడ్‌మాస్టరు వంక, నా వంక చూస్తూ "సర్కారు బడులన్నింటిలో పుస్తకాలిస్తారు. అన్నం పెడతారు. ఇవన్నీ నా కెరికే" అంటూ స్కూలు చుట్టూ కలియ చూస్తూ "పిల్లలకి ఆడుకునేందుకు ఆటస్థలమే లేదు. ఎక్కడ ఆటలాడిస్తారు. మా జనగామలో అయితే ఇస్కూల్ చుట్టూరా మస్తు జాగా ఉంది. ఇక్కడేంది అసలు గ్రౌండ్ లేదు" అంటూ తనేదో సర్దుకుపోయి ఈ స్కూల్‌లో చేర్చినట్టు మాట్లాడింది. నోరు వెళ్లబెట్టి చూడటం హెడ్‌మాస్టారు వంతయింది.

పాపం! గవర్నమెంట్ అక్షరాస్యతా శాతం పెంచాలని, పిల్లలకి ఇన్ని సదుపాయాలు చేస్తుంటే, ఏదో వారి మీద దయ తలచి అక్కడ చదివిస్తున్నట్టున్న లక్ష్మి ప్రవర్తన నాకు బాధ కలిగించింది.

పిల్లలిద్దరినీ ఎడ్మిట్ చేయించి, తిరిగి వస్తుంటే, నాకు కొంచెం కోపం వచ్చి "ఏంటి లక్ష్మీ! అలా మాట్లాడావు? మేమందరం ఇక్కడ చదువుకునే పెద్దపెద్ద ఉద్యోగాలు చేశాం. మా చిన్నప్పుడు ఆటస్థలం లేదు. దగ్గరలో ఉన్న వెల్ ఫేర్ సెంటర్ గ్రౌండ్‌కి తీసుకెళ్లి "డ్రిల్" చేయించేవారు. అయినా మీలాంటి వాళ్ల పిల్లల్ని చదివించడానికి, ప్రభుత్వం ఇన్ని సదుపాయాలు చేస్తుంటే, వాటిని ఉపయోగించుకుని పిల్లల్ని బాగా చదివించుకోవాలి కానీ, ఇలా మాట్లాడుతున్నావేమిటి? అన్నాను.

"మీరన్నది నిజమే! కానీ అమ్మా! సదుపాయాలు చేయక ఏం చేస్తారు? మా కాళ్ల చుట్టూ తిరిగి అది చేస్తాం. ఇది చేస్తాం" అని ఊరించి, ఓట్లు వేయించుకున్నారు గదా! మా ఓట్లతోనే గదా వాళ్లు "ఎమ్.ఎల్.ఏ." అయి ఇప్పుడు కోట్లు గడించారు. ఇచ్చినమాట పెకారం, మా బాగోగులు, పిల్లగాండ్ల చదువులు చూడకుంట ఏం చేస్తరు? మళ్లీ మా కాడకొచ్చి ఓట్లు అడగగలరా? అంటూ ఎదురు ప్రశ్నించింది.

అవాక్కవడం నా వంతయింది. చదువుకున్న వాడికంటే చాకలాడు నయమని మా అవ్వ అనేది. చదువూ, సంస్కారం మా నోరు మూయించిన విషయాలు, చదువురాని లక్ష్మి ఎంత నిర్భయంగా వెలిబుచ్చింది? లక్ష్మి నా కళ్లకి ఈ వ్యవస్థను ప్రశ్నించే వీరవనితలా, నాయకులను నిలదీసే ధైర్యలక్ష్మిలా కనపడింది.

# 9

# గాభరా గాభరా...

"అమ్మా నాకు అస్సలు బాగా లేదమ్మా! చాలా భయంగా వుంది" అంటూ మా అబ్బాయి రవి రాత్రి 8-00 గం॥లకు ఫోన్ చేశాడు. రవి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ముంబయిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక స్నేహితుడితో కలిసి, అపార్టుమెంటులో అద్దెకి వుంటున్నాడు. అతడు నార్త్ ఇండియన్. మనవాడు సౌత్ ఇండియన్. కాబట్టి ఎవరి వంటలు వాళ్లు వండుకుని తింటున్నారు.

ఇక్కడ వుండగా కంచంలో కలిపి ఇస్తే ల్యాప్‌టాప్ ముందరేసుకుని పని చేసుకుంటూ తినేవాడు. ఇప్పుడేమో, ముంబయిలో వేరే మంచి కంపెనీలో జాబ్ వచ్చిందని వెళ్లాడు. ఏం వండుకుంటున్నాడో, ఏం తింటున్నాడో అని బాధగా వుంటుంది. పెళ్లి చేస్తే వాడికి ఒక తోడు వుంటుంది, మా బాధ్యత తీరుతుందని, పోరు పెడుతున్నాను.

పెళ్లి మాట ఎత్తగానే "ఇప్పుడే ఏంటి అమ్మా కొట్టి పారేస్తాడు. ఇంక నా గోడు మా వారితోనేగా చెప్పుకునేది అని ఎంతసేపూ ఆఫీసూ, ఇల్లే కానీ, కొడుకు పెళ్లి విషయం ఆలోచించరు" అంటూ నా కోపం అంతా ఆయన మీద చూపించా."వాడి పెళ్లికి అప్పుడే తొందర ఏమి వచ్చింది. వాడిని ఇంకా ఉద్యోగంలో సెటిల్ అవనీ" అంటూ వాడికి మావారి వత్తాసు. అది కాదండీ ఇప్పుడు పెద్ద వుద్యోగం వచ్చింది కదా! ఇప్పుడు ఆడపిల్లలు కూడా బాగా చదువుకుని ఉద్యోగం చేస్తున్నారు. మా మేనమామ మనవరాలు ఇలాగే ఎం.బి.ఏ. చేసి ఉద్యోగం చేస్తోంది. పెళ్లి చేద్దామంటే, నా కాళ్ల మీద నేను నిలబడి, నా అభిప్రాయాలతో ఏకీభవించేవాడు. దొరికితేనే పెళ్లి చేసుకుంటా, లేకపోతే ఇలాగే వుంటా" అంటూ పెళ్లి మాట ఎత్తనివ్వడం లేదు.

ఇలా అబ్బాయి అభిప్రాయాలూ, అమ్మాయి అభిప్రాయాలూ కలిసి, వాళ్లు పెళ్లి చేసుకుందాం అని డిసైడ్ చేసుకోవడానికి చాలా టైమ్ పడుతుంది. అందుకే ఇప్పటి నుంచే సంబంధాలు చూస్తుంటే, ఏదో ఒకటి సెటిల్ అవుతుంది. అంటూ పట్టువదలని విక్రమార్కుడిలాగా ఆయన వెంట పడ్డాను.

"నేను మటుకు కాదన్నానా? వాడేమో, సంపాదించుకుని, ఇల్లూ, కారూ, లేటెస్ట్ మోడల్ టి.వి. వగైరా అన్నీ సమకూర్చుకున్న తరువాతే పెళ్లి చేసుకుంటాను అంటాడు. నువ్వేమో ఇలా తొందర పెడతావు. వాడి మాట కూడా కరెక్టే కదా వాడి హోదా చూస్తేనే కదా ఏ ఆడపిల్ల అయినా పెళ్లి చేసుకోవడానికి ముందుకు వచ్చేది. కాబట్టి కొద్దిగా వాడికి టైమ్ ఇద్దాం. నువ్వు తొందరపడకు" అన్నారు.

"అవునండీ సంబంధాలు చూద్దామంటున్నాను. చూడగానే అన్నీ కుదరవు కదా! ఇద్దరివీ జాతకాలు కుదరాలి, జాతకం బావుంటే అమ్మాయి బావుండవు. అమ్మాయి బాగా వుంటే జాతకం కుదరదు. ఇలా ఎంతమంది తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారో. మీకేం తెలుసు. ఆఫీసుకి ఠంచనుగా వెళ్లి, ఫైళ్లలో తలదూరాడం తప్ప. ఇప్పటి నుంచీ సంబంధాలు చూస్తూ వుంటే రవి సెటిల్ అయ్యే టైమ్ రానే వస్తుంది" అంటూ పట్టిన పట్టు విడవకుండా వాడినో ఇంటివాడిని చెయ్యడానికి నా తాపత్రయమంతా.

ఇప్పుడు తండ్రీ కొడుకులది ఒకటే మాట అయిందా. ఇక చేసేదేముంది అని దేవుడి మీద భారం వేశాను.

రవిది పైలా పచ్చీసు వయస్సు. వచ్చిన జీతం అంతా సినిమాలకీ, షికార్లకీ, ఫ్రెండ్స్‌కీ ఖర్చు చేస్తాడు. ప్రతి వారాంతపు సెలవుల్లోనూ రానూపోనూ ఫ్లైట్ బుక్ చేసుకుని, హైదరాబాద్‌కి వచ్చి షాపింగ్ మాల్స్ అన్నీ తిరిగి, అవసరం వున్నవీ లేనివీ (బ్రాండెడ్ వస్తువులు మాత్రమే) కొనడం, జేబు ఖాళీ చేసుకుని వెళ్లడం అలవాటు అయింది. ఆ వున్న రెండు రోజులూ.. అమ్మా నువ్వు చేసినట్టు 'ఆలూ ఫ్రై' ఎవ్వరూ చెయ్యలేరు అని నన్ను ఉబ్బేస్తూ మామిడికాయ పప్పు, మసాలా వంకాయ, ఇలా తనకిష్టమైనవన్నీ చేయించుకునవన్నీ తింటాడు. మళ్లీ ముంబై వెళ్లే రోజు "హాయిగా తినాలనిపించినవన్నీ నీ చేత వండించుకుని తిన్నాను. నీకు తృప్తిగా వుందా? మళ్లీ హైదరాబాదు వచ్చేదాకా నీ వంట రుచి తలుచుకుంటూ గడిపేస్తాను. నా గురించి బెంగపెట్టుకోకు" అంటూ మురిపించి వెళ్తాడు.

ఇలా వాడి పైలా పచ్చీసు జీవితం నాకు తెలుసు, కాబట్టే, పెళ్లి చేస్తే కాస్త కుదురుతనం, డబ్బు పొదుపు తెలుస్తాయని నా వుద్దేశ్యం. ఇల్లూ, కారూ అంటున్నాడు కానీ, సేవింగ్స్ లేకుండా, ఇలా ఖర్చు చేస్తే, ఎప్పటికి సెటిల్ అవుతాడు. వూరికే పైపై మాటలు చెప్పి, పెళ్లి నుంచి తప్పించుకోవాలని చూస్తున్నాడు. అయినా అదేమిటో ఈ కాలం ఆడపిల్లలైనా, మొగపిల్లలైనా పెళ్లంటే భయపడుతున్నారు. అదో పెద్ద బాధ్యత

అనీ వాళ్ల ఫ్రీడమ్ ఏదో పోతుందనీ.

"అమ్మా ఏంటి ఏమీ మాట్లాడవు" అనే సరికి ఉలిక్కిపడ్డాను.

రవి ఎప్పుడూ చాలా హుషారుగా వుంటాడు. ఆరోగ్య సమస్యలు కూడా ఏమీ లేవు. అలాంటిది కంగారుపడుతూ బాగా లేదంటూ ఫోన్.

"ఏంటీ రవీ ఏం బాగా లేదు? ఏమయ్యింది!" ఆతృతగా అడిగా.

"అమ్మా నాకు బ్లడ్ మోషన్స్ అవుతున్నాయి. పొద్దున్నుంచీ మూడు, నాలుగు సార్లు ఇలా అయినాయి. నీకు చెబితే భయపడతావనీ, ఇప్పటిదాకా చెప్పలేదు. తగ్గిపోతాయని అనుకున్నాను. ఇంకా తగ్గలేదు. ఇప్పుడు రాత్రి అయ్యేసరికి భయంగా వుండి ఫోన్ చేస్తున్నా!" వాడి గొంతులో భయం తొంగి చూస్తోంది" వాడికే కాదు, నాకూ, మా వారికీ కూడా బ్లడ్ మోషన్స్ అనేసరికి గాభరా వేసింది.

"మీ రూమ్మేట్‌ని తీసుకుని డాక్టర్ దగ్గరికి వెళ్లు" అన్నాను. వాడు లేడమ్మా, నాలుగు రోజులు సెలవు తీసుకుని, వాళ్ల వూరు దగ్గరికి వెళ్లాడు. నేనొక్కడినే వున్నాను" అన్నాడు.

పోనీ మీ ఆఫీసు కొలిగ్స్‌ని అడిగి, మంచి డాక్టరు దగ్గరకి వెళ్లి చూపించుకో" అన్నాను.

ఇవాళ శనివారం కదా! అందరూ ఫామిలీస్‌తో బయటకు వెళ్తారు. ఈ టైమ్‌లో వాళ్లని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు నాకు" అంటూ మొహమాటపట్టాడు. అందరం ఏం చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాము.

"అమ్మా పోనీ మన ఫామిలీ డాక్టర్ మూర్తి గారికి ఫోన్ చేసి కనుక్కో. ఏమన్నా మందు చెబుతాడేమో.. తరువాతి సంగతి రేపు పొద్దున్న చూడచ్చు" అన్నాడు.

ఎప్పుడూ హుషారుగా, ధైర్యంగా నాకేంటిలే అన్నట్టు వుండే రవి, ఇంతలా గాభరా పడుతున్నాడేమిటి? అని ఆందోళన వేసి "అలాగే కనుక్కుంటా నువ్వు అధైర్యపడకు" అని చెప్పి మా ఫ్యామిలీ డాక్టర్ మూర్తిగారికి ఫోన్ చేసి విషయం అంతా చెప్పాను... అంతా విన్న మూర్తిగారు "అంత గాభరా పడకండమ్మా" ముందు మీ వాడిని రక్తపరీక్ష, మూత్రా పరీక్ష, స్టూల్స్ ఎగ్జామినేషన్ చేయించుకుని రిపోర్టులో ఏముందో చెబితే, దాన్ని బట్టీ ఏం మందు వాడాలో చెబుతాను. అర్జెంట్‌గా ఇప్పుడే రిపోర్ట్సు కావాలి అని అడిగితే ఇస్తారు. లేకపోతే రేపు ఇస్తాము అంటారు. "రవి"ని కంగారు పడవద్దని చెప్పండి. ఈ

రోజుల్లో అన్నిటికీ మెడిసిన్స్ వున్నాయి. కంగారు పడాల్సిందేమీ లేదు" అంటూ ధైర్యం చెప్పారు. ఆయన చెప్పిన విషయం తు.చ. తప్పకుండా వాడికి చెప్పాను.

అదేంటమ్మా అలా చెప్పారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా – రక్త పరీక్షలు ఎలా చేస్తారు. పైగా ఇక్కడ డయాగ్నాస్టిక్ ల్యాబ్ ఎక్కడ వుందో ఏమిటో? ఇంత రాత్రి పూట పరీక్షలు చేస్తారో? లేదో? అంటూ ఆందోళనతో చికాకు పడుతూ నాకే ప్రశ్నలు సంధించాడు.

ఉద్యోగానికి వెళ్లిన ఈ సంవత్సరంలో ముంబయి అంతా దున్నేసినవాడు, ఇప్పుడు ఏవి ఎక్కడ వున్నాయో తెలియదు అంటూ బేలగా మాట్లాడుతుంటే, పాపం పిచ్చి వెధవ ఎంత భయపడుతున్నాడో, ఏమిటో? అని ఎటూ పాలుపోక "పోనీ ఫ్లైట్ ఎక్కి వెంటనే హైదరాబాదు వచ్చేయి. ఒక్క గంటలో ఇక్కడ వుంటావు. మన ఇంటి చుట్టు పక్కల అన్నీ డయాగ్నాస్టిక్ సెంటర్లు వున్నాయి. ఎయిర్‌పోర్ట్ నుంచి డైరెక్ట్‌గా అటే వెళ్లి పరీక్షలు చేయించుకుని, డాక్టర్ మూర్తిగారి దగ్గరకెళ్లి చూపించుకొద్దాం" అంటూ మరింత గాభరాగా నేను ఫోన్‌లో చెప్పా.

మా ఇద్దరి సంభాషణ సైలెంట్‌గా వింటున్న మా వారు "ఏమిటి! ఇందాకట్నించి చూస్తున్నాను. ఇంత చిన్న విషయానికి. వాడేదో చెప్పడం, నువ్వు గాభరా పడి వాడిని గాభరా పెట్టడం, వాడూ పెద్దవాడయ్యాడు. బయట ఉద్యోగానికి వెళ్లినప్పుడు ధైర్యంగా వుండాలి కానీ మాటిమాటికీ అమ్మా అమ్మా అంటూ చిన్న కూచిలాగా వాడు ఫోన్ చెయ్యడం, ఫ్లైట్ ఎక్కి వచ్చేయమని నువ్వు చెప్పడం. చాలా బావుంది. వాడికి ధైర్యం చెప్పాల్సిందీ పోయి, నువ్వు గాభరా పడుతున్నావు.

అసలు ఇంతకీ పొద్దుట్నించీ వాడు ఏమి తిన్నాడో కనుక్కున్నావా? బయటికి వెళ్లి అడ్డమైన తిండీ తిని వుంటాడు అంటూ తనని ఇప్పటిదాకా సంప్రదించకుండా మేమిద్దరమే మాట్లాడుకుంటున్నామన్న ఉక్రోషం మాటల్లో ప్రదర్శించారు.

"నేను బయట ఏమీ తినలేదు" ఫోన్లో వాళ్ల నాన్న మాటలు వినపడి కోపంగా అన్నాడు.

"సరే. ఇవాళ పొద్దున్న ఏం వండుకుని తిన్నావు? ఏమన్నా వేడి చేసే కూరలు తిన్నావా?" అంటూ అప్పుడు గుర్తుకొచ్చి ఆరా తీశాను.

ఒక్క పక్క వాళ్ల నాన్న మాటలకి ఉక్రోషం, ఒక పక్క తనకేదో అయిపోయిందన్న భయంతో, పొద్దున్నుంచీ ఏమి తిన్నాడో కూడా గుర్తుకు రాలేదు రవికి.

మావారి మీద భలే కోపం వచ్చింది నాకు. "ఏదైనా తన దాకా వస్తే కానీ తెలీదులెండి. పిల్లవాడు అంత గాభరా పడుతూ ఫోన్ చేస్తే, మీ దెప్పి పొడుపులూ మీరీనూ" వాడు ఫ్లైట్‌లో వస్తే డబ్బు ఖర్చయిపోతుందనే కదా మీ బాధంతా.. మిమ్మల్నేమీ అడగడు కదా! వాడి ఖర్చు వాడు పెట్టుకుని వస్తే కూడా మీకు బాధేనా? ఒక్కడే వున్నాడు అందులో రాత్రిపూట భయంతో వాడు అల్లాడిపోతుంటే, మీ మాటలు వాడిని మరింత బాధ పెడుతున్నాయి" అంటూ నా ఆవేదనంతా వెళ్లగక్కాను.

"వాడేమి తిన్నాడో వాడికే గుర్తు లేదు. అది ముందు కనుక్కుని విషయం రాబట్టు. తరువాత నా మీద విరుచుకుపడుదువు" గాని, అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్టు, వాడినేమీ అడగలేక అనలేక, నా మీద చూపిస్తున్నావు నీ ప్రతాపమంతా" ఛాన్స్ దొరికిందని మావారి మాటల తూటాలు.

"నా కోసం మీ ఇద్దరూ గొడవపడకండి" ఇప్పుడే గుర్తుకొచ్చింది. నాకు బీట్‌రూట్ కూర ఇష్టం కదా! ఇవాళ సెలవు కదా! బీట్‌రూట్, ఉల్లిగడ్డ వేసి కూర చేసుకున్నా చాలా బాగా రుచిగా వచ్చింది కూర. మంచి ఆకలి మీద వుండి, మొదటి నుంచి, చివరిదాకా దానితోనే తిన్నాను అంతే! ఇంకేమీ తినలేదు" అన్నాడు.

అప్పుడు వెలిగింది బల్బ్ నాకు... 'ఓరీనీ! బీట్‌రూట్ తిన్నావా? అదీ సంగతి. అందుకే ఎర్రగా అయింది మోషన్. అది బ్లడ్ మోషన్ కాదు. బాగా మంచినీళ్లు తాగు. రేపటికల్లా మామూలుగా అవుతుంది. ఇంక భయం లేదు అంటూ భరోసాగా చెప్పాను.

"అవునా! బీట్‌రూట్ తింటే ఇలా అవుతుందా? చాలా భయం వేసింది అమ్మా. నిజంగానేనా? అబ్బ ఎంత రిలీఫ్‌గా వుందో ఇప్పుడు. ఈ కాసేపట్లో ఎన్ని ఆలోచనతో? ఇది క్యాన్సర్ ఏమో? ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లాలి? మీ దగ్గరకి రావాలా? లేక మిమ్మల్నే ఇక్కడకు పిలిపించుకోవాలా? అబ్బ ఎన్ని ఆలోచనలో. కాసేపు పిచ్చెక్కినంత పనయింది. "ఓగాడ్! ఎంత గాభరా పడ్డాను" సంతోషంతో ఎక్సైట్ అవుతూ మాట్లాడుతున్నాడు. వాడి భయం, నా భయం దూదిపిందెంలా ఎగిరిపోయింది.

తను కల్పించుకోబట్టే, ఏం తిన్నాడో తెలిసి, సమస్య పరిష్కారమయిందని, విజయగర్వంతో నా వంక చూపు విసిరారు మావారు.

బీట్‌రూట్ ఎంతపని చేశావు? ఒక అరగంట పాటు ఆడించావు మా అందరినీ! అని నవ్వుకొని ఒక పెద్ద నిట్టూర్పుతో నిద్రకి వుపక్రమించాను

*(ఆంధ్రప్రభ సండే మ్యాగజైన్‌లో ప్రచురితం)*

# 10

# న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి

జయా! అమ్మని ఎక్కడ చేర్చావు? పొద్దున్నే ఏడు గంటలకి అన్నయ్య విక్రమ్ దగ్గర నుంచి ఫోన్. వాడి గొంతులో ఉక్రోషం, అసహనం కొట్టొస్తూ బాణంలా దూసుకొచ్చింది ప్రశ్న. ప్రొద్దున్నే వేడి వేడి కాఫీ ఆస్వాదిస్తూ, పేపర్ చదువుతుంటే అన్నయ్య దగ్గర నుంచి వచ్చిన ఫోన్ తత్తరపాటు కలిగించింది.

'అదేమిటి? నిన్న పిన్ని దగ్గర రెండు రోజులుండి వస్తాను అంటే వాళ్లింట్లో నువ్వేగా దింపి వెళ్లావు. నన్నడుగుతావేంటి? అన్నాను.

నన్ను బుకాయించాలని చూడకు. పిన్నికి ఫోన్ చేస్తే నువ్వు వచ్చి అమ్మను ఏదో ఆశ్రమంలో చేర్చడానికి తీసుకెళ్లావని చెప్పింది. ఎక్కడ చేర్పించావు? అంతా నీ యిష్టమేనా? నన్నడగాల్సిన అవసరం లేదనుకున్నావా? చాలా తీవ్రంగా వుంది వాడి గొంతు. అమ్మ వాడితో పిన్ని దగ్గర రెండు రోజులుండి వస్తాను అని చెప్పిన మాట వాస్తవమే!

నిజానికి, అమ్మని వృద్ధాశ్రమంలో చేర్పించింది నేనే! "నాకు వృద్ధాశ్రమాలకి వెళ్లడం అక్కడ పెద్దవారిని పలకరించి పండూ ఫలాలు, స్వీట్స్ ఇవ్వడం అలవాటు. పండుగలప్పుడు ముందు రోజే ఆశ్రమానికి వెళ్లి ఆ రోజు పిండివంటలతో వారికి భోజనం ఏర్పాటు చేయడానికి డబ్బు కట్టి, వారితో కూర్చుని భోజనం చేయడం, వారి కష్టసుఖాలు పంచుకోవడం చేసేదాన్ని. అక్కడున్న పెద్దవారి చేత వారు వయసులో ఉండగా పండగ ఎలా చేసుకున్నారో, అనాటి, అచ్చట్లు, ముచ్చట్లు చెప్పించేదాన్ని. ఆ రోజులు తలచుకొని, ఆ ముచ్చట్లు తలచుకుంటుంటే వారి ముఖాల్లో చెప్పలేని ఆనందం కనిపించేది.

కొంతమంది పాటలు పాడేవారు. కొంతమంది ఆధ్యాత్మిక విషయాలు పంచుకొనేవారు. వారితో గడిపిన ఆ రోజు నాకు చాలా తృప్తిని ఇచ్చేది. మావి, పిల్లలవి పుట్టిన రోజులకు, మా పెళ్ళి రోజుకో ఒక్కొక్కసారి ఒక వృద్ధాశ్రమంలో డబ్బు కట్టి,

ఆ రోజు వారితోపాటు భోజనం చేసేవాళ్లం. పిల్లలకు కూడా అదే అలవాటు చేశాను. ఆఫీసు నుంచి మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో, గురువారం రోజు సంఘమిత్ర వృద్ధాశ్రమానికి వచ్చి, సాయిబాబా భజనలు చేసి, బాబా చరిత్ర వినిపించి మళ్లీ ఆటోలో ఆఫీసుకి వెళ్లేదాన్ని. నాలాంటి భావాలున్న, కామేశ్వరి, గీత, రమాలను వెంటే తీసుకెళ్లేదాన్ని. వాళ్లు కూడా వచ్చి కొంచెం సేపు వాళ్లతో సమయం గడిపేవారు.

మేము వారితో కాసేపు మాట్లాడి, కలిసి సమయం గడిపినందుకు వృద్ధుల ముఖంలో కలిగిన ఆనందం చూసి "నీ వల్ల మాకు కూడా కొంచెం సేవాభావం, తృప్తి కలిగినాయి. చాలా థ్యాంక్స్" అంటూ ఆనందం వెలిబుచ్చేవారు.

మా అమ్మతో ఈ విషయాలన్నీ చెప్పేదాన్ని. "అమ్మా అక్కడ వృద్ధాశ్రమంలో చేరిన వాళ్లంతా పిల్లలు చూడక దిక్కుతోచక వచ్చిన వాళ్లు కాదు. కొంతమంది అలాంటివారు వున్నా స్వచ్ఛందంగా చేరినవారు కూడా వున్నారు అంటూ చెప్పేదాన్ని.

"సుబ్బమ్మ గారని 90 ఏళ్ల వృద్ధురాలు అక్కడ వున్నారు. ఆవిడని ఒకసారి ఎందుకమ్మా ఈ అవసాన దశలో ఇక్కడ అవస్థలు పడుతున్నారు, అయిన వారెవరూ లేరా?" అని అడిగాను.

దానికి ఆవిడ బోసినోరంతా తెరుచుకుని నవ్వుతూ అందరూ అలాగే అడుగుతారు. నిజానికి నా ఇష్ట ప్రకారమే ఇక్కడికి వచ్చాను. మా అబ్బాయి, కోడలు, వుద్యోగాలకీ, మనవడు-మనవరాలు స్కూల్‌కి వెళ్లిపోతారు. ఒక్కదాన్నే పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ వుండాలి. డైనింగ్ టేబుల్ మీద అన్నీ వండి పెట్టి వెళుతుంది. అయినా ఒక్కొక్కసారి గదిలోంచి వచ్చి, టేబుల్ దగ్గరికి వచ్చి, మంచినీళ్లు, కంచం పెట్టుకుని వడ్డించుకుని తినాలంటే ఓపికగా వుండదు. ఎవరైనా కంపెనీ వుంటే బావుంటుందనిపిస్తుంది. ఒక్కోసారి ఇలా ఎంతకాలం బ్రతకాలి అన్న నిర్వేదం కూడా వచ్చి, అలాగే మంచంలో పడుకుని వుండేదాన్ని. కొడుకు, కోడలు ఇంటికి వచ్చి నన్ను సరిగ్గా చూడలేకపోతున్నారేమోనని బాధపడేవాళ్లు. మరి ఈ రోజుల్లో ఇద్దరూ వుద్యోగాలు చేయకపోతే పిల్లలని బాగా మంచి చదువులు చదివించలేరు. కాబట్టి వాళ్లని ఏమీ అనలేను.

ఇదే కాకుండా, మధ్యాహ్నం పూట సేల్స్ వాళ్లు, రిపేర్ చేసేవాళ్లు, స్టీలు బాసన్ల వాళ్లు అంటూ ఎవరో ఒకరు వచ్చి కాలింగ్ బెల్ కొడతారు. తలుపు తియ్యాలంటే,

లోపలికి జొరబడి దొంగతనానికి పాల్పడతారని భయం. తలుపు గొళ్లాలు నాకు అందవు. వాళ్లు వెళ్లిన తరువాత మళ్లీ గొళ్లెం వేద్దామంటే, సరిగ్గా పడిందో లేదో అని భయం.

ఇలాంటి ఈతి బాధలు చాలా వుంటాయి. అవి చిన్న విషయాలే అయినా, వయస్సు రీత్యా తలుపు తియ్యాలన్నా వెయ్యాలన్నా భయంగా వుంటుంది. నా గురించి పిల్లలు బాధపడటం బాగా అనిపించలేదు.

అందుకే కొడుకుని, కోడలిని ఒప్పించి ఈ ఆశ్రమంలో చేరాను. ఇక్కడ చేరిన తరువాత నేను ఎవరికీ బరువు కాదు అన్న భావం కలిగింది. దేనికోసమూ ఎదరు చూడక్కరలేదు. పొద్దున్నే కాఫీ, టిఫిన్ వేడిగా నా మంచం దగ్గర బల్లమీద వడ్డిస్తారు. తిన్నంతా పెడతారు.

వయస్సు మీద పడ్డాక జిహ్వాచాపల్యం ఎక్కువగా వుంటుంది. టిఫిన్ బావుంటే ఎక్కువ తినాలనిపిస్తుంది. అది ఇంట్లో వుండే వాళ్లకి, ఈ వయస్సులో అవీ ఇవీ తినాలని కోరికలేమిటో అని ఆశ్చర్యంగా వుంటుంది. కొంచెం ఎక్కువ తినాలన్నా అడగడానికి మొహమాటంగా వుంటుంది.

ఇక్కడ వృద్ధాశ్రమ నిర్వాహకులకి విషయాలన్నీ తెలుసు కాబట్టి, అందరినీ అడుగుతూ వీలున్నంతవరకూ వాళ్ల వాళ్ల అవసరాన్ని బట్టీ మెసులుకుంటారు. నాకు పళ్లు అన్నీ చాలా మటుకు వూడిపోయాయి. ఈ ఆశ్రమంలో నాకు అన్నాన్ని జావలా చేసి, మెత్తగా గిన్నెలో ఇస్తారు. మందులు వేసుకున్నారా అన్నీ గుర్తు చేస్తారు. వారానికి ఒకసారి డాక్టర్ వచ్చి చూస్తారు. పండుగలకి పిల్లలు వచ్చి ఇంటికి తీసుకెళ్లి మళ్లీ తీసుకొస్తారు. చుట్టాలంతా ఇక్కడికి నన్ను చూడడానికి వస్తారు. వారానికొకసారి కొడుకు, కోడలు వచ్చి పళ్లు, స్వీట్లు తీసుకొచ్చి ఇస్తారు. ఇక్కడ నాకు ఏ బాధ్యతా లేదు. నా చుట్టూరా నాలాంటి వాళ్లతో హాయిగా కబుర్లు చెప్పుకుంటూ, వారి కబుర్లు వింటూ కాలం గడిపేస్తున్నాను.

వారం వారం ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు వుంటాయి. చదువుకునే వాళ్లు రామాయణ, భారతాలు చదువుకుంటారు. చూపు ఆనని వాళ్లు హాల్లో వున్న టి.వి.లో ఆధ్యాత్మిక ప్రవచనాలు వింటారు.

మా ఆశ్రమంలో వుండే చెట్ల దగ్గర సాయంకాలం కుర్చీలు వేస్తారు. ఓపిక వున్న వాళ్లు అక్కడ చేరి కాసేపు చల్లగాలిని పీలుస్తూ చిన్ననాటి ముచ్చట్లు నెమరు వేసుకుంటాము.

ఈ రకమైన జీవితమే, వయస్సు మీరిన వారు కావాలనుకుంటారు. ఇంట్లో వాళ్లు తమని ఎంత బాగా చూసుకున్నా, వారి వురుకుల పరుగుల జీవితం వలన తల్లిదండ్రులకి ఎక్కువ సమయం కేటాయించలేరు. పెద్దవాళ్లకి, తమ వంట్లోని బాధలని, చిన్ననాటి విషయాలను, తాము ఎంత గొప్పగా బ్రతికామూ, లాంటి విషయాలు ఎవరితోనన్నా పంచుకోవాలనిపిస్తుంది. అది వృద్ధాశ్రమాల్లో తమతోటి వారితో పంచుకోగలుగుతారు. ఎరమరికలు లేకుండా అన్ని విషయాలూ మాట్లాడుకోగలుగుతారు. ఎందుకంటే ఈ విషయాలు తమ వారితో ఎవరూ చెప్పరు అన్న భరోసా వుంటుంది. మనసు తేలికగా వుంటుంది అని సుబ్బమ్మగారు తాను ఇక్కడ ఎంతో హాయిగా వుంటున్నాను" అని చెప్పారు.

అమ్మతో ఈ విషయాలు అప్పుడప్పుడు చెబుతూ ఉండేదాన్ని.

"అవునులే సర్దుకుపోయే గుణం వుంటే, ఎక్కడయినా బాగానే వుంటుంది. ఎంత సేపటికి పిల్లలు మాత్రమే చూడాలి అనే విషయం నుంచి, బయటపడి ఆలోచిస్తే, మన ఈడు వాళ్లతో మనసులో మాట పంచుకోవచ్చు. టైమ్‌కి భోజన సదుపాయాలు వుంటాయి. ఒంట్లో బాగా లేకపోతే, వెంటనే పలకరించే మనుషులు, డాక్టరుని పిలిపించడం అంటూ సదుపాయాలు వుంటాయి" కదా అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చింది.

నాకు కూడా కొన్ని రోజులు మార్పుగా వుంటుంది. వృద్ధాశ్రమంలో వుండాలని వుంది. నీ అన్న విక్రమ్‌కి చెబితే పరువు తక్కువ అని చేరనివ్వడు. నువ్వే ఏదో రకంగా నాకు కొద్ది రోజులు, వాడికి తెలియకుండా వుండే ఏర్పాటు చెయ్యి. ఇంట్లో పొద్దున్న నుంచీ ఒక్కదాన్నే వుండీ వుండీ విసుగు పుడుతోంది. ఇంట్లో నాకేమీ లోటు లేదు. హాయిగా ఏ.సి. గది, నాకొక టి.వి. చదువుకునేందుకు మంచి పుస్తకాలు వున్నాయి. కానీ ఇక్కడ నా అవసరం ఎవరికీ లేదు. ఏదో ముక్తసరిగా పలకరింపు తప్పితే. అన్నీ వున్నా, మనసులో మాట చెప్పుకోవడానికీ, నాకు తెలిసిన భారత, భాగవత కథలు ఎవరికన్నా చెప్పడానికీ. కాసేపు 'పిచ్చాపాటి' మాట్లాడుకోవడానికీ, నా వయస్సు మనుషులు కావాలనిపిస్తుంది." అంటూ మనస్సులో బాధ వెళ్లబోసుకుంది.

అలాగే ఒకసారి అక్కయకి, బావగారికి కూడా చెబుతాము. విక్రమ్ ఏదన్నా గొడవ చేసిన అక్క నాకు సపోర్టుగా ఉంటుంది అన్నాను. "ఏమో అది ఒప్పుకుంటుందో లేదో చెప్పి చూద్దాం" అంది అమ్మ. అక్క బావగార్లకు అమ్మ విషయం చెప్పాను. మా

బావగారు, మీ అమ్మకి కొడుకు దగ్గర ఉండడం ఇష్టం లేకపోతే మా ఇంట్లో వుండమను, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరిస్తే మీ అన్నయ్యకే కాదు, మన అందరికీ పరువు తక్కువే! అన్నారు. మా అక్క బావగారి మాట జవదాటదు. అమ్మ బాధ దానికి తలకెక్కలేదు.

బావగారు పనిమీద బయటికి వెళ్లి లంచ్, టిఫిన్‌కి రాలేకపోతే, ఆకలి దంచేస్తున్నా, నీరసం వస్తున్నా అన్నం తినదు. భర్తతో కలిసి అన్నం తింటేనే, పాతివ్రత్యం అనుకుంటుంది. ఇంక అమ్మ కోరిక అదేం సమర్థిస్తుంది?

అక్కా బావగార్ల అభిప్రాయం అమ్మకు చెప్పాను.

ఈ మాట విని అమ్మ కొన్ని రోజులు మౌనంగా వుంది. కానీ ఆవిడకి కొంతకాలం ఎటన్నా వెళ్లి ఒంటరిగా వుండి రావాలన్న కోరిక మాత్రం అలాగే వుంది.

నేను సంఘమిత్ర ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కొంత కాలం సెక్రటరీగా వుండటం వలన, ఎవరికీ చెప్పకుండా నన్నక్కడ చేర్పించమని, నాలుగు రోజులు చూసి, అక్కడ వుండగలను అనుకుంటే. వుంటా. లేకపోతే మళ్లీ వెనక్కి వచ్చేస్తా. మీ అన్నయ్యకి తెలిస్తే పరువు తక్కువని పంపడు అని అమ్మ బాధగా చెప్పింది.

అమ్మ కోరిక వృద్ధాశ్రమంలో చైర్మన్ గారికి చెప్పాను. "మీ అమ్మ పెద్దింటి నుంచి వచ్చారు కదా? ఇక్కడ వుండగలరో లేరో? ప్రస్తుతానికి నా రెస్ట్ రూమ్‌లో ఉండే ఏర్పాటు చేస్తాను. నాలుగు రోజులు ఉండి, ఆవిడ ఉండగలను అనుకుంటే అప్పుడు రూమ్ ఎలాట్ చేస్తాను అన్నారు చైర్మన్.

ఇది బాగానే ఉంది అనుకొని అమ్మతో విషయం చెప్పాను. అందుకని ఇద్దరం ఆలోచించుకొని మా అన్నయ్యని తన చెల్లెలి ఇంట్లో దింపమని చెప్పింది. అక్కడ నాలుగు రోజులుండి వస్తానని వాడికి చెప్పింది. వాడు పిన్ని ఇంట్లో దింపి వెళ్లాడు. మా పిన్నికి ఈ విషయం మేము చెప్పలేదు. ఆ రోజే సాయంత్రం వృద్ధాశ్రమంలో ముందరే చెప్పి పెట్టిన విధంగా అమ్మని దిగబెట్టి, అక్కడ అందరినీ పరిచయం చేసి వచ్చాను.

మర్నాడు ఉదయమే మా అన్నయ్య, అమ్మతో మాట్లాడడానికి పిన్ని ఇంటికి ఫోన్ చేయడం, ఆవిడ సాయంత్రమే మీ అమ్మని తీసుకొని ఏదో ఆశ్రమంలో చేర్పిస్తానని జయ తీసుకొని వెళ్లిందని చెప్పడం జరిగింది. వాడు ఆఘమేఘాల మీద నాకు ఫోన్ చేసి, నా మీద విరుచుకుపడ్డాడు. వెంటనే అమ్మని తీసుకురా అంటూ హుకుం జారీ చేశాడు.

ఏం చెయ్యాలో పాలుపోక, అమ్మా! ఎలా వున్నావు అని ఫోన్ చేసి అడిగాను. అమ్మ హాయిగా ప్రొద్దున్నే లేచి, ఎదరుగుండా వున్న హరిహర క్షేత్రంలో దేవుడి దర్శనం చేసుకుని, అందరూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేసుకున్నాము. ఇప్పుడే బ్రేక్‌ఫాస్ట్ చేశాను. చాలా ప్రశాంతంగా వుంది అంటూ సంతోషంగా చెప్పింది.

అమ్మా! నువ్వు స్త్రీగా పుట్టినందుకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేవు. తీసుకున్నా స్వేచ్ఛగా ఇష్టమైన రీతిలో బ్రతకలేవు అనుకుని మనసులో చాలా బాధపడుతూ "అమ్మా! నిన్ను తీసుకెళ్లి మళ్లీ నీ కొడుకు ఇంట్లో దింపడానికి వస్తున్నా, బట్టలు సర్దుకు రెడీగా వుండు" వచ్చిన తరువాత జరిగిన విషయం చెబుతాను అంటూ భారమైన మనస్సుతో వృద్ధాశ్రమానికి బయలుదేరాను.

# 11

# ఏ విజిట్ టు జైల్

హైదరాబాదులో చెర్లపల్లి ఓపెన్ జైలు చాలా ఆధునికంగా కట్టారు. దేశవిదేశాల వాళ్లు జైలులోని ఫెసిలిటీస్ స్టడీ చేయడానికి చూడడానికి వస్తూ వుంటారు. అవి పేపర్లలో చదివాను. అనుకోకుండా నేను ట్రాన్స్‌ఫర్ మీద హెూమ్ డిపార్టుమెంట్‌కి వచ్చాను.

నా స్నేహితురాలు సుగుణ అప్పటికే హెూమ్ డిపార్టుమెంట్‌లో ఉపకార్యదర్శిగా హెూదాగల పొజిషన్‌లో వుంది. నేను అక్కడ చేరగానే రమతో అన్నారు. నాకు ఒకసారి చెర్లపల్లి ఓపెన్ జైలు చూడాలని వుంది అని. అలాగే ఒక రోజు వీలు చూసుకుని వెళ్దాము. ముందుగా విజిట్‌కి వస్తున్నామని జైలు సూపరింటెండెంట్‌కి చెప్పాలి అని అంది.

అలా ఒక రోజు ఎన్నాళ్లుగానో నేను చూడాలి అనుకుంటున్న జైలుకి మేమిద్దరం వెళ్లాము. జైలు ఆవరణలో ఉదయం 10.30 గం॥లకు వెళ్లాము. ఆవరణ అంతా చాలా శుభ్రంగా నీట్‌గా వుంది. కొంతమంది శుభ్రంగా, కట్ చేసిన పల్చాటి లాన్స్‌లో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంతమంది భుజాల మీద చేతులు వేసుకుని నడుచుకుంటూ వెళ్తున్నారు. మమ్మల్ని ఇద్దరు జైలు అధికారులు వచ్చి, జైలు సూపరింటెండెంట్ గదికి తీసుకెళ్లారు. ఆయన మమ్మల్ని చిరునవ్వుతో కూర్చోమని చెప్పి, అక్కడే వున్నతనితో, మాకు కాఫీ తెమ్మని చెప్పారు. ఆయన మాతో అటు పక్కనే లాన్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్న వాళ్లూ, ఒకరి భుజాల మీద ఒకరు చేతులేసుకుని మాట్లాడుకుంటూ వెళ్తున్నవాళ్లూ, ఇదిగో ఆ పక్కన కూచుని, కంప్యూటర్లో పని చేస్తున్నాడూ, అందరూ కూడా నేరస్తులే, శిక్ష అనుభవిస్తున్నవాళ్లే అని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ పక్కన కూర్చుని, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీరులా పని చేస్తున్న, అతడు నేరస్తుడు అనేసరికి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసుకుని అతని వంక చూశాను. అతడు, ఇవన్నీ తనకి మామూలే అన్నట్టుగా తన పని తాను చేసుకుంటున్నాడు.

మీరు ఇక్కడ కూర్చుని, అన్నీ చూసినట్లే బయట చెట్ల కింద కూర్చున్నారు. భుజాన చేతులు వేసుకుని వెళ్తున్నారు అని చెప్తున్నారు. వాళ్లని అలా ఎలా తిరగనిస్తున్నారు.

మీరు వాళ్లని ఎలా అబ్జర్వ్ చేస్తున్నారు అని అడిగాము.

ఇక్కడ అన్నీ సి.సి. కెమెరాల్లో కనపడుతూ వుంటాయి. వాళ్లు ఎక్కడికీ పారిపోలేదు. వాళ్లకి డ్యూటీలు వుంటాయి. చెట్లకి నీళ్లు పోసేవాళ్లూ. పూడ్చేవాళ్లూ, వంట చేసే వాళ్లూ అందరూ శిక్ష అనుభవిస్తున్నవాళ్లే!

మీరు ఒకసారి జైలు ఆవరణ అంతా తిరిగి రండి, మా పి.ఎ.ని. పంపిస్తాను అని. బెల్ కొట్టి పి.ఎ.ని. పిలిచి చెప్పారు. అతనితో బయటకి రాగానే, నేను వుండబట్టలేక అడిగాను. మీ సూపరింటెండెంట్ పక్క కంప్యూటర్‌లో పని చేస్తున్నతను, చాలా మంచి ఫ్యామిలీ నుంచి వచ్చినట్టున్నాడు. అతని డ్రెస్ కూడా కంప్యూటర్ ఇంజనీర్‌కు మల్లే వుంది. అతను నేరస్తుడేమిటి? ఏం నేరం చేశాడు? అని అడిగాను.

అతనిదో విషాద కథ. అతడి పేరు రామారావు. హైదరాబాదులో ఉద్యోగం రావడంతో విజయవాడ నుంచి వచ్చి, ముగ్గురు తెలిసిన వాళ్లలో రూమ్ షేర్ చేసుకుని, తరువాత వేరే రూమ్ వెతుక్కుందామనుకున్నాడు. రెండు రోజుల తరువాత సడెన్‌గా పోలీసులు రైడ్ చేసి, అందరినీ అరెస్ట్ చేసి ఇక్కడికి తెచ్చారు. అతను చేసిన నేరం ఏమీ లేదు. ఆ రూమ్‌లో వున్న ఒకతనికి నక్సలైట్లతో సంబంధం వుందిట. అందుకని అతనితోపాటు రూమ్‌లో వున్న వారందరినీ అరెస్ట్ చేసి పట్టుకొచ్చారు. నిజానికి చాలా అమాయకుడు. రెండు రోజులు రూమ్ షేర్ చేసుకున్నందుకు, ఫలితం ఉద్యోగం పోయింది. తల్లిదండ్రులు వచ్చి నెత్తీ నోరు బాదుకుని, మా అబ్బాయి అలాంటి వాడు కాదని చెప్పినా, కేసు తేలేంత వరకూ అతడిని విడుదల చేసేది లేదని చెప్పారు. కేసు కోర్టులో వుంది. నక్సలైట్ కేసు అంటే కోర్టులో హియరింగ్‌కి చాలా టైమ్ పడుతుంది. ఎప్పటికి నిర్దోషిగా బయట పడతాడో ఏమో! అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కాబట్టి మా సారు, దయ తలచి మా ఆఫీసు వర్క్ అంతా అతనిచేత కంప్యూటరైజ్ చేయిస్తున్నారు. చాలా మంచి కుర్రాడు. అతని భవిష్యత్తు ఇప్పుడు అంధకారమయింది అని చెప్పాడు.

అతని కథ వినగానే మనసంతా కలచి వేసింది. మన ఇంట్లో కుర్రాడిలా, అమాయకంగా ఉద్యోగం చేసుకోవడానికి వచ్చి, ఎవడో చేసిన నేరానికి, బలి అయ్యాడు. ఇలాంటి వాళ్లు ఇంకా ఎంతమంది వున్నారో అనుకుంటూ, పి.ఎ.తో పాటు నడుస్తున్నాము.

ఒక పెద్ద హాలులో చాలామంది కూచుని నేలమీద పులి-మేక అష్టాచమ్మా లాంటి ఆటలు చాకుపీసుతో గీసుకుని ఆడుకుంటున్నారు. ఇంకో పెద్ద హాలులో కొంతమంది కూచుని టి.వి.లో సినిమా చూస్తున్నారు. మాకు వింతగా అనిపించింది. వీళ్లందరూ ఖైదీలేనా? అనడిగాను.

అవును. వీళ్లకి కిచెన్ డ్యూటీ. అంటే మొత్తం జైలులో వుండే వాళ్లందరికీ వంట చేయడానికి పెద్ద వంటగది వుంది. అందులో వంటకి, కూరగాయలు తరగడం, బియ్యం, పప్పులు శుభ్రం చేయడం లాంటి పనులు వుంటాయి. అవన్నీ చేసి, ఈ గదుల్లో వచ్చి కూర్చుని, కొంతమంది ఆటలు ఆడుకుంటున్నారు. కొంతమంది టి.వి. చూస్తున్నారు అంటూ వంటశాల దగ్గరకి తీసుకెళ్లాడు.

మళ్లీ జైల్ సూపరింటెండెంట్ గదిలోకి వెళ్లి ఆయన్ని అభినందించాము. అప్పుడే అయిపోలేదు. మీరు, కూరగాయల తోట, పండ్ల తోటలు కూడా చూడాలి. కాసేపు రెస్ట్ తీసుకుని బయలుదేరండి అంటూ ఇంకా ఈ జైలు విశేషాలు చెప్పారు.

పి.ఎ.తో పాటు ఈసారి పళ్ల తోటలకి వెళ్లాము. అక్కడ ఖైదీలందరూ, కూరగాయల మళ్లకి నీళ్లు పెడుతూ, కొందరు కూరగాయలని ప్యాక్ చేస్తూ, కొందరు పళ్లని కోసి బుట్టకెత్తుతూ కనపడ్డారు. ఎంతో ఆహ్లాదంగా వుంది ఆ దృశ్యం. కొన్ని కూరగాయలు, పళ్లూ, మేమొచ్చిన కార్లో పెట్టించమని పి.ఎ. చెప్పాడు. అక్కడ నుంచి బయటకు వచ్చాము. దానికి మేము డబ్బుల ఇచ్చేసాము. మళ్లీ ఇది కూడ ఒక దొంగతనం అవుతుంది కదా ఉచితంగా తీసుకుంటే అనుకుని.

మేము మొదట వచ్చిన ముఖద్వారం దగ్గర లాన్స్‌లో చాలామంది కుర్రకారు కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ల దగ్గరకి తీసుకెళ్లి వీళ్లకి, మీరేమైనా బాగుపడే విషయాలు చెప్పండి అందరినీ ఎడ్రస్ చేస్తూ మాట్లాడండి అన్నారు.

ఎవరు వీళ్లంతా, అందరూ కుర్రవయస్సు వాళ్లే! వాళ్లలో జైలు కొచ్చామని ఒక పశ్చాత్తాపం కానీ, భయం కానీ లేవు. ఇది మాకు మామూలే అన్నట్టు నిర్లక్ష్యంగా వున్నారు అని అడిగాము.

వీళ్లంతా రోడ్ల పక్కన, చెట్ల కింద జులాయిల్లా కూచుని, పత్తాలు ఆడుకుంటూ, చిల్లర దొంగతనాలతో గుట్కా కొనుక్కుని నములుకుంటూ, వాళ్లల్లో వాళ్లు కొట్లాడుకుంటూ, పొడుచుకోవడాలు, కొట్లాటలు. పెట్టీ కేసుకింద అరెస్ట్ చేసి తెచ్చాము. శిక్ష ఖరారు చేసేంతవరకూ ఇక్కడే ఇలా తింటూ తిరుగుతూ వుంటారు. వీళ్లకి జామీను ఇచ్చేవాళ్లు ఎవరూ వుండరు అంటూ వాళ్ల గురించి చెప్పారు.

అవును ఇలా జులాయిల్లా తిరిగేవారు దేశంలో ఎంతమందో! అమ్మా అయ్యా కూలి పనులకి వెళ్తే, వీళ్లు జులాయిల్లా తిరుగుతూ పత్తాలు ఆడుతూ చెట్లకింద కనపడతారు.

ఏదో అనుకుంటాం గానీ, ప్రభుత్వానికి ఎన్ని రకాల తలకాయ నెప్పులో!

సరే వాళ్లకేదో నీతి బోధ చేయమన్నాడు కదా అని, వాళ్లల్లో కొందరిని ఏమిటి ఎందుకొచ్చారు జైలుకి అని అడిగితే, ఒకళ్లిద్దరు కొంచెం వినయంగా సమాధానం చెప్పారు. చాలామంది ఇలాంటి వాళ్లని చాలామందిని చూశాం, మీరేంటి మాకు చెప్పేది అన్నట్టు నిర్లక్ష్యంగా వున్నారు.

చదువూ సంధ్యలు, సక్రమమైన కుటుంబ వాతావరణం లేని వాళ్లకి, మనం ఏమని చెబుతాం? భావిభారత పౌరులు మీరే! దేశాన్ని ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా అని చెప్పాలా? బాగా చదువుకుని పెద్ద ఉద్యోగాలు చేయమని చెప్పాలా? చదువుకోమని బడిలో వేస్తే, వీళ్లకసలు చదువు వస్తుందా! చదివినా ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయి? అని మనసులో వ్యధ.

అయినా, నాకు తోచిన మంచి మాటలు, వాళ్ల కర్థమయ్యే భాషలో చెప్పాను. మీ అమ్మానాన్నలు చదువుకోలేదు. మీరన్న చదువుకుని, ఉద్యోగాలు చేయండి. వాళ్లు మీ కోసం కష్టపడి ఒళ్లు హూనం చేసుకుంటున్నారు. మీరు పట్టిపట్టి చదివితే, కౌన్ బన్‌గా కరోడ్‌పతిలో, ఒక కాగితాలు ఏరుకునే పిల్లవాడు, కోటీశ్వరుడు అయినట్టు చూపించనట్టుగా అవగలరు. ప్రభుత్వం ఉచితంగా చదువు, తిండి, బట్టలు, స్కూల్ డ్రెస్, పుస్తకలు ఇస్తున్నారు. మీలాంటి వాళ్లు చదువుకోవాలనే కదా! మిమ్మల్ని చూస్తుంటే చాలా తెలివి గల వాళ్లలా వున్నారు. మంచిగా చదువుకోండి అమ్మా నాన్నల కష్టాలు తీర్చండి అని ఏదో చెప్పాను. నిజానికి, ఈ ఓపెన్ జైలులో వాళ్లకి ఇంటికంటే జైలు పదిలం అన్నట్టు బేఫికర్‌గా వున్నారు.

మీలాంటి వారికి రిజర్వేషన్‌లో ఉద్యోగాలు వస్తాయి అని కొంచెం వాళ్లని హుషారు చేశాము. కొంతమంది మొహాల్లో ఉత్సాహం కనిపించింది. కొంతమంది వూరికే విని వూరుకున్నారు.

అలా ఆ ఒక రోజు చెర్లపల్లి ఓపెన్ జైలులో మంచి అనుభవాన్ని పోగు చేసుకున్నాము. ఇంటికి తిరిగి వచ్చాక కారు డిక్కీలో ఆకుకూరలు, సొరకాయ, బెండకాయ, దొండకాయల సంచీ కనపడింది. (డబ్బులిచ్చి) నవ్వుకుంటూ లోపలికి తెచ్చాను.

ఫ్రెష్‌గా తోట నుంచి కోసుకొచ్చిన తోటకూర కదా! భలే రుచిగా వచ్చింది. భోజనాలు చేస్తూ కూర రుచి గురించి, అక్కడ విశేషాల గురించి పిల్లలతో పంచుకోవడం ఒక మరిచిపోలేని అనుభూతినిచ్చింది.

# 12

# హతవిధీ - చూపు మా దారి

అమ్మా! డాక్టరు ఏమన్నాడు?' ఇంటి ముందు కారు ఆగగానే కారు తలుపు తీస్తూ ఆతృతగా చేయి పట్టుకుని అడిగాడు అబ్బాయి రవి. లోపలికి వెళ్లి మాట్లాడుకుందాం పదండి అంటూ మా వారు ఇంట్లోకి నడిచారు. ఇంటి ముందు కొత్త వాళ్ల చెప్పుల జతలు కనపడ్డాయి. ఎవరొచ్చారో, అసలే చాలా అలసటగా వుంది అనుకుంటూ లోపలికి అడుగు పెట్టాను.

మా కోడలి అమ్మా నాన్నా డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని వున్నారు.

"ఎలా వున్నారు వదినగారూ! డాక్టరు ఏమన్నారు! మందులు రాసిచ్చారా! ఇంతకీ మీ జబ్బేమిటి? మీకు వంట్లో బాగాలేదని శిరిష చెబితే చూద్దామని వచ్చాము. చాలా సేపేయింది వచ్చి అంటూ వియ్యపురాలి పలకరింపు.

"ఆవిడ ఇప్పుడే కదా! గుమ్మంలోకి అడుగు పెట్టారు. కాసిని మంచినీళ్లు తాగి నిదానించనీ! నీ ప్రశ్నల పరంపర ఆపు" అంటూ వియ్యంకుడు ప్రకాశరావు భార్యని మందలించాడు.

కోడలు ఇచ్చిన మంచినీళ్లు తాగి, నాకు "రుమటాయిడ్ ఆర్థరైటిస్" అని మందులు రాసిచ్చారు.

"అంటే కీళ్ల నొప్పులా వదినగారూ" అని అడిగింది వియ్యపురాలు జానకి.

అవునండీ "కీళ్ల నెప్పులు, నుంచుని పని చేయలేకపోతున్నాను. చేతివేళ్లు ముడవడం కష్టంగా వుంది. గిన్నెలు, చెంచా కూడా పట్టుకోవడానికి రావడం లేదు. ప్రొద్దున నిద్ర లేవగానే, కాళ్లూ చేతులూ పట్టేసినట్టు వుంటున్నాయి. అందుకే ఒకసారి చూపించుకుందామని డాక్టర్ దగ్గరికి వెళ్ళాను.

"ఎముకకీ, ఎముకకీ మధ్య గుజ్జు ఎండిపోయిందట. దానికి మందులు రాసి

ఇచ్చాడు. ఫిజియోథెరపీ చేయించుకోమన్నారు డాక్టరు" అంటూ మళ్లీ ఆవిడ ప్రశ్నలు అడగకుండా అన్నీ చెప్పేశా!

"కీళ్ల నెప్పులు ఈ ఇంగ్లీషు మందులకి తగ్గవు. జీవితాంతం తీసుకోమంటారు. మా పక్కింటావిడకి ఇదే ప్రాబ్లం. ఆవిడ ఆయుర్వేదం మందులు వాడుతోంది. ఇప్పుడు బానే వుంది. పనులు చేసుకుంటోంది. ఆవిడని అడిగి ఆ మందులు చెబుతాను వేసుకోండి" ఇంగ్లీషు మందులు వేసుకుంటే, కడుపులో గ్యాస్ చేరి గడబిడగా వుంటుంది. మళ్లీ గ్యాస్ తగ్గడానికి ఒక గోలి వేసుకోవాలి".

"ఆయుర్వేదం మన భారతీయ వైద్యం. ఇప్పుడు అందరూ మళ్లీ దేశీయ మందులే వాడుతున్నారు" అంటూ ఊదరగొట్టింది వియ్యపురాలు.

"అలాగే మీరంతగా చెబుతుంటే కాదంటానా! ఆలోచిద్దాం" అన్నాను. సరే! జాగ్రత్త ఇక మేము బయలుదేరుతాము" అంటూ వెళ్లొస్తాం అన్నయ్యగారూ అంటూ లోపల టి.వి.లో పాత సినిమా చూస్తూ తన్మయత్వంలో వున్న మా వారికి చెప్పి బయలుదేరారు.

నెమ్మదిగా లేచి వాళ్లని గుమ్మం వరకూ సాగనంపి లోపలికొచ్చాను. ఈయన పనే బాగుంది ఎవరు వచ్చినా, వెళ్లినా, ఒకసారి హలో చెప్పి లోపలికొచ్చి కూర్చుంటారు. టైమ్ ప్రకారం భోజనం, టి.వి. చూడటం, కాసేపు సాయంత్రం కాలనీలో వాళ్లతో కలిసి వాకింగ్, రాత్రి మళ్లీ చపాతీ తినడం, నిద్రకు ఉపక్రమించడం.

కానీ నేనలా వుండలేనే! కోడలు వంట చేస్తుంటే, కనీసం కూరలన్నా తరిగి ఇవ్వకపోతే, కొడుకేమన్నా అనుకుంటాడేమో అన్నట్టు, కాళ్లూ చేతులూ నొప్పి పెడుతున్నా, పనిలో దూరడం, అలసట. ఏమిటో ఆడవాళ్లకేనా ఇలాంటివి" అనిపించింది. వాళ్ళేమనుకుంటారో, వీళ్ళేమనుకుంటారో అనుకుంటూ ఎవరినీ నొప్పించలేక, ఒప్పించలేక సతమతమవడం.

ఇంతలో "సినిమా చూస్తున్న మా వారు గట్టిగా జయా! ఇటురా! టి.వి.లో ఈ ప్రకటన చూడు. నీకు పనికి వస్తుందేమో! ఆ నూనె రాసుకుంటే కీళ్ల నెప్పులు మటుమాయం అంటున్నారు" అంటూ పిలిచారు.

నిజానికి అది నేను రోజూ చూస్తున్న ప్రకటనే! కానీ అంత పట్టించుకోలేదు. కానీ ఇవాళ, నాకు వచ్చిన ఈ కీళ్ల బాధతో, ఏ పుట్టలో ఏ మందు వుందో అన్నట్టు

ఆసక్తిగా చూశాను.

"ఆ మందులూ, మాకులూ లేకుండా, ఈ నూనె రాసుకో! కొన్ని రోజులు రాసుకో. తగ్గకపోతే అప్పుడు చూద్దాం, అబ్బాయితో చెప్పి ఆన్‌లైన్ ఆర్డర్ చేయిద్దాం" అంటూ నా బదులు తనే ఒక డెసిషన్‌కి వచ్చేశారు.

"ఇంకా ఆ ప్రకటనలో, ఆ నూనె రాసుకోగానే అంతకు ముందు ఇంట్లో కూడా నడవలేని వాడు, చకచకా మేడ మెట్లు ఎక్కుతున్నట్టు చూపించారు".

"అమ్మా! నాన్న చెప్పింది కూడా బానే వుంది. మీరిద్దరూ సరే అంటే ఇవాళే ఆర్డర్ చేస్తాను" అన్నాడు రవి.

కాసేపటికి వైజాగ్ నుండి అమ్మాయి రమ్య ఫోన్ చేసింది. అమ్మా డాక్టర్ దగ్గరకి వెళ్లావా! ఏమన్నారు. ఏమిటి నీ ప్రాబ్లం అని చెప్పారు?

"అమ్మాయి ఫోన్ చేసేసరికి, కడుపులోని బాధంతా ఒక్కసారి బయటికి వచ్చింది. ఫోన్ తీసుకుని గదిలోకి వెళ్లి పొద్దుటి నుండి జరిగిందంతా వెళ్లబోసుకున్నాను. ఏమిటో ఏ మందు తీసుకోవాలో అర్థం కావడం లేదు" అన్నాను.

బాధపడక అమ్మా. నిజానికి నీకు ఆ ఇంగ్లీషు మందులకి, నిజంగానే గ్యాస్ చేరి ప్రాబ్లమ్ అవుతుంది. ఆయుర్వేదం మందులు వేడి చేస్తాయి. మళ్లీ మజ్జిగలు, అవీ తాగుతూ వుండాలి.

నీ శరీరతత్వం నాకు బాగా తెలుసు. ఏమీ హాని చెయ్యకుండా కొంచం నెమ్మదిగా పని చేసినా, హోమియోపతి మందులు బాగా పని చేస్తాయి.

మా పినత్తగారికి ఇదే ప్రాబ్లం. ఆవిడ ఈ మందులన్నీ వాడి, వాటితో సైడ్ ఎఫెక్ట్స్ వచ్చి, ఇప్పుడు ఒక ఆరు నెలలుగా హోమియోపతి తీసుకుంటున్నారు.

నిన్ననే మా అత్తగారు మాట్లాడుతుంటే విన్నా, ఇప్పుడు కొంచం నయంగా వుందిట ఆవిడకి.

నువ్వూ నాన్న ఇక్కడికి వస్తే, ఆ డాక్టరుకి చూపించి, మందులు వాడదాం. కొంతకాలం నా దగ్గర వుండి, తగ్గిన తరువాత వెళ్దువుగానీ, ఎప్పుడూ నువ్వు మాకు చేసిపెట్టడమే కానీ, నీకు చేసి పెట్టే అవకాశం ఇవ్వమ్మా అంటూ ప్రేమగా చెప్పేసరికి,

మనసులో వున్న బాధంతా తీసిపారేసినట్టు హాయిగా అనిపించింది. “అలాగేలే! మీ నాన్నతో మాట్లాడి చెప్తా!” అన్నాను.

సాయంకాలం “వాకింగ్”కి బయలుదేరుతూ మా వారు, జయా! డాక్టర నిన్ను వాకింగ్ చెయ్యామన్నారు కదా! నువ్వు కూడా బయలుదేరు పార్కులో వాకింగ్ చేద్దాం. మా ఫ్రెండ్స్ అందరూ వాళ్ల భార్యలతో సహా వస్తారు రోజూ. నిన్ను రమ్మంటే నాకు పని వుందంటూ తప్పించకుంటున్నావు. ఇప్పుడు డాక్టరు తప్పనిసరిగా నడవాలని చెప్పారు కదా! బయలుదేరు” అంటూ చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని కూర్చున్నారు. ఇక తప్పదురా బాబూ అనుకుంటూ బయలుదేరాను.

పార్కులోకెళ్లిన తరువాత కొంచం హాయిగానే అనిపించింది. ఒకరినొకరు పలకరించుకుంటూ, కష్టసుఖాలు పంచుకుంటూ నెమ్మదిగా నడక సాగించాము. రెండు రౌండ్స్ అయ్యేసరికి, కొంచం అలసట అనిపించి అక్కడ వున్న బెంచీ మీద కూర్చున్నాను. ఇంకో రౌండ్ అయిన తరువాత మా పక్కింటి పంకజం గారు వచ్చి కూర్చున్నారు.

మాటల్లో నా కీళ్ల నెప్పుల గురించి ప్రస్తావన వచ్చింది. “ఇలా అందరూ తలా ఒక రకం చెబుతున్నారు. మా అమ్మాయి రమ్మంటోంది. హోమియో మందు తీసుకోమంటోంది” అన్నాను.

అవునా!

నాకు కూడా కీళ్ల నెప్పులూ, వాపులూ వున్నాయండీ. పొద్దున్న లేవడానికి చాలా కష్టంగా వుండేది – వేళ్లు కాళ్లు ముడవడానికి వచ్చేవి కావు. పొద్దున్నే లేచి యోగా, ధ్యానం చేయడం, ఉదయం, సాయంత్రం నడక వల్ల చాలా మటుకు తగ్గింది.

మీరు ఏ మందులూ మాకులూ తీసుకోకండి. హాయిగా ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించడం. ధ్యానం, ప్రాణాయామం వల్ల అన్ని నెప్పులూ తగ్గిపోతాయి. నా మాట వినండి అంటూ సలహా ఇచ్చింది. ఏ మందులూ మాకులూ అక్కరలేదని చెప్పేసరికి చాలా సంతోషం వేసింది. మరి యోగా, ధ్యానం, ప్రాణాయామం ఎవరు నేర్పిస్తారు? అని అడిగా.

దానికి ఆవిడ “శ్వాస మీద ధ్యాస” అంటూ పత్రీజీగారు టి.వి.లో నేర్పిస్తారు. ఫలానా ఛానల్ పెట్టుకుని చూడండి అని చెప్పింది ఆవిడ.

“వస్తూ వస్తూ మా వారితో ఈ విషయం చెప్పాను. అవును అది కూడా మంచిదే! కాకపోతే ఈ నూనె రాసుకుంటూ, ఇవి కూడ చేస్తే, తొందరగా రిలీఫ్ వుంటుంది” అన్నారు.

ఇంటికి వచ్చి అబ్బాయి రవితో చెబితే, అవునమ్మా, శ్రీశ్రీగారి “ఆర్ట్ ఆఫ్ లివింగ్” ధ్యానం వల్ల కూడా చాలా ఉపయోగం వుందిట. మా ఫ్రెండ్ వాళ్ల అమ్మగారు దానిలో మెంబర్. దీనివల్ల చాలా రకాల జబ్బులు తగ్గుతాయట. అది కూడా ఆలోచించొచ్చు అన్నాడు.

మర్నాడు పొద్దున్న మా వారి పెదనాన్న కొడుకు వచ్చాడు. ఆయన దగ్గర కూడా నా కీళ్ల నెప్పుల విషయం ప్రస్తావన కొచ్చింది. ఇలా మెడిటేషన్‌తో తగ్గించుకోవచ్చు అన్నారు అని చెప్పాము.

వెంటనే ఆయన అవును. ధ్యానంతో ఎన్నో జబ్బులు తగ్గించుకోవచ్చు. సద్గురు జగ్గివాసుదేవ్‌గారి “ఈషా ధ్యాన ప్రక్రియ” చాలా మంచిది. మన ఆలోచనలు ఎటు పోతున్నా, ‘నేను ఈ మనసునీ కాదు, ఈ శరీరము కాదు’ అంటూ మంద్రస్థాయిలో ఆయన గొంతు వినపడతూ, చివరకు వేణుగానంతో ముగుస్తుంది. జస్ట్ 12 నిముషాలు – ధ్యానంలో కూర్చుంటే, శరీరం చాలా తేలికగా అనిపిస్తుంది. చాలా హాయిగా వుంటుంది అని సలహా ఇచ్చారు.

అందరి సలహాలు వినేసరికి నాకు ఎవరిని అనుసరించాలో, ఏమిటో అని అయోమయంగా నీరసంగా అనిపించింది.

ఎవరిది కరెక్ట్. ఏమీ పాలుపోక ఆలోచిస్తూ కూర్చుంటే కోడలు వచ్చి “ఏమిటీ అత్తయ్య గారు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నారు”.

ఏమి చెప్పమంటావు శిరీషా! ఇంగ్లీషు మందులంటాడు డాక్టరు. ఆయుర్వేదం బాగా పని చేస్తుంది అంటుంది మీ అమ్మ. హోమియోపతి అంటుంది రమ్య. మీ మావయ్యగారేమో అదేదో నూనెకి ఆర్డరు ఇస్తాను అంటారు.

ఇకపోతే ఈ మందులేవీ వద్దు ధ్యానంతో తగ్గుతుంది అంటారు. పోనీ అదైనా ఒకళ్లు ప్రతీజీగారి శ్వాస మీద ధ్యాస. ధ్యాన ప్రక్రియ అనీ, శ్రీశ్రీ “ఆర్ట్ ఆఫ్ లివింగ్” అని నా కొడుకు, కాదు సద్గురుగారి “ఈషా ధ్యానప్రక్రియ అని మీ మామయ్య పెదనాన్న

కొడుకూ. ఇలా అందరూ తలా ఒక సలహా ఇస్తున్నారు. కానీ నేను ఆలోచించుకునే అవకాశం ఇవ్వకుండా, వాళ్లే డెసిషన్ తీసేసుకుంటున్నారు.

ఇంకొకళ్లు వచ్చి యునాని మందులు అని చెబుతారేమో!

ఏమి చెయ్యాలో పాలుపోక, ఆలోచిస్తూ ఇలా కూర్చున్నాను.

అత్తయ్యా అందరూ ఇచ్చిన సలహాలు కంటే, మీ శరీరానికి ఏది సరిపోతుందనేది మీకు మాత్రమే తెలుస్తుంది. ఈ గందరగోళంలో మీకు ఇంకా ఎక్కువయేటట్టు వున్నాయి మీ కీళ్ల వాపులు. అసలు మీకు రొటీన్ నుంచి ఒక బ్రేక్ కావాలి. మీరు ముందు ప్రశాంతంగా వుంటే సగం జబ్బు తగ్గిపోతుంది.

"ఎవరింట్లోనూ కాకుండా హాయిగా నేచర్ క్యూర్ హాస్పిటల్ అదే ప్రకృతి వైద్యశాలలో చేరండి. అక్కడ ఆహార నియమాలతోపాటు, శారీరక బరువు కూడా తగ్గిస్తారు. ఆ రకంగా మోకాళ్లు నెప్పులు తగ్గుతాయి. పచ్చని చెట్ల మధ్య మీకు ఆహ్లాదంగా, మనోల్లాసం కలుగుతుంది. ఎక్కడా తగ్గని జబ్బులకి పరిష్కారం ప్రకృతిలోనే వుంది. ఒక్క నెల రోజులు అన్నీ మర్చిపోయి అక్కడ రిలాక్స్ అవండి. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆరోగ్యంగా తిరిగి వస్తారు" అంటూ అన్యాపదేశంగా తనదైన కొత్త చికిత్సా విధానం చెప్పింది.

హా మళ్లీ మొదటి కొచ్చింది విషయం. బేతాళుడు మళ్ళీ చెట్టెక్కాడు అన్నట్టు మళ్ళీ మొదటికొచ్చింది విషయం. నా ఒక్క రోగానికి ఇన్ని రకాల చికిత్సలా? ఏది ఏమైనా ఫైనల్ జడ్జిమెంట్ దేవుడిదే కదా! హతవిధీ – చూపు మా దారి అంటూ పరాత్పరుడిని అర్థించా!

# 13

# పెద్ద గీతా - చిన్న గీతా

"అమ్మా! మా మనవరాలి పెళ్లి కుదిరింది" పనికి వస్తూనే సంబరంగా అంది పనిమనిషి లక్ష్మి.

"ఆహా! అబ్బాయి ఏం చేస్తాడు?" అని అడిగాను.

"డ్రైవర్‌గా చేస్తున్నాడు. చెడ్డ అలవాట్లేమీ లేవు" వూళ్ళో పొలం కూడా వుంది. ఒక చెల్లి వుంది. పెళ్లి అయిపోయింది. బాదర బందీ ఏమీ లేదు. "మంచి సంబంధం అమ్మా!" గడ గడా చెప్పింది.

అది సంతోషంగా చెప్పుకుంటూ పోతుంటే, నా మనసు మాత్రం "అమ్మో! ఇప్పుడు పెళ్లి పేరు చెప్పుకుని ఎన్ని రోజులు డుమ్మా కొడుతుందో! లక్ష్మి ఇల్లు వూడ్చి, బట్టలుతికి, గిన్నెలు తోముతుంటేనే పిల్లలకి టిఫెన్ను బాక్సులు సర్ది స్కూల్‌కి పంపించి, శ్రీవారికి నాకూ బాక్సులు సర్దుకుని ఆఫీస్కి వెళ్ళే సరికి నా తల ప్రాణం తోకకి వస్తుంది. ఇప్పుడు ఎన్ని రోజులు రానంటుందో ఏమో ! అనుకుంటూ మనసులో లెక్కలు వేసుకుంటున్నాను. పైకి మాత్రం "చాలా సంతోషం లక్ష్మీ ! మీ మనవరాలు చాలా అదృష్టవంతురాలు సుమీ!" అన్నాను.

చాలా సంతోషపడింది లక్ష్మి. ఇంకా ఏదో చెప్పాలనే ఆతృత దాని మొహంలో కనబడింది. అది చెప్పేది నాకు సంతోషం కలిగించేది కాదని నాకు తెలుసు. అందుకే ఇప్పటి నుంచే తొందరపడి దాన్ని చిన్నబుచ్చడం ఎందుకని కొంచెం సంయమనం పాటిస్తూ "సరే తర్వాత మాట్లాడుకుందాం !" గిన్నెలు కడిగి ఇవ్వు . వంట మొదలు పెట్టాలి. పిల్లల స్కూల్‌కి ఆలస్యం అవుతుంది. స్కూల్ ఆటో వాడు వచ్చి మళ్లీ హారన్ కొడతాడు ఆలస్యం అయితే 'అంటూ మాట మార్చాను. అసంతృప్తిగానే పనిలోకి చొరబడింది లక్ష్మి .

మర్నాడు వస్తూనే అమ్మా! ఆషాడం అవగానే ముహూర్తాలు పెట్టుకుంటారుట. మనవరాలికి 10 తులాల బంగారం, అబ్బాయికి లక్ష రూపాయలు లాంఛనాలు, స్కూటర్, ఉంగరం, మంచాలు, వంట సామాన్లు ఇవ్వాలట." అంటూ కబుర్లు మొదలు పెట్టింది.

"అమ్మో మా ఇళ్ళల్లో కంటే మీ లోనే ఎక్కువ కట్నకానుకలు ఉన్నాయే" అన్నాను.

"అవునమ్మా ! ఇంకా డ్రైవర్ ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టే ఇంతలో వున్నారు. అదే ఏదైనా నౌకరీలో ఉంటే, ఇంక లాంఛనాలు శానా వుంటాయి" దీర్ఘాలు తీస్తూ చెప్పింది.

ఆషాడ మాసం తర్వాత అంటోంది కదా ఒక నెలరోజుల వరకూ నేను నిశ్చింతగా ఉండొచ్చు అనుకున్నాను. రోజూ పనికి వస్తూనే, ఏవో ఒక కబుర్లు మోసుకొస్తోంది. అమ్మా! నా కోడలు గడసరితనం చూశావా ? ఒక్క రోజు కూడా పట్టెడు అన్నం పెట్టలేదు కానీ, ఇప్పుడు అత్తా! మనవరాలికి ఏం పెడతావ్ అంటూ నిలదీస్తోంది.

"మా కాడ ఏమున్నాయి ? రెక్కల కష్టం తప్ప" అన్నాను.

"కష్టం చేసిన డబ్బులన్నీ కూడబెట్టారు కదా ! ఇద్దరికీ వయసుడిగిపోయే ! మనవరాలికి ముద్దుగా ఇంత బంగారం పెట్టకుండా ఏం చేసుకుందామని ? మీ కేమన్నా అవసరపడితే మేము చూసుకోమా? కొడుకులకు ఏమన్నా కలెక్టరీ చదువులు చెప్పించారా? పదో క్లాసుతో ఆపేసి మీ కాడ పనికి సాయం పెట్టుకున్నారు. నా మొగడు నీతో తిరిగి సంపాదించిందంతా ఏమైంది ? మీ రెక్కల కష్టంలో మా ఆయన కష్టం కూడా ఉంది. అదంతా లెక్కగట్టి ఇయ్యండి అంటూ చానా మాటలు అన్నది అమ్మా" వాడి చిన్నప్పుడు కానరాని జబ్బు చేస్తే దవాఖానాల చుట్టూ తిరిగి డబ్బులు పోసి, అప్పులు చేసి బతికించుకున్నాము ! ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఒక్క కొడుకు గానీ, కోడలు కానీ ఇంత బువ్వ తిని పొమ్మని ఏనాడూ పిలవలేదు.

మా ఆయన వాచ్ మెన్ డ్యూటీ చేస్తుంటే, నేను ఇళ్ళ కాడ పని చేసుకుంటూ, పనిచేసే ఇళ్ళల్లో పెద్ద సార్లను పట్టుకుని, ముగ్గురికి ఏదో చిన్న నౌకరీలు ఇప్పించి, లగ్గాలు చేశాము. మా ఆయనకు అదేదో దోమలు కుట్టి వస్తది చూడు గదే డెంగ్యు జ్వరం వస్తే దవాఖానలో మస్తు పైసలు అయినాయి. ఒక్క కొడుకు కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదు. నీ అసుంటోల్ల దగ్గర అడిగి తీసుకున్నాను అంటూ చెప్పుకుపోతూనే ఉంది. దాని గోడు వినీ వినీ మావారు "నేను ఆఫీసుకి వెళ్ళిన తర్వాత చెప్పుకోండి మీ కబుర్లు

తీరుబడిగా. పొద్దున్నే ఈ సోదంతా వింటూ ఉంటే పిల్లలకి, నాకు టైమ్ అయిపోవడం లేదూ" అంటూ గదమాయించారు.

తర్వాత రోజు నుంచి ఎక్కువ కబుర్లు చెప్పడం లేదు కానీ, ఇంట్లో పనులు కల్పించుకుని మరీ చాలా శ్రద్ధగా చేయడం మొదలు పెట్టింది. సోఫాలు డైనింగ్ టేబులు శుభ్రంగా బట్ట పెట్టి తుడవడం, పిల్లలు చిందరవందరగా పడేసి వెళ్ళిన వస్తువులన్నీ సర్దడం, బట్టలు ఇస్త్రీ చేసినట్టుగా మడత పెట్టడం, కడిగిన గిన్నెలన్నీ సర్ది పెట్టడం, వగైరా పనులన్నీ ఇష్టంగా, నవ్వుతూ, నా దృష్టిలో పడే లాగా చేయడం మొదలు పెట్టింది.

అన్నీ గమనిస్తూ, సరేలే ! ఒక వారం, పది రోజులు సెలవు తీసుకోడానికి ముందరి కాళ్ళకి బంధం వేస్తోంది. నాకు ఇంటెడు చాకిరీ తప్పదు అనుకున్నా.

మామూలుగా అయితే పొద్దున్నే లక్ష్మి పనికి రాగానే ఏంటి లక్ష్మీ విశేషాలు అంటూ పలకరించే దాన్ని. ఇప్పుడు అలా పలకరిస్తే నిరంతరంగా చెప్పే పెళ్లి కబుర్లకి అంతం ఉండదు అనుకుని ఊరుకుంటున్నా!

వారం రోజుల తర్వాత పని ముగించి వెళ్లబోతూ ఆగి "అమ్మా" అని పిలిచింది. "ఏమిటి లక్ష్మీ! "అన్నాను.

"నాకు ఒక 20 వేలు డబ్బులు సర్దమ్మా! నెల నెలా కొంచెం జీతంలో పట్టుకో. మనవరాలి పెళ్లి కదా ! కొంచం డబ్బులు అవసరం" అంది. పది రోజులూ, పనికిరానని చెపుతుందేమో అనుకున్న నాకు, పని డుమ్మాతో బాటు బోనస్‌గా రూ. 20,000/- అడిగేసరికి వెంటనే ఏమని చెప్పాలో తోచలేదు. కొంచెం కోపం కూడా వచ్చింది. అడపా దడపా ఏదో ఖర్చు వుందని చెబుతూ.

"ఏంటి లక్ష్మీ ! మీ ఆయన వాచ్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వుండటానికి ఇల్లు, నీళ్ళు కరెంటు అన్నీ ఉచితంగానే కదా ! పైగా మీ ఆయన, నీ సంపాదనతో చిట్టీలు కడుతున్నాడు. పెళ్లి ఖర్చులు తను చూసుకుంటాడు. నీకెందుకు మళ్లీ డబ్బుల సర్దుబాటు ? అయినా నెల నెలా జీతంలో కట్టుకోమంటున్నావు కదా ! మళ్లీ చిట్టీ డబ్బులు కట్టకపోతే వాళ్ళు ఊరుకుంటారా ? నాలుగు ఇళ్లల్లో పని చేసుకుని, వచ్చిన డబ్బంతా మొగుడిచేతిలో పెడుతున్నావ్ కదా ! ఇంకా నిన్ను వాళ్లనీ వీళ్లనీ అడిగి డబ్బు తెమ్మంటున్నాడా ?" అని కొంచెం గట్టిగా అన్నాను.

“నా మొగుడు నన్నేమీ అడగలేదమ్మా! నా చెవి కమ్మలు, పట్టా గొలుసులు తాకట్టు నుంచి విడిపించుకుందామని. అవన్నా లేకపోతే పెళ్లికి బాగోదు అని అడిగాను . మనవరాలికి పెళ్లి పట్టు చీర నాయనమ్మే తియ్యాలి మా కులంలో.” అంటూ మెత్తటి మాటల్తో ఘాటుగా సమాధానం ఇచ్చింది.

“మీ ఆయన్ని ఒక్క మాట అననివ్వవు. ప్రతి నెలా ఏదో ఖర్చు చూపించి ముందే నీ జీతంలో సగం తీసుకుంటున్నావు. ఇప్పటికీ ఇంకా రూ. 10,000 బాకీ ఉన్నావు మళ్లీ ఇరవై వేలా?

అయినా చూస్తున్నావు కదా లక్ష్మీ ! “ఇంట్లో పిల్లల ఫీజులు, పుస్తకాలు, స్కూళ్లు తెరిచారు కదా! స్కూల్ ఆటోకి, స్కూల్ బట్టలు, ఇలా చాలా ఖర్చులు ఉన్నాయి. మా అత్తగారికి ఆపరేషన్ ఉంది. దాని కోసం ఇక్కడికి వస్తున్నారు. పిల్లల ఖర్చులు, ఆపరేషన్ ఖర్చు తడిసి మోపెడు అవుతాయి. మాకు మటుకు ఊరికే వస్తున్నాయా డబ్బులు, అసలు మా ఇంట్లో తిప్పితిప్పి కొడితే అరగంట పని. అసలు నేనే చేసుకోవచ్చు కానీ పిల్లల స్కూల్ బాక్సులు సర్దటాలు , అదే టైంకి మంచినీళ్లు పట్టుకోవడం, అయ్యగారికి టిఫిన్ అన్నీ ఒకేసారి పొద్దున్నే చేసుకోలేక నిన్ను పెట్టుకున్నాను. అడపా దడపా డుమ్మాలు కొడుతూనే ఉంటారు. సరేలే ! నీ పరిస్థితులు నీవి అని సర్ది చెప్పుకుంటున్నాను” అంటూ నా మనసులో ఎప్పటినుంచో దానిమీద ఉన్న అక్కసు అంతా వెళ్ళగక్కాను.

అన్నీ విన్న లక్ష్మి ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఏమిటబ్బా ఇది ! ఇలా మాట్లాడకుండా వెళ్ళిపోయింది కొంపదీసి రేపటి నుంచి పని మానేస్తుందా ఏమిటి అనుకుంటూ భయం మొదలైంది నాలో.

ఏమిటో పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో! మనశ్శాంతిపోయింది అనుకున్నా.

అత్తగారూ మావగారు వూరు నుంచి వస్తున్నారు. పైగా ఆవిడకి ఆపరేషన్ కూడా వుంది. ఇప్పుడిది పని మానేస్తే ఎలా? తొందర పడ్డానా! మనసు తొలిచేస్తోంది.

అయినా నేను మటుకు ఏమన్నాను? అసలే ఈ నెల ఖర్చు లెక్కువగా వున్నాయి. పిల్లల ఫీజులు, పుస్తకాలు, స్కూల్ ఆటో వగైరా వగైరా. ఇవి కాకుండా పిల్లల “ఏక రూప దుస్తులు” వారి బడిలోనే కొనుక్కోవాలి. తల్లి దండ్రులు ఎంత మొత్తుకున్నా, స్కూల్ యాజమాన్యాలు వినిపించు కుంటేనా?

ముందు మనం తిన్నా తినకపోయినా ఈ ఖర్చులు తప్పవు.

దీనికి తోడు అత్తగారి ఆపరేషన్. పెద్ద వాళ్ళయ్యారు ఇక్కడికే వచ్చి వుండండి అంటే మాకు మా వూర్లోనే హాయిగా వుంటుంది అంటూ రానేరారు. ఇప్పుడు ఈ సందర్భంగా వస్తున్నారు. చూడవలసిన బాధ్యత మాదే కదా!

ఆఫీస్‌లో ఈయన స్నేహితుడు ప్రసాద్ వున్నారు. ఆయన దగ్గర కొంచం డబ్బు సర్దుబాటు చేయమని అడగమన్నాను. ఏమను కుంటాడో ఏమో! ఏ అవసరం వచ్చినా అతనే ఆదుకుంటాడు. ఈ సారి కొంచం పెద్ద మొత్తమే కావాలి. ఏమవుతుందో ఏమో!

ఇంతలో శ్రీవారి దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. ఏం చెబుతారో అని ఆత్రుతగా తీసాను.

"సుధా" ప్రసాద్ డబ్బు సర్దుబాటు చేస్తానన్నాడు... చాలా రిలీఫ్‌గా వుంది."

"చాలా సంతోషంగా వుంది. అంతా ఆ దేవుడి దయ అంటూ పూజా మందిరం వైపు తిరిగి దండం పెట్టుకున్నాను.

"సాయం చేసింది నా స్నేహితుడు అయితే, నీ దేవుడి దయ అంటావేమిటి ?" అన్నారు .

"అదేలెండి. దేవుడిని ప్రార్థిస్తే, మీ ప్రసాద్ ద్వారా ఇప్పిస్తున్నాడు. చిన్న చిన్న పనులకి ఆయన ప్రత్యక్ష మవ్వాలా ఏమిటి ?" అన్నాను నవ్వుతూ.

సరే సరే! మీ దేవుడే ఇప్పించాడనుకుందాం. నాకూ చాలా సంతోషంగా వుంది. వాడిని అడగడానికి చాలా మొహమాట పడ్డాను. కానీ వేరే దారి లేదు కదా!

"పోనీలెండి . మీ మాటకి అంత విలువ ఇచ్చాడు. అదే అసలైన స్నేహానికి అర్థం. ప్రసాద్ గారికి నా తరఫు నుంచి కూడా కృతజ్ఞతలు చెప్పండి"

"సరే ఇక వుంటాను. చాలా పని వుంది ఆఫీసులో" అంటూ ఫోన్ పెట్టేశారు.

సాయం సంధ్యలో దేవుడి దగ్గర దీపారాధన చేసి, దేవుడి పటానికి దండం పెట్టుకుంటుంటే, ఏదో తేడాగా అనిపించింది. "ఎంటబ్బా ! ఇలా వుంది అనుకుంటుంటే, ఒక్కసారి వెన్ను చరిచి నట్టయింది .." నీ అవసరానికి డబ్బు సమకూర్చాను. మరి నీ మీద ఆధార పడిన పనిమనిషి లక్ష్మి సంగతేమిటి?" అని అడుగుతున్నట్టు అనిపించింది.

అవును. లక్ష్మి కూడా అవసరానికి డబ్బు అడిగింది. మా ఇంట్లో పని చేసే మనిషికి నేను కూడా సాయం చేయాలి కదా! మాది పెద్ద అవసరమూ, దానిది చిన్న అవసరమూ. పెద్ద గీతా – చిన్న గీతా అంతే తేడా.

నిజానికి లక్ష్మి ఒళ్ళు దాచుకోకుండా ప్రేమగా పలకరిస్తూ పనిచేస్తుంది . నాకు ఎప్పుడైనా ఒంట్లో బాగాలేక, లేవ లేకపోతే ఏంటమ్మా పడుకున్నావు ? ఎప్పుడూ నిన్ను ఇట్లా చూడలే ! కాఫీ తాగావా ? గోలీ ఏమన్నా వేసుకున్నావా లేదా ? అంటూ వంట గదిలోకి దూరి కాఫీ కలిపి పట్టుకొచ్చి ఇచ్చేది. మందు గోలి ఎక్కడుందో అడిగి తీసుకొచ్చి ఇచ్చేది. మా వారితో "అయ్యా ! అమ్మకి పానం బాలేనట్టు ఉంది. మీరు ఈరోజు ఇంటికాడ వుండి అమ్మని చూసికోండయ్యా! అంటూ ఇంటి పెద్దలా వ్యవహరించేది. ఇంక నాకు బాగా లేకపోతే, పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టాలన్న వుబలాటంతో, మా వారు తనకు రాక రాక వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని "పిల్లలూ మీ పనులు మీరు చేసుకోవడం నేర్చుకొండి. అన్నిటికీ అమ్మా అమ్మా అంటూ అమ్మ వెనకాల పడితే ఎలా చేస్తుంది అంటూ పిల్లల్ని కోపం చేసేవారు.

లక్ష్మి వెనకాలే వచ్చి "అయ్యా ఇప్పుడే కదా పిల్లలకు నువ్వు చేసినా, అమ్మ చేసినా ! తర్వాత వాళ్లు మన చేత చేయించుకుంటారా ? ఈ ముద్దూ ముచ్చట, పేచీలు ఇప్పుడే. తరవాత మన దగ్గర వుంటారా వాళ్ళు. అడ్డాల నాడు బిడ్డలు, కానీ గడ్డాల నాడు బిడ్డలు కారు అంటారు కందా ! ఇప్పుడే వాళ్ళ ముద్దు మురిపం మనకి అంటూ పిల్లల్ని వెనకేసుకొచ్చి మాట్లాడేది. ఇంట్లో మనిషిలాగ కలివిడిగా మాట్లాడుతూ వుంటుంది. ఇవన్నీ గుర్తుకొచ్చి మననం చేసుకున్నా, డబ్బు సర్దుబాటు విషయమే ఆలోచనలో పడ్డా. సరే! మా చేబదులు డబ్బులోనే, దానికి కూడా కొంత సర్దుబాటు చేద్దామనిపించింది.

ఈ మధ్య లక్ష్మి పనిలోకి రాగానే అదేం అడుగుతుందో అన్నట్టుగా తప్పించుకునే పనిలో పడిపోయాను . ఇవాళ లక్ష్మి రాగానే నేనే పలకరించి "ఎప్పుడు పెట్టుకుంటున్నారు లక్ష్మీ ముహూర్తాలు" అంటూ అడిగాను. దాని మొహం మతాబులా వెలిగిపోయింది .

"అమ్మా! ముందు డబ్బు కావాలి కదా! పెళ్లి పెట్టుకుని చేతిలో పైసలు లేకపోతే కష్టం కదమ్మా! అందుకు అందరం తలా కొంచెం వేసుకొని, డబ్బులు జమ అయినాంకా పెట్టుకుంటాము" అంది.

సరేలే లక్ష్మి !. మాకు కొంచెం ఖర్చులు బాగానే ఉన్నాయి. మరి మీకూ డబ్బులు

అవసరం అంటున్నావ్. అందుకే మరి నువ్వు అడిగినంత ఇవ్వలేని కానీ , కొంతైనా సర్దుబాటు చేస్తాను" అని అన్నాను .

"నాకు తెలుసమ్మా ! మీరు నా మాట తీసేయరనీ ! మీరే ఆలోచించి ఇస్తారులే! అని ఊరుకున్నా. మా అమ్మ మనసు ఎన్నపూస లాంటిదని నాకు తెలియదా ? అంటూ ముసి ముసి నవ్వులు నవ్వింది.

పొద్దుటి నుంచీ చికాకుగా ఉన్న నా మనసు దూది పింజంలా తేలికగా గాలిలో ఎగురుతున్నట్టు అనిపించింది.

# 14

# ఎదురు చూపులు

"అమ్మలూ! నువ్విలా నీ సంసారం, భర్త, పిల్లల్ని చూసుకుంటూ కూర్చుంటే ఎలా? కాస్త ప్రణీత్ సంగతి కూడా చూడు. వాడికీ ఓ అమ్మాయిని చూసి ఆ మూడు ముళ్ళు వేయిస్తే నేను, మీ నాన్న కాస్త ఆధ్యాత్మిక చింతనలో పడతాం" అంటూ అమెరికాలో వున్న మా అమ్మాయి వసంతకి ఒక చురక అంటిస్తూ "వాట్స్ అప్"లో సందేశం పంపించా.

మా అమ్మాయి వసంత, అబ్బాయి ప్రణీత్ ఇద్దరూ కూడా హైదరాబాద్‌లో ఇంజనీరింగు చేసి, అమెరికాలో ఎమ్.ఎస్. చదివి అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. వసంత ఉద్యోగంలో చేరగానే దాని వెంటపడి, అక్కడే చదువుకుని, ఉద్యోగం చేస్తున్న కార్తీక్‌తో పెళ్లి జరిపించాము. ఇద్దరు పిల్లలు దానికి. పిల్లలు పుట్టినప్పుడు ఒక ఆరు నెలలు నేను, ఒక ఆరు నెలలు వాళ్ల అత్తగారు పిల్లలకి సంవత్సరం వచ్చే వరకు వుండి వచ్చాము. ఇప్పుడు పిల్లలకి ఒక నానీని ఏర్పాటు చేసుకొని ఇద్దరూ ఉద్యోగాలకి వెళ్ళి వస్తున్నారు.

"ఏం అమెరికానో ఏమో! ఇక్కడ హైదరాబాద్‌లో ఉద్యోగాలు లేవా ఏంటి? మనవళ్ల ముద్దు మురిపాలు చూసుకోవాలంటే 'స్కైప్'లో చూడాల్సిందే! వాళ్ళకి ఏ జ్వరాలో, దగ్గులో వచ్చినప్పుడు, అయ్యో దగ్గరుంటే వాళ్ల సంగతి చూసే వాళ్ళం కదా! అనిపిస్తుంది. మీకు ఇక్కడ అన్ని వసతులూ ఏర్పాటు చేస్తాం ఇక్కడే వుండండి అంటారు పిల్లలు. కానీ అమెరికాలో ఎన్ని వసతులున్నా, ఎక్కువ రోజులు వుండలేము. ఇక్కడవున్న హాయితనం వుండదు. మాట్లాడదామంటే మనుషులే కనబడరు." అంటూ వసంత అత్తగారు నాకు ఫోన్ చేసి వాపోతూ వుంటుంది.

"నిజమే! నాకు కూడా అక్కడ వున్నన్ని రోజులూ ఉగ్గబట్టుకుని వుండటమే! ఎప్పుడెప్పుడు ఇండియా వచ్చేద్దామా?" అనిపిస్తుంది.

మా అమ్మాయి దగ్గర నుంచి వచ్చిన ఫోను నన్ను ప్రస్తుతంలోకి లాక్కువచ్చింది.

"అమ్మా నీ మెసేజ్ చూశాను. నన్ను బ్లేమ్ చేయకు. నేను మటకు ఏం చేయను?

మీరేమో "తెలుగు మాట్రిమోని"లో చూసి సంబంధాలు పంపుతారు. వాడికి చూపించి నచ్చచెప్పమని. వాడికి ఏ అమ్మాయి ఫోటో చూపించినా "నాకు అమ్మాయి అందచందాలతో పనిలేదు. చూడగానే నాకు చేసుకోవాలని అనిపించాలి. నా మనస్తత్వానికి సరిపోయే అమ్మాయి కావాలి" ఇలా మాట్రిమోనిలో నా ఫోటో పెట్టి నన్ను అమ్మకానికి పెట్టడమేమిటి" అంటూ గయ్‌మంటున్నాడు. మీ అల్లుడు చేత కూడా చెప్పించా, వాడి మాట వాడిదే!! ఏం చెయ్యను. నువ్వేమో నేనేదో పట్టించుకొనట్లేదంటావు" అమ్మాయి వసంత తనగోడు వెళ్లబోసుకుంది.

ఒకప్పుడు అమ్మాయికి సంబంధం కుదరాలంటే చెప్పులజత అరిగిపోతుందంటూ వాపోయేవాళ్లు. నిజానికి అదే నయం. అమ్మాయికి కావలసిన వరుడి కోసం పదిచోట్లకి తిరిగి, అబ్బాయి మంచి చెడులు, వాళ్ళ స్థితిగతులు తెలుసుకోవచ్చు. కానీ అబ్బాయి పెళ్ళి కోసం, అమ్మాయిల ఇళ్ళకెళ్లడం రివాజు కాదు. మన దగ్గర కొచ్చిన సంబంధాలలోనే ఎంచుకోవాలి. అందుకే వాడి అభిరుచికి అనుగుణంగా ఉండే అమ్మాయి, జాతకరీత్యా కూడా ఇద్దరికీ అనుకూలంగా ఉండే సంబంధాల వివరాలు నా ఇమెయిల్‌కి వచ్చే విధంగా, నా మొబైల్ నంబరు ఇచ్చాను. నేను, మావారూ రోజూ కళ్లు కాయలు కాచేలా ఆ ఫోటోలు, వయసు, వివరాలు చూసి రెండో మూడో సెలెక్ట్ చేసి మా అమ్మాయికి పంపడం, దాన్లో మళ్లీ ప్రణీత్‌కి నచ్చేవిధంగా వున్న వాటి గురించి వాడితో మాట్లాడి, ఫోటో చూపించేది. డైరెక్ట్‌గా వాడికే పంపితే, నన్ను అమ్మకానికి పెట్టావా అంటూ పోట్లాట అందుకే మా అమ్మాయిని మీడియేటర్‌గా పెట్టాను. అయినా కూడా నా మీద దాడి చేస్తాడు. చెల్లెలు వసంతతో మాత్రం అలాగేలే అమ్మతో మాట్లాడతాను అంటాడు. నాకు మాత్రం ఫోన్ చేసి "చూడమ్మా! నీ కెన్నో సార్లు చెప్పాను. నువ్వు పంపించే అమ్మాయిలు నా మనస్తత్వానికి సరిపోరు. పెళ్లయింది మొదలు, సినిమాలు చూపించు, పిజ్జాలు తినిపించు" అంటూ సినిమాల్లో చూపించే లవ్ సీన్లన్నీ మనసుకెక్కించుకుని, అలా నన్నుండమంటే నా వల్ల కాదు.

నాకు జీవితంలో ఏదో సాధించాలనే తపన. ఇండియాలో ముఖ్యంగా గ్రామాల్లో అతి పేదరికాన్ని అనుభవిస్తున్న వారికి, నా వంతుగా కొన్ని సేవా కార్యక్రమాలని అందించాలని వుంది. దానికి సహకరించే అమ్మాయి, తనకంటూ ఒక వ్యక్తిత్వం వుండి లైఫ్‌లో ఒక గోల్ వున్న అమ్మాయి కోసం నా తపన అంతా" అంటూ సుదీర్ఘంగా చెప్పాడు.

మేము చూపించిన అమ్మాయిలతో నువ్వు మాట్లాడితే కదా? వాళ్లకి గోల్ వుందో లేదో తెలిసేది? అలా ఎవ్వరితోనూ మాట్లాడకుండా, ఫోటోలు చూసి నువ్వు "వీళ్ళని

పెళ్లి చేసుకుని, రెండు వూళ్లు తిరిగి నాలుగు సినిమాలు చూసి, ఇద్దరు పిల్లల్ని కనేసి అదే లైఫ్ అనుకునే పిల్లలు వీళ్లు" అంటూ తీసిపారేస్తే ఎలాగా? అని నేను.

"ఇప్పుడు అమ్మాయిలు, పెద్దపెద్ద చదువులు చదువుకుని, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ, పెద్ద జీతాలు తెచ్చుకుంటున్నారు. వాళ్లు కూడా బోల్డు కండీషన్స్ పెడుతున్నారు. వాళ్ల అభిప్రాయాలకి సరిపడే అబ్బాయిల్ని ఎంచుకుంటున్నారు" అంటూ ఆడపిల్లల్ని కించపరుస్తూ వాడు మాట్లాడుతుంటే సహించలేక వెనకేసుకొస్తూ వాడికి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూ, ఆఖరి అస్త్రంగా "అమ్మాయిల సంఖ్య అబ్బాయిలకంటే తక్కువగా వుంది. ఇంకా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే, కొన్ని రోజులకి పెళ్ళి చేసుకుంటానన్నా అమ్మాయిలు దొరకరు. నీకు బట్టతల వచ్చేస్తుందంటూ" భయపెట్టా.

"ఏం ఫరావాలేదు. నా మనస్తత్వానికి సరిపడే అమ్మాయి వచ్చేంత వరకూ ఎదురు చూస్తా. అమెరికాలో బట్టతల వచ్చిన వాళ్లకే తొందరగా పెళ్లిళ్లు కుదురుతాయి. బట్టతల అంటే "మెచ్యూర్‌డ్ మ్యాన్" అని అమ్మాయిలు ఇష్టపడతారు" అంటూ వారిని భయపెడదామనుకున్న ఆయుధాన్ని తిప్పి నాకే కొట్టాడు.

మా వాడి పెళ్లి కాదుగానీ, నాకూ మా వారికీ మధ్య వాగ్యుద్ధాలు. "వాడికి మీ పోలికొచ్చింది మొండితనంలో అంటూ మావారితో నేనూ, "వాడికి సర్దిచెప్పడం చేతకాక నా మీద విరుచుకుపడుతున్నావు" అంటూ మా వారు ఒకరినొకరు దెప్పి పొడుచుకోవడాలు ఎక్కువవుతున్నాయి.

పైగా మగాళ్లకో ఆయుధం వుందిగా "బెదిరింపు", నేను వాడి గురించి ఏం పట్టించుకోను. చేసుకుంటే చేసుకోమను లేకపోతే లేదు. పెళ్లి చేసుకుంటానంటే ఆ టైమ్‌కి వచ్చి నాలుగక్షింతలు వేస్తా. మీ తల్లీ కొడుకులు ఏమైనా చేసుకోండి. అంటూ మా వారి అల్టిమేటం.

సరేలే! నాకు కోడలొచ్చే యోగ్యత వుందో లేదో అని కొన్ని రోజులు మౌనం వహించా, ఏదైనా పెళ్లికో, పేరంటానికో వెళితే "మీ అబ్బాయి పెళ్లికి వున్నాడుట కదా! ఫలానా వాళ్లమ్మాయి ఇంజనీరింగు చదివి, సాఫ్ట్‌వేర్ కంపెనీలో వుద్యోగం చేస్తోంది చక్కని చుక్కలా వుంటుంది" అంటూ అమ్మాయి వివరాలు, ఫోన్ నెంబరుతో సహా ఇచ్చేవారు.

మళ్లీ నాలో ఆశ. వాడికి నచ్చచెబుతే చేసుకుంటాడేమోనని, "ప్రణీత్! అన్నీ కుదరాలనిలేదురా! ఇద్దరి అభిప్రాయాలూ వందశాతం కుదరాలంటే కష్టం. సర్దుకుపోవాలి. నేనూ, మీ నాన్న లేమూ?" అంటూ రెడ్డొచ్చె మొదలాడన్నట్టు వాడికి నచ్చ చెప్పడానికి మరో ప్రయత్నం చేశా!

"మీలాగే వుండకూడదనేగా నేను చెప్పేది. ఆ రోజుల్లో మీ నాన్నగారు జాతకాలు చూసి మీ పెళ్లి చేశారు. అయినా మీ ఇద్దరూ ఏదో విషయానికి గొడవపడుతూనే వుంటారు. సర్దుకుపోతూ జీవితం గడుపుతున్నారు. నాకు అలాంటి జీవితం వద్దు" వాడి అభిప్రాయం స్పష్టంగా చెప్పాడు.

"మరి ఎలాంటి జీవితం కావాలిరా?" అన్నాను.

"మందరే ఇద్దరం మాట్లాడుకుని, కొన్ని రోజులు ఒకరికొకరు అర్థం చేసుకుని, అప్పుడు పెళ్లి చేసుకోవాలనీ ఇద్దరికీ అనిపిస్తే చేసుకుంటాం. లేకపోతే లేదు. అలా ఇండిపెండెంట్ థింకింగ్ వున్న అమ్మాయి దొరికితే చేసుకుంటా లేకపోతే బ్రహ్మాచారిగానే, వుండి నా ఆశయాల సాధన కోసం కృషి చేస్తా. అంతేకానీ, మీలాగా జీవితాన్ని సర్దుకుపోతూ గడపడం నా వల్ల కాదు" తెగేసి చెప్పాడు.

నాకు కోపం వచ్చింది. ఆత్మాభిమానం దెబ్బతింది. వాడిపెళ్లి కోసం ఆరాటపడుతుంటే, మా గురించి కామెంట్ చేయడం బాధనిపించింది. ఎవరితో మొరపెట్టుకోవాలో తెలీక మళ్లీ అన్నా పడ్డా మా వారితోనేగా' అనుకొని వాడు మన గురించి ఇలా అంటున్నాడు. మీరేమో ఒకే ఒక మాట అనేసి వూరుకున్నారు. నేను అలాగే వదిలేసి వూరుకుందామంటే వూరూవాడా. "మీ అబ్బాయికి పెళ్లి చెయ్యరా? అంటూ వాడి సంపాదనంతా మనం అనుభవిస్తూ, పెళ్లి గురించి పట్టించుకోనట్టు నిష్టూరాలాడుతున్నారు" అన్నా. మౌనంగా పిచ్చిదానిమల్లే నన్ను చూసి తనపనిలో నిమగ్నమయ్యారు.

నిజంగా పిచ్చిదాన్ని కాబట్టే, ఎవరిదగ్గర నుంచి సహకారం లేకపోయినా, తల్లిగా నా బాధ్యత నెరవేర్చుకోవాలని, మా అమ్మాయి ద్వారా ప్రయత్నాలు మళ్ళీ మొదలుపెట్టా. మా అమ్మాయి దగ్గర మేము పంపిన సంబంధాలు నాలుగైదు వున్నాయి. "అమ్మా నువ్వు పంపిన వాళ్లల్లో 'వినీల'తో అన్నయ్య మాట్లాడతానంటున్నాడు" అంటూ ఒక చల్లని వార్త చెవినవేసింది.

ఒక శుభగడియలో వినీల అనే అమ్మాయితో మాట్లాడుతున్నాను నీకు సంతోషమేనా? అలా అని నేను చేసుకుంటానని ఆశపడకు. జస్ట్ నీ బాధ పడలేక అంటూ నన్నేదో ఉద్ధరిస్తున్నట్లు ఫోన్ చేశాడు ప్రణీత్.

నెల రోజులైంది. వాడి దగ్గర నుంచి సమాధానం లేదు. ఉండబట్టలేక నేనే ఫోన్ చేశాను. "ఇద్దరూ మాట్లాడుకున్నారా? ఒక అభిప్రాయానికి వచ్చారా? ఇంకా ఎన్నిసార్లు

మాట్లాడుకోవాలిరా? వేరే సంబంధాల వాళ్లు తొందర చేస్తున్నారు". నా అదుర్దా అంతా మళ్లీ చేయి జారిపోతాదేమోనని!

"అమ్మా లైఫ్ లాంగ్ కలిసి వుండాల్సిన వాళ్లం. ఒక్క నెల రోజుల్లో ఎలా తేల్చుకుంటాం! అయినా ఇలా కూరగాయ బేరాల్లా అమ్మాయిల్ని చూడటం నాకు నచ్చదు. కొంచెం టైమ్ ఇవ్వు నాకు చిటికెలో చెప్పెయ్యమంటే ఎలా?" క్లాసు పీకాడు.

'ఫెమిలాయారిటీ బ్రీడ్స్ కంటెంప్ట్' అన్నారు. ఇప్పుడే అన్నీ మాట్లాడేసుకుంటే, పెళ్లి అయిన తరువాత కబుర్లేమి ఉంటాయి, కొత్తదనమేముంటుంది?' అని వాడితో అని వేగలేక నాలో నేనే గొణుక్కున్నాను.

ముందే అన్నీ మాట్లాడుకుని, తరువాత పొరపొచ్చాలు రాకుండా జాగ్రత్తపడి పెళ్లి చేసుకోవడం మంచిదా? లేకపోతే తల్లిదండ్రులు చూసిన సంబంధం చేసుకుని, తరువాత ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, సర్దుకుపోతూ జీవించడం మంచిదా? అంటూ నాలో ఒక సంఘర్షణ.

"మ్యాన్ ఈజ్ ఫ్రమ్ మార్స్. వుమన్ ఈజ్ ఫ్రమ్ వీనస్" అని ఒక నవల చదివాను. స్త్రీ పురుషుల మధ్యా రెండు విభిన్న ధృవాల మధ్య వున్నంత తేడా వుంటుంది. ఇద్దరి ఆలోచనా దృక్పథంలో చాలా వ్యత్యాసం వుంటుంది. కలిసి వుండాలనుకుంటే సర్దుబాట్లు తప్పవు. కాలానుగుణ మార్పు తప్పితే, రెండు పద్ధతుల్లోనూ మంచీ చెడులుంటాయి. వాటితో బాటు కలిసి బ్రతకడమే జీవితం.

ఈ రెండు పద్ధతుల మేలు కలయికే ఈ మాట్రిమోనీ డాట్ కామ్‌లు. ఇరువురి తల్లిదండ్రులు ఆమోదించి, అబ్బాయి అమ్మాయిలకు పంపడం, వారిరువురు మాట్లాడుకుని ఒక అభిప్రాయానికి వచ్చి పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, సాంప్రదాయం+ఆధునికం రెండూ కలగలిసిన ఈ పద్ధతి ఆహ్వానించదగ్గదే! నా అదుర్దాతో వాడిని తొందర చేయకూడదు. వాడి దృక్పథం కూడా మంచిదే" ఇలా ఆలోచించుకుంటూ వుండగానే అమ్మాయి దగ్గర నుంచి ఫోన్ వచ్చింది.

"అమ్మా! అన్నయ్య ఓకే అన్నాడు. నీతో చెప్పమన్నాడు. అమ్మని ఇన్ని రోజులు సతాయించావు. సంతోషపడుతుంది. నువ్వే చెప్పరా" అన్నాను. "సిగ్గు పడుతున్నాడు. చెప్పడానికి అంటూ" చల్లని కబురు చెప్పింది. ఇన్ని రోజులూ తన అభిప్రాయాలు నిష్కర్షగా నాతో చెప్పి వాదించినవాడు, పెళ్లికి రడీ అని చెప్పడానికి సిగ్గుపడుతున్నాడా? అనుకుంటూ, ముసిముసిగా నవ్వుకున్నా. ఇన్ని నాళ్ల ఎదురు చూపులకి శుభం కార్డు పడింది.

# 15

# కరోనా నేర్పిన పాఠం

మధ్యాహ్నం భోజనం అయిన తరువాత కాసేపు పడుకోవాలని, ఆఫీసులో పని చేస్తున్నప్పుడు నాకు ఓ గాఢమైన కోరిక వుండేది.

పదవీ విరమణ తరువాత, కొన్ని రోజుల వరకూ ఆఫీసులోనే వున్నాననుకుని, నిద్రపట్టేది కాదు. తరువాత కొద్దికాలానికి మధ్యాహ్నం మా అపార్టుమెంట్ అంతా నిశ్శబ్దంగా మారిపోయేసరికి, ఏమిటా అని ఆరా తీశా! పొద్దున్నే లేచి భర్తని ఆఫీసుకి, పిల్లల్ని బడికి పంపించి, ఇల్లంతా సర్దుకుని, మధ్యాహ్నం భోజనం చేయగానే, ఆడవాళ్లందరూ ఒక కునుకు తీస్తారని. ఎందుకంటే, మళ్లీ పిల్లలు వచ్చేసరికి కాస్త ఓపిక తెచ్చుకోవడానికి.

అప్పుడు గుర్తుకొచ్చింది నా చిరకాల వాంఛ మధ్యాహ్నం భోజనం చేయగానే ఓ కునుకు తీయాలని. అది అమలు చేయడం మొదలుపెట్టాను.

ఆ రోజు కూడా అలాగే మధ్యాహ్నం భోజనం కాగానే, పక్కమీద వాలాను. కళ్లు మూతలు పడుతున్న సమయంలో, నా సెల్ రింగ్ అయింది. ఏదో తెలియని నంబరు.

నేను ఒక రచయితను. అందుకని, నా కథ ఏదన్నా పత్రికలో పడగానే, పాఠకులు ఎవరో ఒకరు ఫోన్ చేసి అభినందించడం అలవాటు. అలాగే ఎవరో చేసి వుంటారని ఫోన్ తీశాను.

అమ్మా రమాదేవి గారేనా మాట్లాడేది అంటూ ఎవరో ఒక పెద్దాయన గొంతు ఆప్యాయంగా పలకరించింది. అవునండీ! 'మీ పేరు' అని అడిగాను.

నేనమ్మా! వెంకటాద్రిని. స్టేట్ లైబ్రరీ డైరెక్టర్ని. మీరు రాసిన పుస్తకాలు, రాజారామ్మోహన్ లైబ్రరీకి పంపడానికి, మాకు తీసుకొచ్చి ఇచ్చేవారు కదా! నేనే వాటిని

తీసుకుని, మా పి.ఎ. చేత రశీదు ఇప్పించేవాడిని. గుర్తుకొచ్చానా?

ఇప్పుడు రిటైర్ అయ్యాను. నేను రిటైర్ అయిన ఈ రెండేళ్లలో మళ్లీ ఏమన్నా కొత్తగా రాశారా? అని తన పరిచయంతో, నా కొత్త పుస్తకాల గురించి అడిగారు.

"రాశానండి. కాకపోతే, ఈ కరోనా వల్ల పుస్తకావిష్కరణ చేయలేదు" అన్నాను.

అలాగా! మీ పిల్లలు బావున్నారా! ఎక్కడ వున్నారు అంటూ కుశలప్రశ్నలు వేయడం మొదలుపెట్టారు.

నా నిద్ర కాస్తా ఎగిరిపోయేట్టుగా వుంది. సరే! పెద్దాయన కదా అని ఓపికగా జవాబు చెప్పాను. ఆయన అన్ని కుశల ప్రశ్నలు వేస్తుంటే, నేను కూడా బావుండదని మీరెలా వున్నారు? అన్నాను.

ఆ పెద్దాయన అదే వెంకటాద్రి వెంటనే నాకు ఈ మధ్య ఒంట్లో బాగులేక ఇంటి దగ్గర(ది) ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాను టెస్టు చేయించుకుందామని. వాళ్లు కరోనా! ఏమో! అంటూ అక్కడ ఒక అరగంట నన్ను కూర్చోపెట్టి, నా పెన్షనూ, బ్యాంక్ బ్యాలెన్స్, అన్నీ కనుక్కుని, నిజానికి, నాకు కరోనా లేకపోయినా, వుందని చెప్పి చేర్చుకున్నారు. మా ఆవిడని రానివ్వలేదు. 15 రోజులు నాకు అవసరం లేని మందులన్నీ ఇచ్చి, నా బ్యాంక్ బ్యాలెన్స్ అంతా అయిపోగానే డిస్చార్జ్ చేసి పంపారు.

ఇంటికి వచ్చిన తరువాత, వారిచ్చిన మందులకి, ఒళ్లంతా దురదలు, ఎలర్జీ వచ్చి నానా బాధలూ పడ్డాను. నాకొచ్చిన పెన్షన్ డబ్బులన్నీ అయిపోయినాయి.

చివరికి, తెలిసినవాళ్లు ప్రకృతి వైద్యశాలలో నన్ను చేర్పించి వెళ్లారు. ఇప్పుడు ఇక్కడ నుంచే మాట్లాడుతున్నాను. అన్నారు.

అయ్యో!, ఈ ప్రైవేట్ హాస్పిటల్ వాళ్లు ఇలాగే లేకపోయినా, కరోనా వచ్చిందని చెప్పి జనాల దగ్గర నుంచి డబ్బు గుంజేస్తున్నారు.

ఇలాగే ఆ మధ్య పేపరులో వేశారు. ఒక లాయరు, ఊరికే కొంచం జ్వరం వచ్చినట్లుందని తనకి ఎల్.ఐ.సి. పాలసీ వుంది కదా అని ధీమాగా ఇంటి దగ్గర వున్న ఒక హాస్పిటల్‌కి వెళ్లారుట. వాళ్లు కరోనా టెస్ట్ చేసి, రిపోర్టు రాగానే చెబుతాము అని, రెండో రోజు ఫోన్ చేశారుట. మీకు కరోనా వుంది వచ్చి హాస్పిటల్‌లో చేరమని. ముందుగా రెండు లక్షలు కట్టమన్నారుట. 3 రోజులయిన తరువాత, ఎందుకో ఆయనకి అనుమానం

వచ్చి నాకు కరోనా వుందన్న రిపోర్టు చూపించమన్నారుట. ఎందుకు అనడిగారుట హాస్పిటల్ వాళ్లు. అప్పుడు ఆ లాయరుకి అనుమానం వచ్చి, కరోనా టెస్టు చేసినప్పుడు, రిజల్టు నా ఫోన్‌కి రావాలి కదా! రాలేదు అందుకని అన్నాడుట.

"లేదు మా హాస్పిటల్ ఫోన్‌కి వచ్చింది అని బుకాయించారు. ఈయన వాళ్ల లాయర్ కొలీగ్స్ ఫోన్ చేసి విషయం చెప్పేసరికి, హాస్పిటల్ వాళ్ల బండారం బయటపడింది. హాస్పిటల్‌లో పని చేసే అతని నంబరు ఈ లాయరు నంబరుగా ల్యాబ్‌కి పంపించారు. అందుకని ఆ రిపోర్టు అతనికే వచ్చింది. ఆ ఫోన్ తెప్పించి అడ్వకేటు అసోసియేషన్ వాళ్లు చూస్తే, అందులో నెగెటివ్ రిపోర్టు వుంది.

అంత చదువుకున్న లాయర్‌నే వాళ్లు మోసం చేశారు. అయినా ఈ 4 రోజులూ మీకు ఐ.సి.యు.లో పెట్టి మందులు ఇచ్చాము అంటూ 3 లక్షలు కడితే కానీ డిస్చార్జ్ చేయమని. డబ్బు కట్టించుకున్నారుట. ఒక లాయర్‌నే ఇలా చేసినవాళ్లు సామాన్యులకు, చదువురాని వాళ్లనూ ఇంకెంత మోసం చేస్తున్నారో!

కరోనా బాధితుల రక్తాన్ని పీల్చేస్తున్నారు. అణాకాణీతో సహా వసూలు చేసి, ధనవంతుడుని సైతం, బిచ్చగాడిగా మార్చి రోడ్డు మీద పడేస్తున్నారు అంటూ ఆవేశంగా వార్తాపత్రికల్లో వచ్చిన విశేషాలు చెప్పాను.

"అవునమ్మా! ఇప్పుడు నా పరిస్థితి అదే! ఇంత బతుకూ బతికి, ఇంటి వెనకాల చచ్చినట్టు వుంది అంటూ నిట్టూర్చాడు.

తరువాత ఏమి మాట్లాడాలో తెలియక సరే మీ ఆరోగ్యం జాగ్రత్త అంటూ ఫోన్ పెట్టేయబోయాను.

అమ్మా! మిమ్మల్ని చిన్న సాయం అడగాలనుకుంటున్నానమ్మా! అన్నారు.

నేను మౌనంగా వింటున్నాన. నన్ను గుర్తు పట్టలేదా అమ్మా!

"ఏమోనండీ అంత గుర్తుకి రావడం లేదు. చాలా ఏళ్లు అయింది కదా! అయినా నా నంబరు మీకు ఎవరు ఇచ్చారు?"

"అయ్యయ్యో! ఎంత మాట. మీరు రాసే పుస్తకాల గురించి, మేమందరం మాట్లాడుకునేవాళ్లం. నా దగ్గర ఈ ఫోన్ నెంబరు వుందమ్మా ఎవ్వరూ ఇవ్వలేదు".

సరే... చెప్పండి అన్నాను.

ఏమీ లేదమ్మా! ఇక్కడ ట్రీట్‌మెంట్ ఉచితంగా చేస్తున్నారు. మందులు మనమే కొనుక్కోవాలి. కొంచం మందులకి సాయం చేస్తారా!

ఈ మధ్య కరోనా వచ్చినప్పటి నుంచీ కొంచం ధన, ధాన్య రూపేణా చాలామందికి ఇతోధికంగా ఇవ్వడం. ఆర్థిక ఇబ్బందుల్లో వున్న కావలసిన మిత్రరాలికి నెలనెలా కొంత డబ్బు పంపడం చేస్తున్నాను. దానికి నేను పెట్టుకున్న బడ్జెట్ దాటిపోయింది. అయినా ఏదైనా చిన్న మొత్తం అయితే చేద్దామనిపించింది. "ఎంత కావాలండీ!" అనడిగాను.

"కొంచం మొహమాటంగా ఓ నాలుగు వేలు అవసరమమ్మా! సర్దగలరా!"

అలాగేనండీ అంటూ ఆయన ఇచ్చిన బ్యాంక్ అక్కౌంట్‌కి ఆన్‌లైన్‌లో పంపించాను. వెంటనే ఫోన్ చేసి చెప్పాను. చాలా సంతోషమమ్మా! జనవరిలో పంపలేను గానీ, ఫిబ్రవరి పెన్షన్‌లో మీకు మళ్లీ తిరిగి డబ్బు పంపుతాను" అన్నారు.

"పంపనవసరం లేదండీ" మందుల కోసమంటున్నారు. ఫరవాలేదు. పెద్దవారు కదా! వుంటానండి ఆరోగ్యం జాగ్రత్త అంటూ ఫోన్ పెట్టేశాను.

కానీ నా మనస్సులో "ఆయనకి నా నంబరు ఎవరు ఇచ్చారు. ఇవాళా రేపు వార్తాపత్రికల్లో అనేక కథనాలు వస్తున్నాయి. సెల్‌ఫోన్‌లో కూడా మెసేజెస్ పెడుతున్నారు. కొంతమంది ఇలా ఫోన్ చేసి డబ్బులు కావాలని, భోజనానికి లేవనీ దీనంగా అడుగుతూ డబ్బులు తీసుకుంటున్నారని. ఇంకా మనం గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపితే ఆ నంబరు ట్రాక్ చేసి, మన అక్కౌంట్‌లోంచి డబ్బులు లాగేస్తున్నారని, నిజంగానే ఆయనకి అవసరముందా! ప్రభుత్వ ఉద్యోగం చేశానంటున్నారు, పెన్షన్ రాగానే పంపుతానన్నాడు. మరీ నాలుగువేలు లేకుండా పోతుందా? అని నా మనసులో మథన.

అప్పుడే మా స్నేహితురాలు సుమ ఫోన్ చేసింది. చేసిన దానం ఎవరితోనూ చెప్పకూడదు కానీ, మనసులోనే అనుమానం నన్ను తొలిచేస్తోంది. అదే విషయం సుమతో చెప్పాను. ఆయనెవరో నాకు గుర్తుకు రావడం లేదు. నా నెంబరు ఆయన దగ్గర ఎలా వుందో తెలీదు. ఒకవేళ నా నంబరు ఆయన దగ్గర వున్నా, నన్ను డబ్బులు అడగాలని, ఆయనకి ఎందుకనిపించిందో!" అని.

కాస్త జాగ్రత్తగా ఆలోచించి చేస్తూ వుండు దానాలు. నీది అసలే జాలిగుండె. నిజంగా అవసరమయిన వాళ్లకి చేస్తే తప్పులేదు. కానీ, ఒక్కొక్కసారి, ఇదే అలుసు

తీసుకుని, అవసరం వున్నా లేకపోయినా ఏదో వంక పెట్టి డబ్బులు గుంజాలని చూస్తారు" కొంతమంది అంది సుమ.

అలాగేలే! అంటూ ఫోన్ పెట్టేసాను.

మర్నాడు మధ్యాహ్నం ఆయనకి ఫోన్ చేశాను. ఏమండీ డబ్బు బ్యాంక్ అక్కౌంట్‌లో పడింది. చూసుకున్నారా అంటూ.

ఆయన వెంటనే "అమ్మా చూసుకున్నాను. చాలా సాయం చేశారు. సంతోషమమ్మా' అన్నారు.

ఆయన గొంతులో ఒణుకు వస్తోంది మాట్లాడుతుంటే, నా అనుమాన నివృత్తి కోసం ఆయనని "ఏమండీ మీరు ఇక్కడ వున్నారు. మీ ఆవిడ ఎక్కడ వున్నారు. మీ పిల్లలు ఎక్కడా అని అడిగాను.

మా ఆవిడ, హైదరాబాదులో వాళ్ల చెల్లెలి ఇంట్లో వుంది ప్రస్తుతం. ఇక నాకు ఇద్దరు కొడుకులు. మంచి ఉద్యోగాల్లోనే వున్నారు. ఒకడు హైదరాబాదులో, ఒకడు ఢిల్లీలో వున్నారు. ఇవాళ రేపు పిల్లల గురించి చెప్పేదేముంది అమ్మా! నాకొచ్చే పెన్షన్‌తో మేమిద్దరం విడిగా వుంటున్నాము.

మా పిల్లలు గురించి ఒకటే మాట చెబుతాను. అర్థం చేసుకోండి. "ఇప్పుడు మీరు ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరి, డబ్బంతా ఎందుకు ఖర్చు చేశారు? పెద్దవాళ్లయ్యారు కదా! అంత అవసరమా అని ప్రశ్నించారు. భగవంతుడు ఆయుర్దాయం, ఇచ్చినంత వరకూ బ్రతకక తప్పదు కదమ్మా! అంటూ బొంగురుపోయిన గొంతుతో, దు:ఖం దిగమింగుకుంటూ, ఆయాసపడుతూ చెప్పాడు.

ఆయన అలా బాధపడుతూ చెప్పేసరికి నాకు కూడా దు:ఖం వచ్చింది. అయ్యో! అలాగా మీరేమీ బాధపడకండి. మళ్లీ మందులకి అవసరమయితే చెప్పండి. పంపుతాను. చాలా ఆయాసపడుతున్నారు. ఆరోగ్యం జాగ్రత్త" అంటూ ఫోన్ పెట్టేశాను.

నా మనసులోని శంక తీరిపోయి, నేను చేసిన చిరుసాయం సరైనదేనని తృప్తిగా అనిపించింది. ఆ విషయమే సుమకు చెప్పాను. పోనీలే మంచి వ్యక్తికే సాయం చేశావు అంది.

ఒక పది రోజుల తరువాత నేనూ సుమా కలిసి సారస్వత పరిషత్ లైబ్రరీకి మేము రాసిన పుస్తకాలు ఇవ్వడానికి వెళ్ళాము. అక్కడ అనుకోకుండా ఒక తెలిసినతను

కనపడ్డాడు. మాటల్లో కరోనా విషయాలు, కోటీశ్వరులు కూడా ఎలా బికారులుగా మారుతున్నారో అంటూ కబుర్లు చెప్పుకుంటున్నాము. అప్పుడు నాకు ఇటీవల వచ్చిన వెంకటాద్రిగారి ఫోన్ కాల్ గురించి, నేను డబ్బు పంపించిన విషయం చెప్పాను.

అయ్యో! మీరు కూడా పంపించారా. నాకు తెలిసి మీరు ఏడవవారు ఇలా డబ్బు పంపిన వాళ్లలో. మీరు మోసపోయారు. నాకు ఈ విషయం ఒకళిద్దరు చెప్పేసరికి, వెంకటాద్రిగారికి అంత డబ్బు అవసరం ఏముందా అని ఫోన్ చేసి అడిగాను. “నాకేమి కర్మ డబ్బు అడగడానికి? నా పేరు ఎవరో వాడుకుంటున్నారన్నమాట” అని అన్నారు.

సుమా, నేను మొహమొహాలు చూసుకొని చేసేదేమిలేక, మోసపోయామన్నమాట అనుకున్నాము. సుమ నాతో ఇకనుంచైనా కాస్త జాగ్రత్తగా వుండు. మళ్లీ ఎవరి ట్రాప్‌లో పడకు అంటూ హెచ్చరించింది.

రాత్రి పడుకున్నప్పుడు ఈ విషయం మళ్లీ గుర్తుకు వచ్చింది. ఆ వెంకటాద్రి నా పేరును ఎంత బాగా వాడుకున్నాడు. ముసలిగొంతుతో, ఆయాసపడుతూ ఎంత బాగా నటిస్తూ మాట్లాడాడు? భలే మోసపోయాను. ఇప్పుడు చేసేదేముంది? సరే జీవితంలో ఇది ఒక పాఠం అనుకుంటూ నిద్రకు ఉపక్రమించాను. కరోనా ఇంకెన్ని పాఠాలు నేర్పిస్తుందో!

# 16

# వేధింపులు ఇలా కూడా వుంటాయా

"మేడం ! వనిత పత్రికలో మీరు రాసిన కథ చాలా బావుంది. మంచి సందేశం వుంది."

చాలా సంతోషమండి. మీ పేరు?

నా పేరు భగవాన్లు . కడప నుంచి మాట్లాడుతున్నా. నాకు కథలంటే చాలా ఇష్టం. దాదాపుగా మార్కెట్లో ఉన్న అన్ని పత్రికలు కొని చదవడం నాకు అలవాటు. మీరు "ఒంటరి స్త్రీ" మనోభావాలని కథలో చాలా చక్కగా చిత్రీకరించారు. అని చెప్పాడు. మీరు ఏమి చేస్తుంటారు మేడం? ఇప్పటిదాకా ఎన్ని కథలు రాశారు? అచ్చయిన పుస్తకాలు ఎన్ని? అంటూనే ప్రశ్నలు సంధిస్తూనే, నేను అడగకుండానే ఇంకా తన కుటుంబ విషయాలు చెప్పడం మొదలుపెట్టాడు. ఎంతో అభిమానంతో ఫోన్ చేస్తున్నాడు కదా అని చాల సేపు ఓపికగా విన్నాను. ఇంక అతని ధోరణి ఆగేటట్టు కనపడలేదు. నాకు కొంచెం పని ఉంది ఏమీ అనుకోకండి అంటూ ఫోన్ పెట్టేశాను.

సమాజంలో స్త్రీకి జరిగే అన్యాయాల గురించి కొంచెం వ్యంగ్యం జోడిస్తూ కథలు రాస్తూ వుంటాను. అవి వివిధ వార మాస పత్రికలలో ప్రచురింపబడ్డాయి. కథ కింద నా సెల్ ఫోన్ నంబరు ఇవ్వడంతో చాలామంది పాఠకులు ఫోన్ చేసి "మీ కథలో మెసేజ్‌తో బాటు వ్యంగ్యంతో కూడిన హాస్యం చాలా బావుంది . టీవీ కార్యక్రమాలతో విసిగిపోయిన మాకు మీ కథ మంచి రిలీఫ్ ఇచ్చింది" అని చెప్పేవారు.

కొంతమంది కొత్త పత్రికలు పెట్టుకున్నప్పుడు కొంచెం పేరున్న రచయితలను కథలు, కవితలు, వ్యాసాలు రాసి పంపమని అడుగుతారు. అలా వారి పత్రికలను ప్రోత్సహించడానికి కథ రాసి పంపడం, ఒక రచయితగా నాకు సంతోషంగానే ఉంటుంది.

మొట్టమొదట నేను రాసిన కథకు 500 రూపాయలు పారితోషికం అందు కున్నప్పుడు, హిమాలయ పర్వతం ఎక్కినంత సంతోషమేసింది. నాకు అలా తరువాత చాలా కథలకు పారితోషికం అందుకున్నాను. ఇటీవల కాలంలో పత్రికల వాళ్లకి ఆర్థిక వనరులు సరిగ్గా లేకపోవడం వల్లనో, మరే ఇతర కారణాల వలన కానీ, బాగా పేరున్న పత్రికలు తప్ప తక్కిన వారు పారితోషికాలు ఇవ్వడం లేదు.

అదీకాక పత్రికల వాళ్లకి కుప్పలు తెప్పలుగా రచనలు వచ్చి పడుతుండడం, డబ్బులు ఇవ్వకపోయినా ఫరవాలేదు, కథ అచ్చయితే చాలు అనుకునే కొత్త రచయితలు ఉండడం వలన కూడా ఇలా జరుగుతోంది.

కొత్త కొత్త వారపత్రికలు, మాసపత్రికలు అనేకం పుట్టుకు రావడంతో చదివే పాఠకులు తగ్గిపోయారు. కొన్ని పత్రికలు సబ్స్క్రిప్షన్ కట్టిన వారికి మాత్రమే పత్రిక పంపుతూ, పత్రికలు నడుపుతున్నారు. కాబట్టి వారికి ఇంక పారితోషికం పంపే అంత ఆర్థిక వెసులుబాటు ఉండడం లేదు.

ఇటీవల కొత్తగా “ఆమె” అనే పత్రిక పెట్టాము ఒక కథ రాసి పంపండి. పేరున్న రచయితల కథలు కవితలు వ్యాసాలు వేస్తే, మాకు పాఠకులు పెరుగుతారు”. అలాగే సబ్‌స్క్రైబర్స్ కూడా పెరుగుతారు అని అడిగారు.

వీలు చూసుకుని ఒక కథ రాసి వారికి పంపాను వెంటనే వారి మొదటి సంచికలో దానిని ప్రచురించారు.

“స్త్రీలు ముఖ్యంగా ఉద్యోగినులు ఇంటా బయటా అష్టావధానం చేస్తూ ఉంటారు . అది లోక విదితమే! అలాగే నా కథలో మాలతి ఒక ఉద్యోగిని. ఒక భర్త అకాల మరణం చెందుతాడు. పిల్లలిద్దరూ పెళ్లిళ్లయి వెళ్లిపోతారు. పిల్లలు నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఎందుకు మాతో వచ్చేయి. ఉద్యోగం రిజైన్ చేసేయి అంటూ గొడవ. ఇక ఇరుగు పొరుగు వారు పాపం అన్నీ పనులూ నువ్వే చేసుకోవాల్సి వస్తోంది. ఆయన ఉంటే నీకు ఈ బాధలు ఉండేవి కావు పిల్లల దగ్గరకి వెళ్లి ఉండచ్చు కదా” అంటూ ఉచిత సలహాలు ఇస్తుంటారు. భర్త చనిపోయిన బాధకన్నా సమాజం చూపించే జాలినే భరించలేకపోతుంది ఆమె. ఒంటరి స్త్రీకి, అండగా ఉండకపోగా ఆమెను నిర్వీర్యం చేస్తుంది సమాజం” స్త్రీని అబలగా చూడడం అలవాటైన సమాజం. మాలతి మునిపటిలాగే ఉద్యోగం చేసుకుంటూ బయటి పనులూ, ఇంటి పనులూ చేసుకోవడం చూసి ఓర్వలేక ఆమె మీద జాలి చూపిస్తూ

కిందకి లాగాలని ప్రయత్నం చేస్తూ వుంటుంది. కింద పడిన బంతి పైకి లేచినట్టు , కిందికి లాగిన ప్రతిసారీ మళ్ళీ ఉత్సాహం పుంజుకుని పైకి లేచిన ఒంటరి మహిళ మాలతి, ఉద్యోగ బాధ్యతలే కాక సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టి తనని తాను నిరూపించుకుంటుంది.

ఇదీ కథ చాలామంది పాఠకులు మీ కథ స్త్రీ మనోభావాలను ఎంత చక్కగా చిత్రీకరించింది. చాలా ఇన్స్పైరింగ్గా ఉంది మాకు అంటూ ఫోన్ చేసి చెప్పారు.

కథ పడిన పత్రిక నేను చూడలేదు నిజానికి. పారితోషికం మాట అటుంచి కనీసం పత్రిక అన్నా పంపుతారో లేదో అనుకుంటూ, మా వాచ్మన్ని పిలిచి పత్రిక బయట కొనుక్కురమ్మని పంపించాను. ఎక్కడా దొరకలేదు అంటూ వాడు తిరిగి వచ్చాడు. నా అవస్థ చూడలేక ఏమనుకున్నారో ఏమో మా శ్రీవారు సెంటర్కి వెళ్లి చూసొస్తా దొరుకుతుందేమో అని ఆ పత్రిక పేరు రాయించుకెళ్లారు ఆయన వెళ్తాను అనేసరికి నాకు చాలా సంతోషం వేసింది. ఇంతా చేసి ఆయన సొంత పనులన్నీ చేసుకొని, గంట తరువాత తీరిగ్గా వచ్చి, పత్రిక సబ్స్రైబర్స్కి మాత్రమే పంపుతారుట. బయట అమ్మరుట. అనవసరంగా గంటసేపు అన్ని షాపులు తిరిగి వచ్చాను అంటూ తన విలువైన సమయం అంతా వృధా అయిందంటూ నిష్టూరంగా మాట్లాడారు.

ఈ గంట లోపల అయిదారుగురు ఫోన్లు చేసి కథ బావుంది అని చెప్పారు . చాలా సంతోషం అనిపించింది పత్రిక దొరకలేదు కానీ పాఠకుల స్పందనలు బావున్నాయి అనుకున్నా.

మధ్యాహ్నం ఒంటగంటకు భోజనాలకి కూర్చున్నాము, నేను మావారు. ఫోన్ రింగ్ అయింది. అబ్బా! ఇప్పుడేమిటి అనుకుంటూ ఫోన్ తీశాను." నేను లాయర్ మనోహర్ నండి నిజామాబాద్ నుంచి ఫోన్ చేస్తున్నా. మీ కథ చాలా బావుంది స్త్రీ సమాజ పరంగా ఎదుర్కొనే ఇబ్బందుల నుంచి తనను తాను రక్షించుకునే విధానం బాగుంది.మేము స్త్రీల పరంగా ఎన్నో కేసులు డీల్ చేస్తాం. ఇటువంటి పాయింట్స్ మాకు చాలా ఉ పయోగంగా ఉంటాయి. ఇంటి అడ్రస్ చెబితే హైదరాబాద్ వచ్చినప్పుడు మిమ్మల్ని కలుస్తాను. మీరు రాసిన ఇతర స్త్రీ సమస్యల కథల పుస్తకాలు ఇస్తే మాకు ఉపయోగంగా ఉంటాయి. ఎక్కడుంటారు చెప్పండి" అంటూ ఫోన్. పక్క నుంచి మా వారు అసహనంగా చూస్తున్నారు.

"నేను ఇంటిదగ్గర ఎవరిని కలుసుకోనండీ ! సారీ" అన్నాను. "నేను కూడా అంతేనండీ బిజీగా వుంటాను. పోనీ నా ఎడ్రస్ ఇస్తాను. మీరు పోస్ట్ లో పంపగలరా ? ఇది కూడా ఒక సామాజిక సేవే కదా !" అన్నాడు. ఇంక వదిలేనట్టు లేదని, అడ్రస్ పంపించండి వీలుని బట్టీ చూస్తాను. వుంటానండి" అంటూ ఫోన్ పెట్టేశాను.

ఆకలిగా వున్న మా వారు నన్ను ఏమీ అనలేక మౌనంగా భోజనం ముగించారు.

తరువాత కొంత సేపటికి మరో ఫోన్. "కథ చాలా బావుంది మేడం"

"సంతోషమండి ఎక్కడ నుంచి చేస్తున్నారు?

"నేను హైదరాబాద్‌లో వుంటాను. స్టూడెంట్ నండీ! ప్రస్తుతం లైబ్రరీలో వున్నాను. కథలంటే నా కిష్టం. అందుకే కాస్త ఫ్రీ పీరియడ్ దొరకగానే లైబ్రరీ కి వచ్చి పత్రికలు తిరగేస్తాను. మీ కథ, చదివి చేస్తున్నాను."

"బావుంది స్టూడెంట్‌గా వుండి , సాహితీ అస్వాదన చేస్తున్నారు" అన్నాను.

"మేడం మీరేమీ అనుకోకపోతే మీ గొంతు చాలా బావుంది. మీరు పాటలు కూడా పాడుతారా ?"

ఇంక ఇది ఇక్కడితో ఆగేటట్లు లేదని "అదేమీ లేదు" వుంటాను బాబూ అని ఫోన్ పెట్టేసాను.

తమాషా ఏమిటంటే అసలు స్త్రీల గురించి కథ రాస్తే, ఒక్క మహిళ దగ్గర నుంచి ఫోన్ రాలేదు.

సాయంకాలం వరకు అడపా దడపా ఫోన్లు వచ్చాయి. ఒకతను ఫోన్ చేసి మీ కథకు అనుగుణంగా మంచి బొమ్మ వేశారు. బొమ్మ చూడగానే కథ చదవాలనిపించింది. బొమ్మ మీరు సజెస్ట్ చేస్తారా లేక పత్రిక వాళ్ళే వేస్తారా? అని అడిగారు.

నిజానికి ఏ బొమ్మ వేశారో నేను పత్రిక చూస్తే కదా!

రెండు రోజుల తర్వాత తెల్లవారు జామున నాలుగు గంటలకి సెల్ ఫోన్ రింగ్ అయింది. అప్పుడప్పుడు పిల్లలు అమెరికా నుంచి ఆ టైంకి ఫోన్ చేస్తూ ఉంటారు. ఏమైనా అర్జెంటుగా మాట్లాడాల్సి వస్తే. అలాగే అనుకుని ఏంట్రా నాన్న ఈ టైంలో ఫోన్ చేసావు" నంబరు చూడకుండా మా బాబు అనుకుని అన్నాను.

"మేడం నేనండీ! భగవాన్. గుర్తు పట్టారా ? మొన్న మీ కథ బావుందని చెప్పాను. అప్పుడు మీరు కొంచెం పనిలో ఉన్నాను తర్వాత మాట్లాడుదాము అన్నారు కదా. అందుకే ఈ టైంకి చేస్తున్నాను. ఈ సమయంలో ఎవరికి పెద్ద పనులు ఉండవు డిస్ట్రబెన్స్ కూడా ఉండదు. సాధారణంగా ఆడవాళ్లు ఉదయమే నిద్రలేస్తారు కదా అని చేశాను. ఏమీ అనుకోకండి. ఈ కథ చదివిన తర్వాత నన్ను అది హాంట్ చేస్తోంది అందుకే మీతో మాట్లాడదామని చేశాను" అన్నాడు. అతన్ని ఏమనాలో తోచలేదు ఈ టైంలో ఫోన్ చేయడం ఏమిటి? చాలా చికాకుగా అనిపించింది. మా వారు "ఎవరు ఈ టైంలో ఫోన్" అని విసుక్కుంటూ అటు తిరిగి పడుకున్నారు. ఫోన్ కట్ చేద్దాము అన్నంత కోపం వచ్చింది. కానీ పెట్టేస్తే మళ్లీ చేస్తాడేమో అనిపించి బాబూ ఈ టైంలో డిస్టర్బ్ చేయకు నిద్రపోతున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాను.

ఇంక నిద్ర ఎలా పడుతుంది. ఆలోచన బుర్ర తినేస్తోంది. ఇదేమిటి? ఇది అభిమానమా? కథ బావుంటే మటుకు ఇలాంటి ఫోన్లు రిసీవ్ చేసుకోవడం ఇబ్బందిగానే వుంటుంది. నిజంగా కథ అంత బావుందా లేక ఫోన్లో ఉచిత టాక్ టైం ఇస్తున్నారు కదా అని ఇంతసేపు మాట్లాడుతున్నారా? అర్థం కాలేదు.

ఆలోచనలతోనే పని ముగించుకుని ఉదయం అల్పాహారం తయారు చేసి టేబుల్ మీద పెట్టాను. ఫోన్ మోగింది. ఏదో అపరాధం చేసినట్లు మా వారు నా వంక గుర్రుగా చూస్తున్నారు. చేసేది లేక ఫోన్ తీసాను. పత్రిక సంపాదకుడి దగ్గర నుంచి "మేడం ! మీ కథకి మంచి రెస్పాన్స్ వచ్చింది. మీకు పోస్ట్‌లో పత్రిక పంపుతున్నాను. ఆలస్యం అయినందుకు మన్నించండి." అని.

"సరేనండీ. ఈ సారి కథ కింద నా ఫోన్ నంబర్ వేయకండి. అభిమానుల వుత్తరాలు మీ పత్రిక ఆఫీసుకి వస్తే తెలియ చేయండి" అని చెప్పాను. నిజానికి ఫోన్ చేసి అభినందనలు చెబితే సంతోషంగానే వుంటుంది. కానీ "అభిమానం ఇలా వుంటుందా ? " వేధింపులు ఇలా కూడా వుంటాయా?

# 17

# కళ్లజోడు

'ట్రింగ్ ట్రింగ్' అంటూ కాలింగ్ బెల్ మోగింది. ఈ టైమ్‌లో ఎవరొచ్చారబ్బా! తలుపు తీయడానికి చేతులు ఖాళీ లేవు. అప్పుడే పూజ ముగించి, వంటింట్లో కొచ్చాను. వెండి కంచంలో అన్నం, పప్పు, కూర, పెరుగు వేసి, నెయ్యి అభికరించి దేవుడికి నైవేద్యం పెడదామని. ఆ నైవేద్యం కాస్తా అయి, హారతి ఇచ్చాక, పూజ చేసుకున్న చీర మార్చుకుని, వేరే చీర కట్టుకోవడం అలవాటు. ఓ తంతు ముగిసినట్టుగా వుంటుంది. పూజ చెయ్యాలి అని పొద్దున్నుంచీ ఆత్రమే తప్ప, తీరా పూజకి కూర్చునేసరికి, మనసు దేవుడి మీద తప్ప, అన్ని చోట్ల తిరుగుతూ వుంటుంది. దాన్ని లాక్కొచ్చి, దేవుడి స్తోత్రాలు చదివి, నైవేద్యం, హారతి, మంత్రపుష్పం అన్నీ ఒక 'రోబో'లాగా చేయడం, అమ్మయ్య ఇవాల్టికి పూజ అయ్యింది. ఇక ఆత్మారాముడి గోల చూడాలి అనుకుంటూ వంటింట్లోకి దూరడం జరుగుతుంది. దేవుడి మీద భక్తి లేకుండా పూజ చేస్తే, దాన్ని 'తంతు' అంటారు. పూజ కాదు అని 'చాగంటి' వారు ఉపన్యాసాలలో చెబుతారు. నిజమే! భక్తిగా పూజ చెయ్యాలి అనుకుంటా. "గీత"లో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు కదా! పత్రం, పుష్పం, ఫలం, తోమం, ఏదైనా భక్తితో సమర్పిస్తే నేను స్వీకరిస్తాను. అటువంటి భక్తులను అనుగ్రహిస్తాను" అని. అయితే ఆ నాలుగు సమకూర్చుకుంటాను కానీ మనస్సు నిలకడ వుండదు. భక్తి కూడా యాంత్రికమయిపోయింది.

నా ఆలోచన నుంచి తేరుకుని, చేతులు కడుక్కునే లోపల మళ్లీ బెల్ మోగింది."కొరియర్' అంటూ గొంతు వినపడింది. పైకీ కిందకీ జారిన చీర కుచ్చెళ్లను కాస్త సవరించుకుంటూనే తలుపు తీసాను. "కొరియర్ వచ్చిందమ్మా, 'రాజారావుగారి' పేరిట, ఇంట్లో వున్నారా? అడిగాడు" లేరు బయటికి వెళ్లారు అన్నాను నేను. మీరేమవుతారు ఆయనకి అన్నాడు. నేను ఆయన భార్యని.

"ఫరవాలేదమ్మా! ఆయన పేరు దగ్గర సంతకం పెట్టి, మీ ఫోన్ నెంబరు రాయండి" అంటూ కాగితం పెన్నూ ఇచ్చాడు.

అసలే కరోనా రోజులు. ఆ పేపరు మీద చాలామంది పేర్లు వున్నాయి. వారందరూ ఈ పేపరు పెన్ను ముట్టుకుని సంతకాలు పెట్టే వుంటారు. పాల పాకెట్లు, వార్తా పత్రికలు కూడా బయట ఒక గంట వుంచిన తరువాత, వాటి మీద సానిటైజర్ చల్లి తీసుకోమని, అమెరికా నుంచి పిల్లల సలహాలు. అలాంటిది ఇంతమంది చేతిలో తిరిగిన, ఈ పేపరూ, పెన్నూ ఎలా ముట్టుకోనూ? సందిగ్ధావస్థలో వుండి, ఈ కాగితం బల్లమీద పెట్టు. (ఇటువంటి వాటి కోసం బయట ఒక బల్ల వేసాము). నేను నా పెన్ను తెచ్చుకుని సంతకం పెడతాను అంటూ పెన్ను కోసం లోపలికొచ్చాను. ఇంట్లో ఎవరూ లేరు. కొరియర్ వాడు లోపలికి నా వెనకాలే వస్తాడేమో అన్న అనుమానంతో, వెనక వాడివైపు చూసుకుంటూ లోపలికొచ్చాను. పెన్ను తీసుకుని వెళ్ళాను కానీ, మా వారి పేరు ఎక్కడ వుందో, సరిగ్గా కనపడలేదు. కళ్లజోడు కోసం మళ్లీ లోపలికి వచ్చాను. "ఏంటమ్మా ఇంతసేపు చేస్తారు. నేను చూపిస్తున్నాను కదా! ఇక్కడ సంతకం పెట్టి ఫోన్ నెంబరు రాయండి" అంటూ పేపరు చేతికిచ్చాడు. "నీ చేతిలో పేపరు నేను ముట్టుకోనయ్యా, అక్కడ పెట్టి, కొంచం పక్కకి జరిగి నుంచో ఏమనుకోకు, కరోనా రోజులు కదా! కాస్త జాగ్రత్తగా వుందామని". అతను నొచ్చుకోకుండా చెప్పి, కళ్లజోడు కోసం లోపలికి వచ్చాను. ఎక్కడా కనపడదే! ఆ గదీ, ఈ గదీ, హాలూ, వంటిల్లూ తిరిగి, ఓడిపోయిన దానికి మల్లే వచ్చి, సరే ఎక్కడ పెట్టమంటావో చెప్పు అంటూ, నా పెన్నుతో బల్లమీద కాగితం ముట్టుకోకుండా సంతకం చేసి ''ఆ పాకెట్, ఆ బల్ల మీదే పెట్టి వెళ్లు. ఇంతకీ కొరియర్ ఎక్కడ నుంచి వచ్చింది అన్నాను. ప్యాకెటు ఎవరు పంపించారో అన్న ఆతృతతో. అమెరికా నుంచి వచ్చిందమ్మా" అంటూ ఇంకా నేనేమి ప్రశ్నలు వేస్తానో అని గబగబా వెళ్లిపోయాడు. సరే మావారు లంచ్ కొస్తారుగా అప్పుడు తిస్తారులే ప్యాకెట్టు లోపలికి అనుకుని లోపలికి వచ్చి, టేబుల్ మీద వండిన పదార్థాలు చేర్చి, ఆయన వచ్చేలోపల వార్తాపత్రిక చదువుదామని సోఫాలో కూలబడ్డా. కూర్చున్నాక గుర్తొచ్చింది కళ్లజోడు గురించి. కళ్లజోడు కోసం మళ్లీ లేవాలా, అది దొరికే లోపల, ఈయన రానే వస్తారు. రాగానే భోజనం చేయడం, కాసేపు విశ్రాంతి, మళ్లీ కాఫీలు, వగైరా పనులు వుంటే వున్నాయి" అనుకుంటూ లేచాను.

కళ్లజోడు ఎక్కడ పెట్టానో గుర్తుకు రాలేదు. వంటింటి గట్టూ, డైనింగ్ టేబుల్ మీద, మంచం మీద చూశాను. కనపడలేదు. సరే ఎప్పుడో అప్పుడు కనపడుతుందిలే. ఇప్పుడు పేపర్ చదవడం కుదరదు అనుకుని నిట్టూర్చుతూ వచ్చి మళ్లీ సోఫాలో కూలబడ్డాను.

మావారు వస్తూనే కొరియర్ ప్యాకెట్టు తీసుకుని లోపలికి వచ్చారు. ఆ ప్యాకెట్టు మీదా, మావారి చేతి మీద సానిటైజర్ వెయ్యబోతే, నీకు మరీ చాదస్తం ఎక్కువైంది. నాకు చాలా ఇమ్యూనిటీ వుంది. నాకేమీ అక్కరలేదు అంటూ, ప్యాకెట్ తెరిచారు. అందులో ఏముందో అని ఆతృతగా చూస్తే, మా అబ్బాయి, ఇక్కడ మేము మాస్కులు కొనడానికి బద్ధకిస్తామని, అవి కొనడానికి మళ్లీ మేము బయటికి వెళ్లాలని, ఎన్–95 మాస్కులు కొరియర్‌లో పంపించాడు. అవి చూడగానే "నీలాగే, నీ కొడుక్కి కూడా చాదస్తం ఎక్కువైంది. ఇక్కడ మనకి దొరకవూ లోకల్ మాస్కులు. అమెరికా నుంచి పంపడమేమిటి?" అంటూ విసుక్కున్నారు.

ఎన్–95 మాస్కు అయితే మనం వదిలిన గాలిని బయటికి పంపించేస్తాయట. ఇవి ఆరోగ్యానికి మంచివని పంపించి వుంటాడు. అన్నిటికీ విసుగే మీకు. మన గురించి వాడు అంత కేర్ తీసుకుంటుంటే, సంతోషించాల్సింది పోయి, ఈ సూటిపోటీ మాటలేమిటి మీరు? కొడుకుని వెనకేసుకొస్తూ, కొంచం గట్టిగానే అన్నాను. నా వంక ఒకసారి చూసి, మాట్లాడకుండా గదిలోకి వెళ్ళారు.

"అన్నట్టు చెప్పడం మరిచాను. మా ఫ్రెండ్ సుబ్బారావు లేడూ! వాళ్ళావిడ రాసిన కథ ఈనాడు ఆదివారం పుస్తకంలో పడిందిట. చదివి చెప్పమన్నాడు. ఈ కథలూ అవీ చదవడం నాకు బోర్. నువ్వే చదివి కాస్త నాకు చెప్పు. వాడితో బావుందని చెబుతాను" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చారు.

"అలాగే చదివి చెబుతాను" అన్నాను. అప్పుడు గుర్తుకొచ్చింది నా కళ్లజోడు సంగతి. "ఇందాకటి నుంచి వెదుకుతున్నాను, నా కళ్లజోడు కనపడటం లేదండీ" అన్నాను.

"ఎక్కడపడితే అక్కడ పెడతావు ఆ కళ్లజోడు. దానికి ఒక చోటంటూ వుండదు. ఒకసారి బాత్‌రూమ్‌లో, ఒకసారి ఫ్రిజ్‌లో, ఒకసారి బట్టల అలమారాలో పెడతావు. వెతికి పెట్టలేక చస్తున్నాను. ఒకచోట పెట్టుకునే డిసిప్లిన్ లేదు నీకు" అంటూ వచ్చిందే ఛాన్సు అనుకుని నా మీద విసుర్లు మొదలెట్టారు.

"సరేలెండి మిమ్మల్ని అడగడం నాదే బుద్ధి తక్కువ" అని చెంపలేసుకుంటూ భోజనాలు వడ్డించాను.

నిజంగానే మావారు అన్నట్టు, ఒకసారి చీర తీసుకుంటూ, ఎందుకో కళ్లజోడు తీసి బీరువా అలమారాలో మర్చిపోయాను. ఒకసారి ఫ్రిజ్ కింద అరలో ఒంగి కూరలు తీస్తుంటే, కళ్లజోడు పడిపోయింది. కూర ఎలా చేయాలి అని ఆలోచిస్తూ కళ్లజోడు

పడిపోయిందని గమనించలేదు.

అసలు ప్రాబ్లమ్ ఏంటంటే, అవి ఓన్లీ రీడింగ్ గ్లాసెస్. చదివేటప్పుడే అవసరం వుంటాయి. కానీ డాక్టరు ఎప్పుడూ వేసుకుని వుండాలి అని చెప్పడం వల్ల పెట్టుకుంటాను. కానీ వంట చేసేటప్పుడు, పోపు వేయగానే, ఆ ఆవిరికి కళ్లజోడు మసగ్గా అవుతుంది. అందుకని తీసి పక్కనపెడతాను. ఆ పెట్టడం, పప్పు డబ్బా మీదో, స్టవ్ పక్కనో, ఫ్రిజ్ మీదో పెడతాను. తరువాత మర్చిపోతాను.

ఒక్కొక్కసారి, తలపైకి పెడతాను అది అస్సలు తెలియదు. ఇల్లంతా వెతికి వెతికి, చివరికి నెత్తి మీద తలపట్టుకుని భగవంతుడా అనుకుంటుంటే, చేతికి తగులుతుంది. కిక్కురుమనకుండా, తీసుకని ఏదైనా పత్రిక తిరగేస్తాను.

ఒకసారి మా పక్కింటావిడ వచ్చింది. ఆవిడతో మాట్లాడుతూ, అడ్డంగా వున్న కళ్లజోడు తీసి సోఫా మీద పెట్టాను. అప్పుడు ఆవిడ, "కళ్లజోడు లేకుంటే, మీరు చాలా బావున్నారండీ!" అంది

నేను మొహమాటంగా నవ్వుతూ "ఏం చెయ్యమంటారు? ఇది పెట్టుకుంటే ఒక బాధ పెట్టుకోకపోతే ఒక బాధ" కానీ పెట్టుకోక తప్పదు అన్నాడు డాక్టరు. అంటూ కబుర్లలో పడ్డాము. ఆవిడ వెళ్లగానే లోపలికి వచ్చాను. తరువాత కళ్లజోడు ఎంత వెతికినా కనపడలేదు.

"ఆవిడ నువ్వు కళ్లజోడు లేకుండా బావున్నావు అంది అని చెప్పావు కదా! ఆ జోష్‌లో దాన్నెక్కడో పడేసి వుంటావు" అంటూ మావారి వెటకారం! నన్ను చూడు ఎప్పుడన్నా కళ్ళజోడు కనపడటం లేదని నిన్నడిగానా. చాలా జాగ్రత్తగా పెట్టుకుంటాను.

నీకు డబ్బు విలువ తెలుస్తేగా! పోతే, ఇంకోటి కొంటాడని ధీమా!" అంటూ అవకాశం వచ్చింది కదా అని దెప్పి పొడవటం మొదలుపెట్టారు.

నాకూ తిక్క వచ్చింది. అవును మీరు సంపాదించి కోట్లు కోట్లు కుమ్మరిస్తున్నారు కదా! వజ్రాలు పొదిగిన కళ్లజోడు కొనుక్కున్నా మరి! అంటూ వ్యంగంగా చురక అంటించాను.

మీరంటే జేబులో పెట్టుకుని తిరుగుతారు. మగవాళ్ల ప్యాంటుకి, షర్టుకీ జేబులుంటాయి. అందుకని మాలాగా అక్కడా ఇక్కడా పెట్టరు. జేబులు లేకపోతే,

మీరూ అంతే.

"ఇప్పుడు ఆడవాళ్లకి జేబులున్న చీరలు కూడా వస్తున్నాయి. అది కొని పెడతాలేవోయ్!" అంటూ నా వంక చూసి వాతావరణం తేలిక చేశారు.

అంతే కాని కళ్లజోడు ఎక్కడ వుందో చూసి పెట్టరన్నమాట. "ఛీ! ఛీ! ఈ కళ్లజోడుతో ఎన్ని మాటలు పడవలసి వస్తోంది అంటూ నుదురు కొట్టుకున్నా".

"ఏంటోయ్! అంత సీరియస్ అవుతావు. నీ కళ్లజోడు వెతికి ఇవ్వడానికి కొంత ఖర్చు అవుతుంది మరి. అంటూ నా తలమీద పెట్టుకొని ఇల్లంతా వెతుకుతున్న కళ్లజోడుని నా మొహం మీదికి దించారు నవ్వుతూ" శ్రీవారు.

# 18

# లైఫ్ సర్టిఫికేట్

"హలో మానసా! లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చేసావా?

ఈసారి పెన్షన్ ఆఫీసులో తీసుకోవడం లేదుట కదా!" ఉమా చాలా గాభరా పడుతూ ఫోన్ చేసింది.

ఉమా నేనూ ఉమ్మడి సచివాలయంలో కలిసి పని చేశాము. మంచి స్నేహితులం. ఉమ నాకంటే వయసులో పెద్దది. నాకంటే ముందరే రిటైర్ అయింది. కానీ, మా ఇద్దరి అభిప్రాయాలు, మనస్తత్వం ఒకటే అవడం వలన, ఒకే సెక్షన్‌లో పని చేయడం వలన, ప్రతి విషయం షేర్ చేసుకోవడం అలవాటు అయింది. రిటైర్ అయినా కూడా ఆ స్నేహబంధం అలా కొనసాగుతూనే వుంది.

ఉమ జీవితం భర్త ఉండగా బానే వుండేది. భర్త పోయిన తరువాత కొడుకూ, కోడలిలో చాలా మార్పు వచ్చింది. కోడలు, కొడుకు జీతం అంతా తన గుప్పిట్లో పెట్టుకుని, ఇంట్లో సరుకులు అన్నీ తెప్పించకుండా, కొద్దికొద్దిగా వండటం చేసేది. అందరూ తినేసి, కొడుకూ కోడలూ ఆఫీసుకి, మనుమలు స్కూళ్లకి వెళ్లిపోయాక, అన్నం తిందామని ఉమ కూచోగానే, చెంచా కూర, చెంచా పప్పు బిరుసెక్కిపోయిన అన్నం వుండేది. బిరుసుగా వున్నా అన్నం గొంతు దిగక, కొంచం నీళ్లు పోసుకుని అన్నం పిసికి, దానిలో ఆ చెంచా పప్పు కూర కలుపుకుని, మంచినీళ్లతో మింగేసి, గదిలోకి వచ్చి కూచునేది. ఆయన పోగానే, నా జీవితం ఇంత దిగజారిపోయిందేమిటా అని బాధపడుతూ, నాతో చెప్పుకుని బాధపడేది.

నేను, ధైర్యం చెబుతూ, మీ అబ్బాయి రాగానే మొహమాటపడకుండా ఇంట్లో సరుకులు లేవా అని నీ కొడుకు ఎదురుకుండానే కోడలిని అడుగు" అని అన్నాను. "అదీ అయింది. ఈ నెలలో పిల్లల ఫీజులు అనీ ఖర్చు అయినాయి అంటూ నసిగింది.

కొడుకు ఏమీ మాట్లాడకుండా గదిలోకి వెళ్ళిపోయాడు. అసలు "పిల్లల ఫీజులకి డబ్బు కావాలి, లోన్ పెట్టాను రాగానే ఇచ్చేస్తానంటూ, నా పెన్షన్ డబ్బుల్లోంచి తీసుకున్నాడు. కోడలేమో పిల్లల ఫీజులకని అబద్ధాలు చెబుతోంది. సరే ఎవరిని ఏమని అనను? మళ్ళీ ఒక చెక్కు రాసిచ్చి, సరుకులు తెమ్మని, కొడుకుకి ఇచ్చాను. ఇవాళ తెస్తా, రేపు తెస్తా, టైమ్ కుదరడం లేదంటూ, తాత్సారం చేస్తూ, నా మొహాన అదే భోజనం పడేస్తున్నారు" గొంతు గాద్గికమవుతూ చెప్పింది ఉమ.

చాలా బాధ అనిపించింది. ఎంత వైభవంగా బతికింది ఉమ. కట్టిన చీర మళ్ళీ కట్టకుండా లేటెస్టు ఫ్యాషన్ చీరలు కట్టేది ఆఫీసుకి. ఏ వారం, ఏ రంగు చీర కట్టుకోవాలో, ఇద్దరం అనుకుని కట్టుకునే వాళ్లం. వారానికొకసారి లంచ్‌కి గోపి హోటల్‌కి వెళ్ళి బాసుందీ స్వీటు తినేసి గబగబా మళ్లీ ఆఫీసుకొచ్చి పని చేసుకునేవాళ్లం. లంచ్ టైమ్‌లో బోలెడన్ని కబుర్లు, సినిమాల గురించి, వీక్ఎండ్స్ ఎలా గడపాలో ప్లాన్ చేసుకునేవాళ్లం. పని పెండింగ్ లేకుండా చేస్తారని ఆఫీసర్ల నుండి మెప్పులు పొందేవాళ్లం. ఎంతో హాయిగా గడిచిపోయినాయి రోజులు.

రిటైర్ అయిన తరువాత మనకి పెన్షన్ వస్తుంది కదా! ఎవరి మీదా ఆధారపడకుండా గడపచ్చు అంటూ సంబరపడేవాళ్లం. అలాంటిది ఇప్పుడు ఉమ పెన్షన్ అంతా ఖర్చు చేయించేసి, కనీసం కడుపునిండా భోజనం కూడా పెట్టడం లేదు కొడుకూ, కోడలు. తల్లిని కొట్టి, ప్రభుత్వం వారిచ్చే వృద్ధాప్య పింఛను లాక్కుని, తాగడానికి ఖర్చు చేస్తున్న కొడుకులకీ, ఘరానాగా నా దగ్గర నుంచి మొత్తం ఖర్చు చేయిస్తున్న నా కొడుకుకీ తేడా ఏమీ లేదు. అది గుడిసెలో సంస్కృతీ, ఇది మేడలోని సంస్కృతీ అంతే! అంటూ వాపోయింది ఉమ.

ఈ పరిస్థితుల్లో ప్రతి ఏడాదీ నవంబరు నుంచీ, పెన్షన్ ఆఫీసులో ఇచ్చే లైఫ్ సర్టిఫికేట్ గురించి, పభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, వృద్ధులని అయోమయంలో పడేశాయి.

ఇప్పుడు అందరికీ ఇదో బెంగ పట్టుకుంది. ఇదివరకు సంవత్సరానికి ఒకసారి, ఆటోలో పెన్షన్ ఆఫీసుకి వెళ్లి లైఫ్ సర్టిఫికేటు ఇచ్చి హమ్మయ్య, ఇంక ఏడాది దాకా, పెన్షన్‌కి ఢోకా లేదు అనుకునేవాళ్లం.

కానీ ఇప్పుడు "జీవన్ ప్రమాణ్" అనే ఇంటర్నెట్ యాప్ ద్వారా పంపించండి, మీరు కష్టపడి పెన్షన్ ఆఫీసుకి రానవసరం లేదంటూ వృద్ధులను ఉద్ధరిస్తున్నట్టు ఆర్డర్ జారీ చేసింది ప్రభుత్వం.

వృద్ధాప్యం వచ్చిన తరువాత అన్నింటికీ టెన్షన్‌గానే వుంటుంది. అందుకే రెండు నెలలు టైమ్ వున్నా అందరికీ తొందరగా ఇచ్చేయ్యాలనే ఆతృత. అందుకే ఉమ కొడుకుని అడిగిందట. ఎంత ప్రయత్నించినా ఆ 'యాప్' డౌన్‌లోడ్ అవలేదంటూ కంగారు పడుతూ నాకు ఫోన్ చేసింది.

'డౌన్‌లోడ్ కాకపోతే, ప్రభుత్వం దానికి ప్రత్యామ్నాయం ఏదో చూపిస్తుంది. మనలాంటి వాళ్లు చాలామందికి ఇదే ప్రాబ్లమ్ వుందిట. ఒక నాలుగు రోజులు ఆగి చూద్దాం!! అన్నాను.

"సరే అలాగే చూద్దాం" అంది ఉమ.

రోజుకొకసారి ఒకరినొకరు పలకరించుకోవడం మాకు అలవాటు. రెండో రోజు ఉమ ఫోన్‌లో మన ఫ్రెండ్ సుహాసిని ఫోన్ చేసి చెప్పింది మీ సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు తీసుకెళ్తే వేలిముద్రలు తీసుకుని లైఫ్ సర్టిఫికేట్ సబ్‌మిట్ చేస్తున్నారని చెప్పింది. కానీ నాకు వేలిముద్రలు పడవు గీతలన్నీ అరిగిపోయాయి. పైగా గట్టిగా నొక్కమంటారు. అంత బలంగా నొక్కడం నాకు రాలేదు. నాకు ఎలా తెలుసు అంటే, మొన్న కొత్త సెల్‌ఫోన్ కనెక్షన్ కోసం, వేలిముద్రలు కావాలన్నారు. అప్పుడు తెలిసింది నాకు. చివరకి, నా మనవరాలి పేరు మీద కనెక్షన్ తీసుకున్నాను.

అయినా సుబ్బరంగా పెన్షన్ ఆఫీసుకి వెళ్లి ఇవ్వకుండా, వాళ్లకి జీతాలిచ్చి కూర్చోబెట్టి, సీనియర్ సిటిజన్స్ ఇలా "అక్కడకి పొమ్మని ఇక్కడకి పొమ్మని తిప్పడం ఏమిటి? బుద్ధి లేదు వీళ్లకి" అంటూ లైఫ్ సర్టిఫికేట్ గురించి సమాచారం ఇస్తూ తన గోడు అంతా చెప్పింది ఉమ.

సరే! రేపు నేనొకసారి 'మీ సేవ' ఆఫీసుకి వెళ్లి వివరాలు కనుక్కొస్తాను అన్నాను.

మర్నాడు మా ఇంటి దగ్గరలో వునన మీ సేవా కేంద్రానికి నా ఆధార్ కార్డు, పెన్షన్ కార్డు, ఇంకా ఏమన్నా అవసరమంటారేమోనని, ఓటరు కార్డు, పాన్ కార్డు, వగైరా నా దగ్గర వున్న కార్డులన్నీ బ్యాగ్‌లో వేసుకుని వెళ్లాను. ఇంకా ఎవరికీ ఈ విషయం తెలీలేదో ఏమో, జనం ఎక్కువలేరు.

నేను నా కార్డులన్నీ తీస్తుంటే ఆధార్ ఒక్కటే ఇవ్వండి అని తీసుకుని, వేలిముద్ర వేయమంది. బొటనవేలితో మొదలుపెట్టి, చూపుడు వేలు, మధ్యవేలు, వుంగరం వేలు ఇలా అన్ని వేలిముద్రలూ తీసుకుంది. తీసుకోవాలి కామోల్సు అనుకున్నా. కానీ, మీ

వేలిముద్రలు రావడం లేదు. కాసేపు ఆగండి అంటూ నా వెనుక నుంచున్న ఇంకొక పెద్దాయన్ని పిలిచింది. ఆయనకీ ఇదే ప్రాబ్లమ్ వచ్చింది. చివరకి మళ్లీ నన్ను పిలిచి అరచేతికి సానిటైజర్ పూసి తీసింది అప్పుడు వచ్చింది. బతుకు జీవుడా అదేదో ముందరే చెయ్యచ్చుగా అనుకుంటూ, ఏదో యుద్ధంలో గెలిచినంత ఆనందంగా బయటికొచ్చాను.

అక్కడే ఇంకొక కౌంటర్ ముందు చాలామంది వున్నారు. అందరూ వయోజనులే! విషయం ఏమిటని అని ఆరా తీస్తే, వాళ్లందరికీ వేలిముద్రలు పడలేదుట. ఐరిస్ – కంటి పాపల స్కాన్ తీస్తున్నారుట. ఇంకా నయం. నా పని అయిపోయింది అనుకుంటూ ఇంటికి వచ్చి ఉమకి ఫోన్ చేసి విషయం అంతా చెప్పాను.

"అమ్మో! నాకు ఎలాగూ వేలిముద్రలు రావు. కంటిపాపల స్కానింగ్ అంటే, క్యాటరాక్ట్ ఆపరేషన్ చేసుకున్న వారికి, ఈ ఐరిస్ కూడా రాదుట. నాకు రెండు కళ్లకీ క్యాటరాక్ట్ ఆపరేషన్ అయింది" అంటూ మళ్లీ తన భయాన్నీ వెలిబుచ్చింది ఉమ. పైగా ఈ మీ సేవా కేంద్రాల్లో జనం బాగా వస్తారు వేరేవేరే పనుల మీద. కరోనా భయం కూడా వుంది. ఎలాగో ఏమో ఈసారి. నాకు పెన్షన్ ఆగిపోతుందేమో! ఉమ భయం.

పోస్ట్ ఆఫీసుల్లో కూడా లైఫ్ సర్టిఫికేట్ సబ్‌మిట్ చెయ్యచ్చని మర్నాడు వార్తాపత్రికల్లో పడింది. మనం వెళ్లక్కరలేదుట. ఫోన్ చేస్తే పోస్ట్‌మ్యాన్ ఇంటికి వస్తాడని చెప్పారు. ఈసారి బయటికి వెళ్లకుండా, మీ దగ్గరలో పోస్ట్ ఆఫీసుకి ఫోన్ చెయ్యి అని చెప్పాను.

"అలాగే చేసింది కానీ ఎంత ప్రయత్నించినా వాళ్లూ వేలుముద్రలు తీసుకోలేకపోయారుట. ఐరిస్ ద్వారానే ఇవ్వాలంటూ సలహా ఇచ్చి వెళ్లాడు పోస్ట్‌మ్యాన్" అంటూ మరింత దిగులుగా చెప్పింది ఉమ.

మర్నాడు నాకు రిజిష్టరు పోస్ట్ వచ్చిందని, మా ఏరియా పోస్ట్ వుమన్ వచ్చింది. సైకిల్ మీద లెటర్స్ ఇస్తూ అందరితో సరదాగా మాట్లాడుతుంది మా పోస్ట్ వుమన్ లక్ష్మి.

"ఏమిటి నువ్వు కూడా ఇళ్లకి వెళ్లి లైఫ్ సర్టిఫికేట్స్ సబ్‌మిట్ చేస్తున్నావా" అని అడిగాను.

"అవునండీ! మాకు వున్న పనికి, ఇది ఒకటి ఎక్స్‌ట్రా డ్యూటీ. సీనియర్ సిటిజెన్స్ 'మాత్రమే ఇళ్లకి పిలుస్తారు కదా! వాళ్లకి ఫింగర్ ప్రింట్స్ సరిగ్గా రావు. ఒక్కొక్కరి దగ్గర అరగంట నుంచి గంట కూడా పడుతోంది. మళ్లీ ఉత్తరాలు బట్వాడా చెయ్యాలి' అంటూ పోస్టల్ వాళ్ల బాధలు వెళ్లగక్కింది. పీత కష్టాలు పీతవి మరి.

"ఇలా చేసినందుకు మీకు ఏమన్నా ఎక్స్‌ట్రా డబ్బులు ఇస్తారా?" అని అడిగా.

"ఒక్క ఇంటికి 15 రూపాయలు ఇస్తారు. రోజుకి 3 వేలిముద్రలు తీసుకుంటే 45 రూపాయలు ఇస్తారు".

"అంతేనా! మా ఫ్రెండ్ దగ్గర 60 రూపాయలు తీసుకున్నారుగా" అన్నాను.

"అది పోస్టల్ డిపార్టుమెంట్‌కి వెళ్తుంది. మాకు మాత్రం పదిహేను రూపాయలే!" అని చెప్పింది.

హాయిగా పెన్షన్ ఆఫీసుకెళ్లి ఇచ్చేవాళ్లం. ఈ సంవత్సరం ఈ వేలిముద్రల గోల ఏమిటో? పోనీ ఆ "జీవన్ ప్రమాణ్ యాప్" అన్నా సరిగ్గా డౌన్‌లోడ్ అయ్యేలా చూడచ్చు కదా! మేము బతికే వున్నామని చెప్పడానికి చచ్చే చావు వచ్చిపడింది.

సరే మళ్లీ 4 రోజులకి 'టి.యాప్' డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వెంటనే వస్తోంది అన్నారు.

అదే విషయం ఉమకి చెప్పాను. "ఏదో తంటాలు పడి, మనుమరాలిని బతిమిలాడి ఆ "యాప్" తెరిపించి, వివరాలన్నీ నింపించాను. "సక్సెస్‌ఫుల్లీ సబ్‌మిటెడ్" అన్న సందేశం వచ్చింది. కానీ రశీదు రాలేదు తరువాత ఎవరో అన్నారు. "మీ సేవా" వాళ్లకు ఆదాయం తగ్గిపోయిందని వాళ్లు రశీదు రాకుండా బ్లాక్ చేస్తున్నారని. నిజమో కాదో తెలీదు కానీ నాకు రశీదు రాలేదు ఇప్పటిదాకా! కానీ సబ్‌మిట్ అయింది కదా అని, ఆ విషయం అంతటితో వదిలేశా! అంది ఉమ.


"హమ్మయ్య మనిద్దరి లైఫ్ సర్టిఫికేట్స్ సబ్‌మిట్ చేశాము, ఎలాగో తిప్పలు పడి. ఇంకా ఎంతమంది పెద్ద వాళ్లు ఎన్ని తిప్పలు పడుతున్నారో? అనుకుంటూ ఏదో పెద్ద ఘనకార్యం చేసినట్టు సంబరపడ్డాం.

'ఒక ఏడాది దాకా పెన్షన్‌కి ఢోకా లేదు. వచ్చే సంవత్సరం దాకా బతికుంటే అప్పటి తిప్పలు అప్పుడు పడదాం" అనుకున్నాము.

ఒక వారం రోజుల తరువాత ఉమ ఫోన్ చేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఒక జి.వో. ఇచ్చింది. పెన్షన్ ఆఫీసుకెళ్లి కూడా లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వచ్చుట అంటూ.

ఒక నెల రోజులు మానసిక అస్థిమితకు గురిచేసి, వేలిముద్రలు రాక అయోమయంలో పడవేసి, రెడ్డొచ్చే మొదలాడు అన్నట్టు జి.వో. జారీ చేసింది ప్రభుత్వం.

మనం బతికే వున్నామని నిరూపించే లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వడానికి చచ్చి బతికినంత పనయింది.




సింగపూర్ తెలుగు మహాసభలలో నేను రాసిన "అక్షరం అస్తిత్వమైన వేళ" పుస్తక
ఆవిష్కరణ గావిస్తున్న మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు తదితరులు కలరు



